


విశ్వతచక్షురుత విశ్వతో ముఖో విశ్వతో బాహురుత విశ్వతస్పాత్
సమ్ బాహుభ్యాం ధమతి సమ్ పతత్త్రైర్ద్యావాభూమీ జనయన్‌దేవ ఏకః

ఋగ్వేదము - 10.81.3.

అన్ని వైపుల కళ్ళు, చేతులు, ముఖములు, కాళ్ళు
కలిగిన అద్వితీయుడు. అయిన పరమాత్మ
గతిశీలమైన పృథ్విని, ద్యులోకమును
ఏ సహాయము లేకుండా సృజించెను.
వాటిని సమ్యక్ సంచాలన చేసేది ఆయన ఒక్కరే.

# ఆధ్యాత్మిక విద్య లక్ష్యము
# అనుగ్రహ మాలామంత్రము



డా॥ ఎమ్. శ్రీరామకృష్ణ M.Sc., Ph.D.

ఎడిటర్ : గురు సీతారామ్

శ్రీ వికృతి నామ సంవత్సరం,
ఆశ్వయుజ బహుళ తదియ, సోమవారం,
25.10.10.

వెల : రూ. 30.00

ప్రతులకు :
పి. సీతారాముడు,
కోమటిగుంట,
కాళ్ల మండలము,
పశ్చిమ గోదావరి జిల్లా.
ఫోన్ నెం. : 08816 - 241359, 90106 47325

డి.టి.పి. :
ఇంద్రా, కోమటిగుంట

పబ్లిషర్స్ :
విశ్వకర్మ పబ్లికేషన్స్, కోమటిగుంట

ప్రింటర్స్ :
సాయి ఆఫ్‌సెట్ ప్రింటర్స్, భీమవరం



# ఆధ్యాత్మిక విద్య లక్ష్యము
# అనుగ్రహ మాలామంత్రము

1997 జనవరి నెలలో డా॥ ఎమ్. శ్రీరామకృష్ణగారు
ఇచ్చిన ఉపన్యాసాలతో ఈ పుస్తకము వెలువడినది

స్వర్గీయ శ్రీమతి కొంపెల్ల సీతామహలక్ష్మిగారి జ్ఞాపకార్థం
వారి కుమారులు శ్రీ కొంపెల్ల సత్యనారాయణగారు
అందజేసిన 10,200.00 రూపాయల అంశదానముతో
ఈ పుస్తకము పునర్ముద్రించబడినది

# తొలి పలుకు

పాఠకులకు .........

ఆధ్యాత్మిక జీవితం గురించి మనకు ఒక స్పష్టమైనటువంటి అవగాహన ఉండాలి. ఆ అవగాహన ప్రకారం మనం జీవించగలగాలి. జీవిస్తూ ఇతరుల్ని కూడా అలా జీవించమని మనం తెలపాలి.

ఈ ఆధ్యాత్మిక విజ్ఞానము అనే మాటకి మీరు క్రొత్తది ఏమీ చేయటంలేదు అన్నది గుర్తుంచుకోండి. ఎలక్ట్రిసిటీ కనిపెడతాడు. కని పెట్టటం అంటే చూడటం అనేకదా! కని - పెట్టుట. డిస్కవరీ - ఉన్న దానిని మళ్ళీ తెలుసుకొనుట.

అంచేత ఈ సైన్సు అంతా ఏమిటంటే, ఉన్నదాన్నే గమనించు కోవటం. లేని దాన్ని సైంటిస్టులు కూడా పుట్టించలేరు. ఆధ్యాత్మికవేత్త కూడా పుట్టించలేడు.

కాని సైన్సులో విభిన్నమైనటువంటి సైన్సు చదువుకుంటోన్న ప్పుడు దానికి కావలసినటువంటి పరికరాలు మనకు కావాలి.

బోటనీ స్టూడెంటు ఉంటాడు, వాడికి కావలసినటువంటి డెసిషను బాక్సు వేరే ఉంటుంది. జువాలజీ స్టూడెంటు ఉంటాడు, వాడికి కావలసిన ఉపకరణాలు వేరే ఉంటాయి. ఇంజనీరింగ్ స్టూడెంటు ఉంటాడు, వాడికి కావలసిన పరికరాలు వేరే ఉంటాయి.

ఆ పరికరాలు లేకుండా వాడిని ఇంజనీరింగ్ స్టూడెంటుగా చదువుకోమంటే వాడు చదువుకోలేడు. పనిముట్లు కావాలి మనకి.



ఆధ్యాత్మిక జీవితంలో కూడా పనిముట్లు లేకుండా మనమేమి ఉపయోగించుకోలేం. ఈ అవగాహనని ప్రజలకి అందజేయవలసినటు వంటి బాధ్యత మన మీద ఉంది.

Spiritualism is a science.

ఎటువంటి విజ్ఞానము?

***విజ్ఞానము అంటే అర్థం ఏమిటంటే,***

ప్రకృతిలో ఆల్‌రెడీ ఉన్నది. లేనిది క్రియేట్ చేయలేం మనం.

ప్రకృతిలో ఉన్నటువంటి ఆ రహస్యమయ శక్తులను భౌతిక శాస్త్రవేత్త ఏ విధంగా అయితే వాటి నియమాలను అర్థం చేసుకొని, ఆ నియమాలను ఉపయోగించుకొని తగిన ఫలితాలు పొందుతాడో, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త ఆధ్యాత్మిక జగత్తులోని నియమాలను ఉపయోగిం చుకుంటాడు.

నియమాలను మనం ఉపయోగించుకోగలమే కాని, నియ మాలను మనం మార్చలేం. అది కూడా మనం గుర్తించాలి.

You can't change it.

ఆధ్యాత్మిక విద్య యొక్క లక్ష్యాన్ని, ఆ లక్ష్యాన్ని సాధించడానికి మన దగ్గర ఉన్న ఉపకరణాలను ఉపయోగించుకొంటూ, ఆ లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన మొదటి అడుగులు వేయటానికి పాఠకు లకు ఈ పుస్తకం ఉపకరిస్తుందని భావిస్తున్నాను.

శ్రీరామకృష్ణ

# విషయ సూచిక

**1. ఆధ్యాత్మిక విద్య లక్ష్యము - అపోహలు**

| | |
|---|---|
| -- ప్రాచీన భారతావని ప్రభ | 7 |
| -- ఆధ్యాత్మికత యొక్క లక్ష్యము - ఓం | 10 |
| -- ఆధ్యాత్మిక రంగంలో ఉన్న అపోహలు | 18 |
| -- విశ్వశ్రేయస్సుకే ఆధ్యాత్మిక విద్య | 25 |

**2. గురుతత్త్వము - అవగాహన, అపోహలు**

| | |
|---|---|
| -- గురువు అనుగ్రహం కంటే శిష్యుడి ప్రయత్నమే ముఖ్యం | 31 |
| -- గురువు అన్ని చోట్లా లభిస్తాడు | 35 |
| -- గురువుని దర్శించే విధానము | 42 |
| -- గురువు యొక్క సర్వసమర్థత | 47 |

**3. అనుగ్రహ మాలామంత్రము** 60

**4. సాధనా విధానము**

| | |
|---|---|
| -- 24 గంటలూ మీరు సాధకులే | 83 |
| -- సాధనలో ఉండవలసిన తీవ్రత | 86 |
| -- ఓంకార సాధన | 89 |
| -- స్థల ప్రదక్షిణ | 93 |



# ప్రాచీన భారతావని ప్రభ

ఓం ............. ఓం ............. ఓం .............

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మః తస్మై శ్రీగురవేనమః

అఖండమండలాకారం వ్యాప్తంయేన చరాచరమ్
యత్పదం దర్శితంయేన తస్మై శ్రీగురవేనమః

---

ప్రాచీన భారతదేశంలో నలంద, తక్షశిల అనే రెండు విశ్వ విద్యాలయాలు ప్రపంచ ప్రఖ్యాతిని పొందాయి. ఆ ప్రాచీన కాలంలో ఈనాడు ఉన్నటువంటి ట్రాన్సుపోర్ట్ సౌకర్యాలు లేవు. ఓడలు లేవు, బస్సులు లేవు, రోడ్లు సమానంగా లేవు.

- అయినప్పటికీ కూడా విదేశాల నుండి అనేక మంది ఆ అడ్డం కుల్ని అతి కష్టం మీద దాటుకుంటూ, ఆ విశ్వ విద్యాలయాలలో చదువుకోవటానికి వస్తూవుండేవారు.
- ఈనాడు ఉన్న ప్రచార సాధనాలు లేనప్పటికీ, ఈనాటి టి.వీలు అవీ లేనప్పటికీ కూడా భారతదేశము చాలా గొప్పదేశము, అక్కడ మనుష్యులను దేవతలుగా మార్చివేసేటటువంటి విద్య ఉన్నది అని ఆనోట ఈనోట అలా విశ్వమంతా పాకిపోయింది.

ఈనాడు కమ్యూనికేషన్స్ చాలా ఈజీ. కాని అప్పుడు కమ్యూనికేషన్స్ విధానం ఏమీ లేదు. మాట ద్వారా, నోటి మాట ద్వారా

అందుకోవాలి. అయినా ప్రపంచమంతటా ఆ ప్రభ వెళ్ళింది.

✧ సముద్రమార్గం గుండా భారతదేశానికి ఎలా వెళ్ళాలో తెలియక పోయినా, భారతదేశానికి వెళ్ళాలి అనే ఆకాంక్షతో చాలా మంది క్రొత్త క్రొత్త దేశాలను కనిపెట్టారు.

కొలంబస్ రాదల్చుకున్నది ఇండియాకి, ప్రయత్నించింది ఇండియాకి రావాలని. ఎక్కడో స్పెయిన్ నుంచి బయలుదేరి ఒక భూభాగానికి వచ్చాడు. ఇది వరకు వాళ్ళకు తెలియనటువంటి భూ భాగానికి సముద్రమార్గంలో చేరుకొని, అది ఇండియా అనుకొన్నాడు, అమెరికాగా మారిందది.

శ్రీ ఇండియా అనుకొని ఇండియాకాని ప్రదేశానికి, అమెరికాకి ఎంత వేల్యూ ఉందో ఇప్పుడు చూస్తున్నారు కదా!

-- అందరూ అమెరికా వెళ్ళిపోవాలనుకుంటున్నారు.

-- ఎంచేతంటే, అది ఇండియా కాకపోయినా, మొట్టమొదట అది ఇండియా అనుకొని దిగారు కనుక.

శ్రీ అంటే, నిజమైన ఇండియా ఎంత గొప్పదో ఊహించుకోండి.

అది మీరు అర్థం చేసుకోవాలి. అది అర్థం చేసుకొంటేనే ఈ ఆధ్యాత్మిక విద్య యొక్క ఉద్దేశ్యాలు మీకు అర్థం అవుతాయి.

శ్రీ విదేశాలలో ఉన్నటువంటి వ్యక్తులు ప్రాణాలైనా ఇచ్చేయటానికి రెడీ అయిపోయి, అతి క్లిష్టమైనటువంటి సముద్రమార్గం, హిమాలయ మార్గం వీటన్నిటిని దాటుకొని ఇక్కడకి రావాలని ఎందుకు ప్రయత్నించారు?



-- ఈ విద్యలో ఉన్నటువంటి గొప్పదనం ఏమిటి?

అది కనుక మీరు మర్చిపోతే మిగతా ఇతర ఆధ్యాత్మిక సంస్థల లాగానే మన కార్యక్రమాలు జరుగుతాయి తప్ప ఉద్దేశ్యం నెరవేరదు.

శ్రీ రెండు భజనలు చేసుకొంటాం, మా కోర్కెలు మేం తీర్చేసు కొంటాం అంటే దయచేసి ఇప్పుడే మీరు అర్థం చేసుకోండి, అవి జరగవు ఇక్కడ.

✧ ఏం జరుగుతాయి ఇక్కడ అంటే, మీలో కూడా దేవత్వము వచ్చి, ఆ దేవత్వస్థితి వల్ల పరిస్థితులు మారతాయి.

ఎంచేత? దేవతలు ఎక్కడ ఉంటారో అదే స్వర్గము.
స్వర్గంలో దేవతలు ఉండరు,
దేవతలు ఎక్కడ ఉంటారో ఆ ప్రదేశం స్వర్గం అవుతుంది.

శ్రీ అంచేత మన భారతదేశము కూడా స్వర్గతుల్యంగా ఎందు కయింది అంటే, ఈ స్థాయి వ్యక్తులు జీవించేవారు కనుక.

ఆ స్థాయికి ఎదగడమే మన ఉద్దేశ్యము.

శ్రీ ఒక సంవత్సర కాలంలో అటువంటి స్థితిని పొందవచ్చును.

పొందుతారు అనేం చెప్పడం లేదు నేను. పొందవచ్చును అనే నమ్మకం కలుగుతుంది మీకు. ఋషులు చెప్పినటువంటి మాటలు వృథా వాక్కులు కావు. ఆ దేవత్వము గురించి దేని గురించి అయితే మనం మాట్లాడుకొంటున్నామో, ఆ దేవత్వము ఒక భ్రమ కాదు అనేది మీకు అర్థం అవుతుంది.

# ఆధ్యాత్మికత యొక్క లక్ష్యము - ఓం

నిత్యజీవితంలో ఆధ్యాత్మికత!
అదే మన సమస్య, లక్ష్యమూ. రెండూ అదే.

ఈ ఆధ్యాత్మికత అనే పదానికి చాలా చాలా నిర్వచనాలు, చాలా చాలా వివరణలు ఎవరి స్థాయికి తగ్గట్టు వారు, ఎవరి కృషిని బట్టి వారు చెప్పుకుంటూ వస్తారు.

కుండలినీ సాధనే మా లక్ష్యమని కొందరు,
మంత్రసాధనే మా లక్ష్యమని కొందరు,
మోక్షమూ, ముక్తీ మా లక్ష్యమని కొందరు,
ఇలా రకరకాలైన లక్ష్యాలతో రకరకాలైన భావాలతో ఆధ్యాత్మికతలోకి అడుగు పెడుతున్నాం.

కానీ గత 20 ఏళ్ళుగా నా అనుభవంలో అర్థం చేసుకున్నటువంటి విషయాలు అందరికీ తెలియజేస్తే, ఆధ్యాత్మికతలో ఉన్నటువంటి కన్ఫ్యూజన్స్ మీకు పోతాయి, కొన్ని సందేహాలు ఉండవు అనే దృష్టితో ఇటువంటి ప్రయత్నాలు మొదలుపెట్టాను.

**ఇందులో నేను ముఖ్యంగా చెప్పదల్చుకున్నది ఏమిటంటే,**

- విషయ పరిజ్ఞానం లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడే స్వాతంత్ర్యం ఆధ్యాత్మికతలోనే కన్పిస్తుంది.
  ముందు అది పోగొట్టగలిగితే చాలు!



ఏది మాట్లాడవచ్చును, ఏది మాట్లాడకూడదు అనేది ముందు మనకి స్పష్టంగా తెలియాలి.

చాలామంది డాక్టర్ల దగ్గర చూపించుకొన్నా వ్యాధి తగ్గకపోతే చివరకు స్పెషలిస్ట్ డాక్టరు దగ్గరకు వెళతాం. ఆయన అభిప్రాయం తీసుకుంటాం. ఆయన దగ్గరకు వెళ్ళేక, మనకి నచ్చినా నచ్చకపోయినా ఆయన చెప్పినట్టు చేస్తాం.

నిత్యజీవితంలో ఏదైనా రిఫరెన్సు కావలసి వచ్చిపుడు ఒక నిపుణిడి అభిప్రాయం తీసుకున్న తరవాత ప్రక్కవాళ్ళ ఒపీనియన్ మనం తీసుకోం.

**కానీ ఆధ్యాత్మికతలో తమాషా ఏమిటంటే,**

అందరూ నిష్ణాతులే.

But experts about what? దేంట్లో నిష్ణాతులని?

అక్కడే చాలా పెద్ద కన్ఫ్యూజన్ వచ్చింది. దేనిని గురించి మనం అడగాలి, ప్రశ్నించాలి అన్నది తెలుసుకోవడం మానేసాం. మిగతాదంతా ఆధ్యాత్మిక జగత్తులోకి వచ్చేస్తుంది.

అసలైన సిసలైన ఫండమెంటల్ ప్రశ్న ఏది? ఆధ్యాత్మిక జగత్తులో మీరు ఏ ప్రశ్న వేస్తే, ఆధ్యాత్మిక జగత్తులో మీరు ప్రవేశించగలరో, ఆ ప్రశ్న తప్ప మిగతావన్నీ ఆధ్యాత్మిక జగత్తులో కన్పిస్తున్నాయి. ఇప్పుడు ముందు దాన్ని సవరించుకోవాలి ఆధ్యాత్మిక జగత్తులో.

అంచేత నేను చెప్పే విషయాలు కొన్ని మీకు నచ్చకపోవచ్చు.
కొన్ని మీకు బాధ కలిగించవచ్చు.

కొన్ని ఓహో, ఇదేదో బాగానే వుంది అన్పించవచ్చు.

కానీ నేను చెప్పదల్చుకున్నదేదో చెప్పనీయండి.

చెప్పడమే కాకుండా మీ చేత చేయించడానికి నేను ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తాను.

It is a more practical attempt.

నేను సిద్ధాంతపరంగా ఏమీ చెప్పదల్చుకోలేదు. కేవలం ఆ కన్‌ఫ్యూజన్స్ మనకు ఎందుకు వస్తున్నాయో అనే విశ్లేషణ ఇస్తానే తప్ప, ఒక క్రొత్త సిద్ధాంతాన్ని నేను చెప్పబోవడంలేదు.

**నేను చెప్పేదాంట్లో ముఖ్యమైన దేమిటంటే,**

ఆధ్యాత్మిక జగత్తులో మన గోల్ ఏమిటి?

మన లక్ష్యం ఏమిటి?

ప్రతీరోజూ, ప్రతీసారీ మనం గుర్తు చేసుకుంటామే తప్ప, అదే మన గోల్, అదే మన లక్ష్యం అన్నది మనం మర్చిపోతున్నాం. దాన్ని గుర్తుచేయడమే నా ప్రయత్నం.

కాలేజీలో ఇంటర్మీడియేట్ స్టూడెంటు "బి.ఏ. చదవబోతున్నాను" అంటాడు.
బి.ఏ చదువుతున్న స్టూడెంటు "బి.ఏ. చదువుతున్నాను" అంటాడు.
బి.ఏ పాసయినవాడు "బి.ఏ. పాసయ్యాను" అంటాడు.

వీళ్ళు ముగ్గురూ కూడా బి.ఏ. అంటారు. ఇంటర్మీడియేట్ చదువుతున్నవాడిని, నువ్వేం చదవబోతున్నావురా అంటే బి.ఏ. అంటాడు. చదువుతున్న వాడిని నువ్వేం చదువుతున్నావురా అంటే బి.ఏ. అంటాడు. చదివేసిన వాడిని నువ్వేం చదివావు అంటే బి.ఏ. అంటాడు. అంతేగదా!



⊕ అలాగే ఆధ్యాత్మిక జగత్తులో "ఓం" అంటూ ఉంటాం.

నేర్చుకొనబోయేది,

నేర్చుకునేది, In the process of learning,

నేర్చుకున్న తరవాత కూడా మీరు అనేది "ఓం" అనే.

అదే మీరు మర్చిపోయారు. అదే మన లక్ష్యం అని, అదే మన సాధన మొత్తం అని మర్చిపోయాం మనం.

కానీ ఋషులు మర్చిపోలేదు.
ఓం అనకుండా ఏం చేయకండి మీరు అంటారు.
ఏ మంత్రాన్ని చెప్పుకున్నా ముందు ఓం అంటుంటాం.

ఆ "ఓం" మన లక్ష్యం.

అదే మన గోల్,

అదే మన సిలబసు.

ఆ సిలబసు మనకు స్పష్టంగా అర్థమవ్వాలి.

ఆ ఓం అనేటప్పుడు దేనికి మనం ప్రయత్నం చేస్తున్నాం? ఏ లక్ష్యాన్ని సాధించడం కోసం మనం కష్టపడుతున్నాం అనేది తెలియక పోవడం వల్ల ఈ గందరగోళాలన్నీ వస్తున్నాయి.

**ఏమిటీ ఆ ఓం?**

ఓంలో మూడు అక్షరాలు ఉన్నాయి.

అ + ఉ + మ = ఓం

చాలా మంది నాతో "నేను చాలా సాధనలు చేస్తాను, చాలా మంది గురువుల దగ్గరకు వెళ్తున్నాను" అని చెప్తూవుంటారు. వెళితే తప్పేంలేదు.

⊕ మీకు గోల్ అంటూ తెలిస్తే, ఎంతమంది గురువుల దగ్గరకైనా వెళ్ళవచ్చును.

-- గోల్ తెలియకపోతే ఎంతమంది దగ్గరకి వెళ్ళినా పట్టుకోలేరు.

అదీ నేను స్ట్రెస్ చేస్తున్న పాయింట్.

శ్రీ మీరు గురువులని పట్టుకోకండి,
సబ్జక్ట్‌ని పట్టుకోండి.

సబ్జక్ట్‌ని పట్టుకొంటే అందరు గురువులు ఒక్కటే.

⊕ సబ్జక్ట్‌ని పట్టుకోకుండా అందరు గురువులూ ఒక్కటే అని నోటితో అంటున్నాం కాబట్టి ఈ గందరగోళాలన్నీ వస్తున్నాయి.

ఈ గందరగోళాన్ని పూర్తిగా పోగొట్టుకోవడానికి "అ, ఉ, మ" అంటే ఏమిటో పూర్తిగా అర్థం చేసుకుందాం.

అ - మన స్థూలశరీరము. మన ఫిజకల్ బోడీ.

ఉ - సూక్ష్మశరీరము. సూక్ష్మశరీరము అంటే పూర్తిగా అవగాహనలోకి రాకపోతే మన మనస్సు అని అనుకొందాం.

మ - మన మనస్సుని, శరీరాన్ని కూడా నడిపే చేతనత్వము, consciousness. ఆధ్యాత్మికభాషలో దాన్ని కారణశరీరం అంటాం.



శ్రీ మీరు ఆధ్యాత్మిక జగత్తులో ఏ సాధన చేసినా, ఏ సహస్ర నామాలు చేసినా, ఏ హఠయోగం చేసినా, మీరు ఏదైనా చేసుకోండి. దానికి మీరు ఆధ్యాత్మికత అని పేరు పెడితే మాత్రం ఈ మూడింట్లో ఏదో ఒక దానిలో మార్పు జరుగుతూ ఉండాలి.

మీ ఫిజకల్ బోడీలో అయినా మార్పు రావాలి.
మీ మనస్సులో అయినా మార్పు రావాలి,
మీ చేతనత్వములో అయినా మార్పు రావాలి.

శ్రీ సాధన వల్ల మీ స్థూల, సూక్ష్మ, కారణ శరీరాల్లో మార్పు వస్తేనే దాన్ని మీరు కరెక్టుగా చేసినట్లు, లేకపోతే చెయ్యనట్లే.

⊕ మన జీవితం మనం నేర్చుకున్నటువంటి ఆధ్యాత్మికతకు ఆయువు పట్టుగా ఉండాలి.

అది నేర్చుకోవడానికి మనం ప్రయత్నిస్తున్నాం.

నేను గుంటూరులో కెమిస్ట్రీ లెక్చరరుగా జాయినయిన క్రొత్తలో కెమిస్ట్రీ అంటే ఇంత మంచి సబ్జెక్టా అని స్టూడెంట్సు తెలుసుకోవాలని, ఎంతో జాగ్రత్తగా, వివరంగా ఒక చాప్టర్‌నే చెప్పి, చెప్పి ఆరు నెలల పాటు చెప్పాను. హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంటు ఇలాగయితే సిలబస్ పూర్తికాదు రామకృష్ణా అన్నాసరే విన్పించుకోకుండా వాళ్లకు వివరించి చెప్పాను. ఇంత స్పష్టంగా చెప్పాలని ఇంత వరకూ ఏ లెక్చరర్‌కి తెలియదు, నేను కాబట్టి చెప్పాను అని సంతోషించాను.

కానీ తీరా మా హెడ్ వాళ్ళని పిలిచి, ఏం చెప్పారయ్యా మీ కెమిస్ట్రీ మాస్టారు అంటే, ఏమో సార్! మాకు తెలియదు అన్నారు.

నిజంగా జరిగిన సంఘటన ఇది. ఒక్కమాట కూడా నేను ఎక్కువ చెప్పలేదు.

- ఈ ఆధ్యాత్మిక జగత్తులో కూడా అంతే! ఓహో.. ఆహాలే!

  "ఈయన చాలా బాగా చెప్పాడు, ఆ పుస్తకం చాలా బాగుంది, ఈ పుస్తకం చాలా బాగుంది!"

  ఇంతకీ మీకేం అర్థమయింది అంటే "నాకు తెలియదండీ!" అంటాం.

*తెలియదు అనడానికి నిదర్శనం ఏమిటంటే,*

మన జీవితంలో శాంతి రావడంలేదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః.

స్థూల సూక్ష్మ కారణ శరీరాలలో ఆ శాంతి రావడం లేదు.

రాలేదు అంటే ఆధ్యాత్మికత అంటే ఏమిటో మీకు అర్థం కాలేదు! అదీ నేను చెప్పదలచుకున్నాను. మొత్తం సిలబస్ ఇంతే.

కాని సిలబస్ ఇంతే అని అనుకుంటే అయిపోయిందా? అవలేదు.

డాక్టరు అంటే ఎవడు? రోగాన్ని నిర్ధారించుకుని దానికి తగిన మందు వేసేవాడు డాక్టరు. అంతే కదా!

కానీ ఆ స్థితికి వాడు వెళ్ళడం చాలా కష్టం.

అలాగే ఈ ఫిజికల్ బోడీలో ఉన్నటువంటి అశాంతులు, మనస్సులో ఉన్నటువంటి అశాంతులు తొలగి,



మనస్సు, ఫిజికల్ శరీరము కాకుండా చేతనత్వము అని ఇంకొకటి ఉంది, consciousness, దాని గురించి తరవాత మెల్లి మెల్లిగా తెలుసుకుందాం.

- ఈ మూడింట్లో మెల్లిమెల్లిగా శాంతి రావడమే మన లక్ష్యము.
- మన ఆధ్యాత్మికతలో కోరికలు ఎన్ని తీరాయి అన్నది లక్ష్యము కాదు.

కానీ మనం ఏ గురు చరిత్ర తీసినా ఎంత మంది ఎన్ని కోరికలు తీర్చుకున్నారు అన్నది ఒక పెద్ద లిస్ట్ కనిపిస్తుంది.

అయితే కోరికలు కోరుకోవడం తప్పా?

తప్పని అనడం లేదు. అవసరమే అది.

మనకు శాంతి కావాలంటే మన బాధలు కొన్ని పోతేనేకదా శాంతి వచ్చేది.

ఎక్కడో ఒక చోట మనం కూర్చుని ఇటువంటివి మట్లాడుకోవాలి అంటే కాస్త సైలెంట్‌గా ఎవరూ మనల్ని డిస్టర్బ్ చేయకుండా ఎవరైనా ఏర్పాటు చేస్తే కదా మనం కూర్చోగలుగుతాం. అదే బయట అయితే ఏం కూర్చోగలుగుతాం? శాంతి ఉండదు.

- అంచేత మీరు ఏ ఉపాసన చేస్తున్నా, ఏ గురువు దగ్గరకి వెళ్ళినా మొదట నేను చెప్పినట్లు స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలలో మీకు శాంతి లభిస్తూ ఉంటే మీరు కరెక్ట్ మార్గంలో ఉన్నారన్న మాట.

# ఆధ్యాత్మిక రంగంలో ఉన్న అపోహలు

✡ గురువుల యొక్క చరిత్రలలో జరిగేటటువంటి చమత్కారాలన్నీ కూడా సత్యాలే.

కానీ ఆ చమత్కారాలే మన లక్ష్యం కాదు.

"గాయత్రి ఇన్ని సంవత్సరాల నుంచి చేస్తున్నాను మాస్టారు! నాకేం లాభం రాలేదు" అంటే,

అవునయ్యా! లాభం ఉండదనే చెప్తున్నాను.

నువ్వు బి.ఇ. చదువుతూ ఉంటే ముందు రెండు లక్షలు వదులుతాయి. తరవాత ఉద్యోగం వస్తుందో రాదో దేవుడికే తెలియాలి!

మరి అక్కడ ఏం లాభం వచ్చిందని ఎవడూ క్వశ్చన్ వెయ్యడం లేదు.

✡ అదే ఇక్కడ అయితే, ఒక రెండు నిముషాలు గాయత్రి చేస్తున్నాం, మూడు నిముషాలు ముక్కు పట్టుకున్నాం, నాకేం లాభం వచ్చింది అంటారు.

-- ఏం రాదు. ఎందుకొస్తుంది? మీ ప్రయత్నాన్ని బట్టి ఫలితాలు వస్తాయి. అది కూడా చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి.

రెండవది ఇప్పుడు నేను చెప్పబోయేది ఇంకా బాగా అర్థం చేసుకోండి.



ఒక భర్త తన భార్యకు ఒక డైమండ్ నెక్లెస్ ప్రజెంట్ చేశాడు. ధగధగా మెరసిపోతోంది. చాలా ఆనందించింది ఆవిడ, మురిసిపోయింది. ఆ ఆనందం చూచాక ఆ ఆనందంలో మొగుడు గబుక్కున నోరు జారాడు. 40 రూపాయలు పెట్టి కొనుక్కొచ్చాను నేను ఈ నెక్లెస్ నీకు అన్నాడు. ఆ ఆనందం అంతా పోయింది ఆవిడకు.

ఎందుచేత? 40 రూపాయలకు డైమండ్ నెక్లెస్ రాదు. ఒక్క డైమండ్ కూడా రాదు. ఇంక నెక్లెస్ ఎక్కడ్నుంచి వస్తుంది?

ఆ భావం అర్థమయింది కదా!

శ్రీ ఆధ్యాత్మికతలాంటి అద్భుతమైనటువంటి సాధనా ఫలితాలు మీరు ఒక్క రోజులో, ఒక్క గంటలో సాధించేశాము అనే భ్రమలో పడకండి. కొన్ని జన్మలు పడుతుంది.

శ్రీ ఆ జన్మలకి మీరు రెడీ అయితేనే
మీరు దీంట్లోకి అడుగు పెట్టండి.

అందుకే మీకు ముందే చెప్పాను, నేను చెప్పినవి మీకు నచ్చకపోవచ్చును అని.

"మాస్టారు, మీరు ఏదో 30 రోజులలో తమిళభాషలాగా షార్ట్ కట్స్ చెప్తారుకదా అని వచ్చాము మేము" అంటారేమో!

శ్రీ సారీ! 30 రోజులలో కాదు, కొన్ని జన్మలు మీరు దీనికి కేటాయించాలి. కృషి చేయాలి.

ఎంచేతంటే, మన సాధన బట్టి ఫలితాలు ఉంటాయి.

ఒక ఎంసెట్ పరీక్ష వ్రాయించడానికి పిల్లవాడిని ఎన్ని ముప్పు తిప్పలు పెట్టిస్తుంటారో కెమిస్ట్రీ లెక్చరర్‌గా నాకు తెలుసు. ఇంతా చేస్తే ఆ ఎంసెట్‌లో సీటు వస్తుందో లేదో గ్యారంటీ లేదు.

దానికి మీరు ఎంత అవస్థ పడి, ఎంత డబ్బు ఖర్చుపెట్టి, ఎంత చదువు చదివిస్తుంటారో.

వాడు 3 గంటలకి లేవాలంటే మీరు 2.30కే లేచి కూర్చుంటారు. వాళ్ళకి ట్యూషను పెట్టిస్తారు. ట్యూషనుకి దగ్గరుండి తీసుకు వెళ్తారు. మీకు వస్తే మీరే పాఠాలు చెప్పేస్తారు. ప్రొద్దున 4.30 నుండి రాత్రి 11 గంటలు వరకూ వాళ్ళకి ఊపిరాడనీయం.

ఎంసెట్ పాసయి, ఆ తరవాత కాలేజిలో సీటు వస్తుందో లేదో తెలియని చదువుకి మీరు ఇచ్చేటటువంటి ప్రాముఖ్యత అది.

శ్రీ ఆధ్యాత్మిక సాధనకి మీరు ఇస్తున్న ప్రాముఖ్యత ఏమిటి?
మీకు ఎటువంటి డైమండ్స్ లభిస్తాయో మీరు చూసుకోండి.

నకిలీ డైమండ్స్, నకిలీ డైమండ్సే!

శ్రీ మీరు ఎంత శ్రమపడతారో అంతే ఫలితం వస్తుంది తప్ప శ్రమకు మించిన ఫలితం రాదు. ప్రకృతిలో ఎపుడూ అసంభవం అది. ప్రకృతి నియమాన్ని ఎవరూ అధిగమించలేరు.

శ్రీ కష్టపడకుండా, సాధన చేయకుండా తపస్సు చేయకుండా భగవంతుని అనుగ్రహం మనకి లభిస్తుంది అనే మూర్ఖత్వం నుండి బయట పడదాం.

-- మనకి అర్హత ఉండాలి ముందు.



శ్రీ కష్టపడకుండా ఫలితాలు రావు... రావు... రావు.

కష్టపడండి!

*ఎంత కష్టపడతారు?*

వేల వేల సంవత్సరాలు తపస్సు చేశారు మన ఋషులు.
మీరు చేసినదెంత అసలు?
కష్టపడకుండా దాన్ని తపస్సని ఎలా అంటాం మనం అసలు?
ఎలా పేరు పెట్టుకుంటాం దానికి. వద్దు!

ఆ ధైర్యం మనం తెచ్చుకుంటే ఎక్కడ తప్పు చేస్తున్నామో మనకి అర్థం అవుతుంది. మనం చేసే రెండో తప్పు ఇది.

స్థూల సూక్ష్మ చేతనత్వాలలో మీకు పరిణతి వచ్చిందా?

✡ రోజు రోజుకి వస్తుంది పరిణతి.

-- ఎప్పుడో వస్తుంది ఆ పరిణతి అనుకోకండి!
ఫలితాలు ఆ క్షణం నుండీ రావటం మొదలుపెడతాయి.

ఎల్.కే.జీ కుర్రవాడికి ఆ సంవత్సరంలో నేర్చుకోవడానికి ఒక సిలబస్ ఉంటుంది.

ఎ.బి.సి.డి.లు రావాలి.
1, 2, 3, 4 అంకెలు రావాలి.
ఏవో చిన్న చిన్న పద్యాలు రావాలి.
రంగులను గుర్తించాలి.

శ్రీ మరి ఆధ్యాత్మిక జగత్తులో మనం ఏం గుర్తించగలుగుతున్నాం?

మేం సాధనలు చేశాం అంటున్నారు కదా!

ఏం గుర్తించారు మీరు సిలబస్‌లో?

చాలా మంది దగ్గర ఆ ప్రశ్నకి జవాబు లేదు.

కొంతమంది దగ్గర ఉండొచ్చు. నేను జనరల్‌గా చెబుతున్నాను తప్ప, స్పెసిఫిక్ గురించి మాట్లాడటం లేదు.

***తప్పులు ఎక్కడ జరుగుతున్నాయి అంటే,***

ఇవాళ నేను పూజ చేశాను, ఏం నేర్చుకున్నాను అనే ప్రశ్న వేసుకోవడంలేదు.

పిల్లవాడు స్కూలు నుంచి రాగానే ఏం నేర్చుకున్నావురా అని అడుగుతున్నాం. వాడు ఏ నేర్చుకున్నాననో, బి నేర్చుకున్నాననో, cat కేట్ అనో, బ్యాట్ అనో అంటే మనం చప్పట్లుకొడుతున్నాం.

✡ అలాగే మనం ఇవాళ ఆధ్యాత్మిక సాధనలో ఏం నేర్చుకున్నాం?

ఒక్క చిన్న అడుగు, ఒక మిల్లీమీటరు ముందుకు వెళ్ళినా చాలుకదా!

ఈ రెండు పాయింట్స్ గుర్తుంచుకోండి.

మూడో పాయింటు ఒకటుంది.

✡ గురువులను ఉపయోగించుకోవడం నేర్చుకోండి.

శ్రీ గురువులను దయచేసి పూజించటం మానేయండి.

గురువులను పూజించకండి,
ఉపయోగించుకోండి.


***ఉపయోగించుకోవడానికి, పూజించడానికి ఏమిటి తేడా?***

ఒక రాజుగారికి ఉత్తరం వైపు ఒక తోట, దక్షిణం వైపు ఒక తోట ఉన్నాయి. రెండు తోటలకు తోటమాలులు కావాలి. అంచేత ఇద్దరు తోటమాలులు కావాలి అని రాజుగారు ప్రకటన వేయించారు.

రాజుగారి ప్రకటనను చూసి వచ్చిన వాళ్ళలో ఇద్దరిని సెలెక్ట్ చేసి తోటమాలులుగా చెరొక తోటలో నియమించారు.

ఉత్తరం వైపు వున్న తోటమాలి రాజుగారి ఫొటో ఒకటి పెట్టుకొని రోజూ పూజలు, నివేదనలు అవీ చేసి ప్రదక్షిణాలు చేసేవాడు. ఈ రోజు 10 ప్రదక్షిణాలు, రేపు 20 ప్రదక్షిణాలు ఇలా పెంచుకొంటూ పోతూ, 108 కొబ్బరికాయలు కొట్టుకొంటూ తిరిగేవాడు.

ఎన్ని కొబ్బరికాయలు కొట్టాడో, ప్రదక్షిణాలు ఎన్ని చేశాడో లెక్కపెట్టుకొనేవాడుగాని, తోటని పట్టించుకోలేదు.

దక్షిణం వైపు తోటమాలి మాత్రం రాజుగారిని అసలు మర్చిపోయాడు. అతనికి తోట పెంపకం చాలా ఇంటరెస్టింగ్ సబ్జెక్ట్. చాలా స్టడీ చేసి రకరకాల మొక్కలు నాటాడు.

ఒక సంవత్సరం అయిన తరవాత రాజుగారు రెండు తోటల దగ్గరకు వచ్చి చూశాడు.

✡ ఉత్తరం వైపు తోటకి వచ్చి చూశాడు.
తోట అంతా బీడువారి పోయి ఉంది.

-- చెక్కభజనలు, కుళ్ళిన కొబ్బరి ముక్కలు, పీచులు తప్ప ఇంకేమీ లేవు.

-- రాజుగారి ఫొటోకి మాత్రం పూలహారాలు, ధూపదీపాలు వేసి నీట్‌గా వుంది.

✡ సరే, దక్షిణం వైపు తోటకి కూడా వెళ్ళాడు.
ఎక్కడా రాజుగారి ఫొటో కన్పించలేదు.
పూజలు, పునస్కారాలు కన్పించలేదు.

-- కానీ తోట మాత్రం అత్యద్భుతంగా వుంది.

మనం ఏం చెయ్యాలో అర్థమయింది అనుకుంటాను.
అదీ చెప్పదలుచుకున్నది నేను.

ఆధ్యాత్మికత పేరుతో బీడువారిపోయాం.
భారతదేశం మొత్తం బీడువారిపోయింది.

*ఎందుచేత?*

గురువు చెప్పింది మనం చెయ్యడం లేదు. గురువుల ఫొటోలు పెట్టుకుంటున్నాం కానీ చెప్పింది చేయటంలేదు.

ఫొటోలు పెట్టుకుంటే ఏం అవదు.

అదీ మనం చేసేటటువంటి మూడో తప్పు.

ఈ మూడు తప్పులు కనక మనం వదిలేయగలిగితే ఖచ్చితంగా మళ్ళీ మన జీవితాలు మారిపోతుంటాయి.

పెద్దకష్టం ఏమీ పడక్కర్లేదు మనం. Alternative steps అయినా కరెక్ట్ దిశలో వేస్తుంటే ఎప్పటికయినా మనం లక్ష్యానికి చేరుకుంటాం. ఏం ఫరవాలేదు.



# విశ్వ శ్రేయస్సుకే ఆధ్యాత్మిక విద్య

ఆధ్యాత్మిక లక్ష్యాలను చేరుకోవడానికి మనం ఇంకొక తప్పు చేశాం. ఏమిటా తప్పు అంటే,

మనం వేదాలని మర్చిపోయాం.

వేదభూమిలో, వేదాలు ప్రభవించిన భూమిలో, వేదాలు అంటే ఏమిటో తెలియనటువంటి స్థితిలో పడిపోయాం మనం.

రకరకాల భావాలు! ఇందాకనే చెప్పాను కదా, అందరూ చెప్పే వాళ్ళే ఆధ్యాత్మిక జగత్తులో.

Every man is competent to critisize and talk.

ఏముందయ్యా నీకు ఆధ్యాత్మికతలో డిగ్రీ, అర్హత అంటే, ఏమీ లేదు. కానీ మాట్లాడతారు.

ఆధ్యాత్మికతలో మనకు అసలు ఏం తెలుసు?

ఆధ్యాత్మికత గురించి మనం ఆలోచించటం లేదని చెప్పాను కదా! అలాగే ఈ వేదాలు గురించి కూడా మాటలే మాటలు.

శ్రీ మాటలు తప్ప వేదం జోలికి వెళ్ళిన వాళ్ళు నాకు ఎవ్వరూ కనిపించడం లేదు.

-- ఎవరో ఆ వేదాలు చదివితే మనకేం ఉపయోగం?
మనకు ఉపయోగపడాలి. అదీ నేను చెప్పేది.

న్యూటన్ గురుత్వాకర్షణ శక్తిని కనిపెట్టాడు. కనిపెట్టిన క్షణం నుండీ అది అందరికీ ఉపయోగపడింది. ఎడిసన్ రకరకాలైన పరికరాలను కనిపెట్టాడు. అందరికీ ఉపయోగపడ్డాయవి.

కాని అసలు ప్రపంచానికి మేలు చేసేవి వేదాలు. విశ్వకళ్యాణ హేతవః అసలు వేదాలను పిలిచేటటువంటి విధానం అది.

వేదాలు ఏం చేస్తాయంటే, విశ్వకళ్యాణ హేతవః

శ్రీ మరి ఆ వేదాల వలన ఏం విశ్వ కళ్యాణం అవుతోంది?

సహజంగానే ఎందుకు ఆ వేదాల నుండి వచ్చేటటువంటి లక్ష్యం మనకు తెలియడం లేదూ అంటే, అసలు మనం ఎప్పుడైనా ఆ వేదాల్ని ముట్టుకుంటే కదా!

మన భారతీయ సాంప్రదాయంలో నేను అబ్జర్వ్ చేసినటువంటి పెద్ద బాధ అది.

ఒరిజినల్ టెక్స్ట్ బుక్ ఎవడూ తీయడు.

నేను బెనారస్ యూనివర్సిటీలో రీసెర్చి చేస్తున్నప్పుడు నా సహాధ్యాయి ఒకడు ఉండేవాడు. అతను నాస్తికుడు. సైన్సు చదివిన వాళ్ళు నాస్తికులు అవ్వాలని స్టైల్ ఏమో! భగవంతుడిని నమ్మేవాడు కాదు అతను. నాకు బాగా నమ్మకం ఉండేది.

అతనొకసారి "రామకృష్ణా! నీవు ఎన్నైనా చెప్పు, ఆ కర్ణుడు ఉన్నాడే," అన్నాడు.

నాకు డౌట్ వచ్చింది. "ఏ కర్ణుడు గురించి మాట్లాడుతున్నావయ్యా" అన్నాను.



"అదేనయ్యా, మహాభారతమో ఏదో అంటావు కదా, అందులో కర్ణుడు" అన్నాడు.

నాకు చాలా ఆనందం వేసింది. హమ్మయ్య, పోనీలే లైనులో పడ్డాడు కదా అని అనుకున్నా.

అస్సామీ భాషలో కర్ణుడు గురించి ఒకతను ఒక పుస్తకం వ్రాశాడు. దాన్ని హిందీలో ఒకతను అనువాదం చేశాడు. ఆ ట్రాన్స్‌లేషను మీద హిందీలో ఒక కామెంట్ పడింది. "ఆ కామెంట్ చదివి చెప్తున్నాను నేను కర్ణుడు చాలా గొప్పవాడని" అన్నాడు. అదీ సంగతి!

- మనకు వేదం గురించి తెలిసింది కూడా అలాంటిదే.

వేదాల గురించి డైరెక్టుగా మనకు తెలిసింది ఏం లేదు.

- పెట్రోలు, ఆటంబాంబులు గురించి అధర్వణ వేదం నుంచి తెలుసుకోవడానికి భారతదేశం నుంచి కొంత మంది వేదవేత్తల్ని హిట్లరు జర్మనీకి తీసుకువెళ్ళాడు, దాని ద్వారానే ఏరోప్లేన్సు అవీ కనిపెట్టబడ్డాయి అని అంటాం మనం.

క్యాన్సర్‌కి మందు వేదాల్లోనే ఉంది అని చాలా ఆర్టికల్స్ చదివాన్నేను. కానీ,

శ్రీ అన్నీ వేదాలలోనే ఉంటే, మరి మీరెందుకు కనిపెట్టడం లేదు?

కష్టపడడం మనకి ఇష్టం లేదు.

ఎవడైనా కష్టపడి కనిపెడితే "మా వేదాల్లో ఉంది! విమానాలా, మా వేదాలలో త్రేతాయుగంలోనే ఉన్నాయి! పుష్పక విమానం ఉండేది మాకు!"

నిజమే! కులి నువ్వెందుకు కలిపెట్టవ్?

మన సాంప్రదాయంలో ఉన్నటువంటి లోటు అది.
కష్టపడటానికి ఒప్పుకోం మనం.

మా కాలేజీలో ఒక లెక్చరర్‌గారు కూడా ఇవేవీ నమ్మేవాడు కాదు. సత్యసాయి బాబాని, వాళ్ళనీ వీళ్ళనీ అంతా పట్టి బూటకమని తిట్టేవాడు. ఒకరోజు అతను నా దగ్గరకొచ్చి, "రామకృష్ణా నీవేమీ అనుకోక పోతే ఒక మాట అంటాను, మీ సాయిబాబా చాలా గ్రేట్!" అన్నాడు.

"పోన్లే ఇప్పటికైనా ఒప్పుకున్నావు సత్యసాయిబాబా గ్రేట్ అని. ఇంతకీ ఓవర్ నైట్ ఆ మార్పు ఎలా వచ్చింది?" అని అడిగాను.

హైకోర్టు జడ్జి సత్యసాయిబాబా చాలా గ్రేట్ అన్నాడట.
ఇదీ మన నాలెడ్జి!

హైకోర్టు జడ్జి లా గురించి చెబితే ఓకే.
ఆయన సత్యసాయి బాబాకి డిగ్రీ ఇవ్వడమేమిటి?

దాన్ని ఒప్పుకొని మనం తలలూపుతున్నాం.

మనం ఆధ్యాత్మిక జగత్తులో ఎంత అమాయకులమో అన్పిస్తుంది. హైకోర్టు జడ్జి సత్య సాయిబాబా శిష్యుడు కనుక సాయిబాబా గొప్పంటే ఎలా? వద్దు, మనం అలా అనవద్దు.

శిష్యుణ్ణి చెప్పుకొని, గురువు గొప్పదనాన్ని చెప్పుకొనే స్థాయిలో ఉన్న శిష్యులూ కావాలి. నారదుడి శిష్యుల్ని చూస్తే, ఓహో, నారదుడు ఇంత గొప్పవాడా అనిపిస్తుంది. ధ్రువుడు కానీ, ప్రహ్లాదుడు కానీ ప్రపంచాన్ని ఊపేశారు. యుగయుగాలుగా ఊపుతున్నారు కదా!



ఇదీ వేదాలలో ఉన్నటువంటి రహస్యం.

- ఈ గురుశిష్య సంబంధాన్నే వేదాలు చెబుతాయి.
  విశ్వకళ్యాణ హేతవః
- వేదాల యొక్క నాలెడ్జిని అందించే వ్యక్తిత్వాలే మనకి గురువులు. ఏ గురువు అయినా సరే.

సైంటిస్ట్ అంటే వాడు రష్యన్నా, కమ్యూనిస్టా, కేపిటలిస్టా, ఇవేమీ పట్టించుకోం. మాండలీఫ్ రష్యన్. న్యూటను ఇంగ్లీషువాడు. ఎడిసన్ అమెరికన్.

వాళ్ళ నేషనాలిటీని ఎప్పుడైనా మనం ప్రశ్నించామా?
వాళ్ళ నేషనాలిటీస్ మనకసలు గుర్తున్నాయా?

**వాళ్ళ పేర్లు ఎందుకు చెప్పుకుంటామంటే,**

వాళ్ళు లాభాలను మనకి ఇచ్చారు కనుక చెప్పుకుంటాం అంతే. వాళ్ళ తల్లిదండ్రులు తెలియదు. వాళ్ళ పుట్టుపూర్వోత్తరాలు తెలియదు. వాళ్ళ ఇల్లు తెలీదు.

**కానీ మన గురువుల చరిత్ర చూస్తే**

ఆయన ఏ రోజున పుట్టాడు?
ఆయన తండ్రి పేరేమిటి?
ఆయన తాత పేరేమిటి?
వాళ్ళ తాత, ముత్తాత యొక్క మునిమనమడు పేరేమిటి?

ఇవన్నీ ఎందుకు చెప్పండి?

లౌకికమైనటువంటి ప్రయత్నాలు మనమేదో చేస్తూవుంటాం.

- మన ప్రయత్నాల వల్ల కానటువంటి అలౌకికమైన ఉపాయాలు మాత్రమే వేదాలలో ఉంటాయి.

- లౌకికమైన ఉపాయాలు వెతుక్కోకండి.
  అవి వేదాలలో దొరకవు.

దొరకవు అన్న విషయం వేదాలలోనే చెప్పబడివుంది. ఇది అర్థం కాకపోతే ఋగ్వేదంలో 164 వ సూక్తమయిన సుపర్ణసూక్తంలో 39 వ మంత్రంలో, కిమృచాకరిష్యతి - ఇది మీకు అర్థం కాకపోతే ఏ ఋక్కులు మాత్రం ఏం చేయగలవు అంటాడు.

### దేని కోసం మనం వేదాలను చదవాలి?

విశ్వ శ్రేయస్సు కోసం చదవాలి.

- ఆ విశ్వశ్రేయస్సు చేసే మార్గాలు చెప్పేవారే గురువులు.

-- అందుచేత ఆ గురువులు విశ్వశ్రేయస్సు కోసం ఏం చెప్పారో మీరు తెలుసుకోగలిగితేనే గురువులు చెప్పింది మీరు ఆచరణ లో పెట్టగలరు. లేకపోతే గురువుల ఫొటోలు పూజిస్తే, రాజుగారి ఫొటోలను పూజించినట్లే వుంటుంది.

కర్మ ఫలితాలు వస్తూవుంటాయి, పోతూవుంటాయి. అది అంత ఇంపార్టెంట్ కాదు.

మానవజీవితంలో అసలు సిసలైనటువంటి ఈ విషయాలను గుర్తుపెట్టుకోకుండా ఇలా ఎన్ని కబుర్లు చెప్పుకున్నా ఒకటే. వీటిని గుర్తుంచుకొని ఆధ్యాత్మిక విద్యను నేర్చుకోవాలి.



# గురువు అనుగ్రహం కంటే శిష్యుడి ప్రయత్నమే ముఖ్యం

"ఓం" అన్నది మనం చేయబోయేటటువంటి కోర్సు పేరు. చేస్తున్నటువంటి కోర్సు పేరు. చేసేశాక నేర్చుకొన్న పేరు.

ఓం - అ ఉ మ.

ఈ కోర్సుని మనం నేర్చుకోవడానికి అనేక మంది గురువులు అనేక రకాలుగా చెప్పారు. కానీ కోర్సు ఇదే.

బియ్యేస్సీ చదువుతున్న పిల్లవాడిని టీసీ తీసుకొని ఇంకొక ఊళ్ళో, ఇంకొక కాలేజీలో చేర్పించారు మీరు. ఏమవుతుంది? ఏమీ అవదు. అదే సిలబస్ చదువుతాడు. అదే పరీక్షలు వ్రాస్తాడు. అదే డిగ్రీ పాసవుతాడు. ప్లేస్ మారింది అంతేకదా!

- ఆధ్యాత్మిక జగత్తులో ఈ కామన్‌సెన్సు లేదు మనకి.

-- ఎంత భయంకరమైనటువంటి ప్రమాదంలో ఇరుక్కుపోయామో చూడండి. ఈ జాడ్యం మనం వదిలించుకోగలగాలి.

- గురువులు కాదు ముఖ్యం. వాళ్ళు చెప్పే సబ్జెక్ట్ ఇంపార్టెంట్.

ఎక్కడ చదివితే ఏం? మొదటి సంవత్సరం బియ్యేస్సీ ఎక్కడో చదవండి. రెండవ సంవత్సరం బియ్యేస్సీ ఇక్కడ చదవండి. మూడవ సంవత్సరం బియ్యేస్సీ ఇంకొక చోట చదవండి. ఏమవుతుంది? ఏమీ

మార్పురాదు. అదే డిగ్రీ వస్తుంది మీకు. యూనివర్సిటీ మారినా ఏమీ కొంపలు అంటుకోవు. మైగ్రేషన్ సర్టిఫికెట్ ఉంటుందికదా!

మరి ఆధ్యాత్మిక జగత్తులో ఎందుకంత కన్ఫ్యూజన్ మనకి?

"గురువుని మారిస్తే కొంపలంటుకుపోతాయి అమ్మో!"

ఏమీ అంటుకుపోవు. విషయం అవగాహన లేకపోవడం వలన వచ్చే జాడ్యం ఇది. ఇంకెక్కడా కన్ఫ్యూజ్ అవకండి మీరు.

శ్రీ అయినా మీ గురువులను మీరేం మార్చుకోనక్కర్లేదు.

-- సబ్జెక్ట్ మీరు నేర్చుకుంటూ ఉంటే రావలసిన విషయం, ఎవరి ద్వారా అయినా వచ్చేస్తుంది.

-- ఎవరి ద్వారా వచ్చినా, వాడిని గురువు అనుకుని మీరు అనవసరంగా కాళ్ళు పట్టుకొని పీక్కండి. వాడిని మీరు భ్రష్టుపట్టిస్తారు.

-- మీరేమవుతారో తరవాత సంగతిగానీ, ఎవరినయినా గురువు అనుకొని రెండు దండలేశారంటే, వాడు చచ్చాడే.

వద్దు, సబ్జెక్ట్ నేర్చుకోండి. అవగాహన నేర్చుకోండి.

అంచేత నేను కొన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు మీకు వివరిస్తాను. వివరించడమే కాకుండా, మీ చేత చేయిస్తాను. ఈ చేసేటప్పుడు మీరు ఎంత ఏకాగ్రతతో, ఎంత అభిరుచితో, ఎంత ఇష్టంగా ఆ సాధనలు చేస్తారో, అంత సత్ఫలితాలను మనం పొందుతాం.

**ప్రతీ చోటలాగానే ఆధ్యాత్మిక జగత్తులో కూడా ఒక కండిషను ఉంది,**

శ్రీ మీ ప్రయత్నం ఎంత ఉన్నది అన్నది ఇంపార్టెంట్.

-- గురువు ప్రయత్నం ఎంత అన్నది పెద్ద ఇంపార్టెంట్ కాదక్కడ.



ఏకలవ్యుడు నేను కూడా ద్రోణాచార్యుడు దగ్గర విద్యను నేర్చుకొంటాను అని ద్రోణాచార్యుడు దగ్గరకి వెళ్ళాడు. "నేను నీకు చెప్పలేను. రాజకుమారులకు మాత్రమే విద్యను చెప్పే పరిస్థితి నాది. నీకు నేను చెప్పలేను" అన్నాడు ద్రోణాచార్యుడు.

"పోనీ మీకు వీలయితే చెప్పడానికి ఒప్పుకుంటారా?"

"తప్పని సరిగా చెప్తాను. కాని ప్రస్తుతానికి వీలుపడదు."

ఏకలవ్యుడు అడవిలోకి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయి, ద్రోణాచార్యుల వారి యొక్క ఒక మూర్తిని తయారుచేసుకొన్నాడు. తయారు చేసుకొని తన సాధన తను మొదలుపెట్టాడు అంతే. అతనికి మంత్రాలు తెలియవు, విధానాలు తెలియవు. ఏకలవ్యుడికి ఎవరు చెప్తారక్కడ?

కాని ఇక్కడ ద్రోణాచార్యుడు స్వయంగా ఉండి అర్జునుడికి విలువిద్యలో నిన్ను నా అంత వాణ్ణి చేస్తాను అని వాగ్దానం చేస్తాడు. సాధన మొదలయింది, పది పదిహేను సంవత్సరాలు గడిచాయి. పాండవులు, కౌరవులు ద్రోణాచార్యుడితో వేటకు వెళ్ళారు.

ఈ పది పదిహేను సంవత్సరాలలో అటు ఏకలవ్యుడి సాధన కూడా నిరంతరం అడవిలో ఒంటరిగా మట్టితో చేసినటువంటి ద్రోణాచార్యుడి విగ్రహం ముందు జరుగుతూనే ఉంది.

అది ద్రోణాచార్యుడి విగ్రహం అని పేరే కాని, ఏకలవ్యుడు శిల్పి కాదు కదా, ఎగ్జాక్ట్‌గా ద్రోణాచార్యుడిలా తయారు చేయటానికి. ఒక మట్టి ముద్ద అక్కడ పెట్టాడక్కడ. దాన్ని తలకాయలాగా మార్చాడు. ఓ రెండు ముక్కులు, రెండు కన్నులు, రెండు చెవులు అని పెట్టివుంటాడు, అదే ద్రోణాచార్యుడు అనుకొన్నాడు.

పాండవులు, కౌరవులతో 'ఇంక విలువిద్య పరిసమాప్తి అయ్యే టైము వచ్చింది. వేటకు వెళ్దాం పదండి' అన్నాడు ద్రోణాచార్యుడు.

వేటకి వెళ్ళారు. గుడారాలు వేసుకొన్నారు. వేటకుక్కల్ని వదిలారు. ఈ వేటకుక్కలు అరుచుకొంటూ అడివంతా తిరిగి, అక్కడ ఏకలవ్యుడు సాధన చేస్తున్నటువంటి ఆశ్రమం అనుకొందాం, లేకపోతే సాధనాస్థలి అనుకొందాం, వచ్చాయక్కడికి. వాటి అరుపులకు ఏకలవ్యుడి యొక్క కాన్సన్ట్రేషన్, ఏకాగ్రత డిస్టర్బవులోంది.

ఏం చేశాడప్పుడు, వేటకుక్కల నోట్లోకి బాణాలేశాడు. ఎలా బాణాలేశాడంటే, వేటకుక్కల నోటిలోకి బాణాలు వెళ్ళాయి కాని, ఒక చుక్క నెత్తురు క్రింద పడలేదు. గుచ్చుకోలేదు వాటికి, నోటికి అడ్డుపుల్లలాగ పడ్డాయి కాని, ఒక నెత్తురు చుక్క క్రింద పడలేదు.

అలాగే వేటకుక్కలు పాండవులు, కౌరవులు ఉన్న గుడారాల దగ్గరకి వెళ్ళాయి. నోరు సీలు అయిపోయింది వాటికి. వాటిని చూసి అర్జునుడికి ఆశ్చర్యం వేసింది. "ఏమిటిది, బాణము వెయ్యడమైతే నేను నేర్చుకున్నాను. చాలా ఎక్స్‌పర్ట్‌ని కూడా అయ్యాను కాని, కరెక్టుగా గురిచూసి, నోటి వరకు వెళ్ళి, నోటిలోకి కూడా ప్రవేశించి, ఒక చుక్క నెత్తురు రాలకుండా బాణము వేసే స్పీడు కంట్రోలు నాకూ రాదుకదా! ఎలా వచ్చింది? ఎవరికొచ్చింది?" అని బయలుదేరి ఏకలవ్యుడి దగ్గరకి వెళతారు. సరే తరవాత కథ అంతా మీకు తెలుసున్నదే.

కాని అక్కడున్న అంతరార్థం ఏమిటో మీరు అర్థం చేసుకోండి.
ఆ అంతరార్థం కోసం ఇది నేను చెప్పాను.



# సర్వవ్యాపి అయిన గురువు అన్ని చోట్లా లభిస్తాడు

**ఏకలవ్యుడి గురించి ఇక్కడ ఎందుకు చెప్పుకొచ్చానంటే,**

భారతదేశంలో దేవత్వాన్ని అనుగ్రహించేటటువంటి మార్గం ఉన్నది అని ఒప్పుకుందాం అనుకుందాం. మరి మార్గం ఉన్నది అంటే ఏం కావాలి? ఎలా వెళ్ళాలో చెప్పే గురువు కావాలి.

గురువులు ఉంటేనే కదా మరి మనం ఆ స్థితికి వెళతాం.
మరి ఆ గురువులు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు?

"ముందు అది మీరు చెప్తే మాకు, మిగతా సాధనలు ఎంత కష్టంగా ఉన్నా మేం చేస్తాము. దేవత్వాన్ని పొందాలంటే కచ్చితంగా సాధనలు కఠోరంగానే ఉంటాయనేది ఒప్పుకొంటాం. కాని మీరు చెప్తున్నారే గురువులు కావాలని, మరి ఆ గురువులు ఎక్కడ దొరుకుతారు?"

దానికి ఆ కథ చెప్పాను నేను మీకు. ఆ కథలో ఉన్నటువంటి అంతరార్థం ఏమిటి?

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మః తస్మై శ్రీగురవే నమః

అనే శ్లోకాన్నయితే మనం చదువుతున్నాము తప్ప, ఆ శ్లోకంలో ఉన్నటువంటి అంతరార్థం మనకి బోధపడడంలేదు.

భారతీయ సంస్కృతిలో రెండు పదాలు చాలా గొప్పవని నేను ఎప్పుడూ చెప్తూవుంటాను.

✪ గురువు అనేటటువంటి పదము.
అవతారము అనేటటువంటి పదము.

ఈ రెండు పదాలు ఇంకెక్కడా లేవు ప్రపంచంలో. ఈ పదాల యొక్క అతి లోతైనటువంటి, గహనమైనటువంటి భావము, ఇంక మనకి ప్రపంచంలో ఇంకెక్కడా దొరకదు.

***గురువు అనే పదానికి అర్థమేమిటి అంటే,***

శ్రీ మూడు లక్షణాలను కలిగినటువంటి వ్యక్తి అయిఉండాలి.

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః

✪ మనకి బ్రహ్మ అనేసరికల్లా ఏం గుర్తొస్తుంది? సినిమాలలో చూస్తున్నటువంటి ఒక తెల్లటి గడ్డము, ఒక మూడు ప్లాస్టిక్ తలకాయలు - ఇది బ్రహ్మ యొక్క స్వరూపం మనకి.

-- విష్ణువు అంటే రెండు ప్లాస్టిక్ చేతులు.

-- శివుడు అంటే మెడలో ప్లాస్టిక్ పాములు. అంతేకదా!

ఇక్కడ ఆ భావాన్ని మనం స్పష్టంగా అర్థం చేసుకొంటే,

✪ గురుర్బ్రహ్మ, బ్రహ్మ ఎవరు? ఈ సృష్టికి కారకుడు, సర్వజ్ఞుడు.

-- ప్రతీ అణువు నుంచి ఈ సృష్టిలో ఏర్పడే అతి గొప్ప వస్తువు వరకూ భూత, భవిష్యత్, వర్తమానాలు తెలుసున్న వ్యక్తి.

-- అంటే బ్రహ్మత్వము అంటే అర్థమేమిటి? సర్వజ్ఞత్వము.



***అంచేత గురుర్బ్రహ్మ అంటే గురువు ఎలాంటి వాడు అయివుండాలి?***

బ్రహ్మలాగ సర్వజ్ఞుడై వుండాలి.

✪ గురుర్విష్ణుః, గురువు సర్వజ్ఞుడైవుంటే సరిపోదు, సర్వవ్యాపకుడు అయివుండాలి.

***సర్వవ్యాపకుడు అంటే అర్థం ఏమిటి?***

గవర్నమెంటు వలె సర్వవ్యాపకుడై ఉండాలి.

గవర్నమెంటు అంటే పాలనాశక్తి, పరిపాలనా శక్తి. ప్రతీ చోట సూక్ష్మరూపంలో వ్యాపించి ఉంటుందది. దేశంలో ఫలానా గవర్నమెంట్ పనిచేస్తోందని చెప్తాంకదా! అంటే ఈ దేశమంతటా ఏం ఉన్నట్లు?

ఆ సర్వవ్యాపక పరిపాలక శక్తి ఉన్నట్లు.

***అంచేత ఈ గురువు ఎలాంటివాడు అయివుండాలి?***

సర్వవ్యాపకుడై ఉండాలి.

✪ గురుర్దేవో మహేశ్వరః - సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు అయితే సరిపోదు. ఇంకొక శక్తి కూడా గురువుకు ఉండాలి.

-- గురువు సర్వసమర్థుడై ఉండాలి.

-- అఘటనాఘటనా సమర్థుడు అంటామే, ఇదీ చెయ్యగలగాలి, అదీ చెయ్యగలగాలి. ఎలాంటి పరిస్థితులు మారిస్తే శిష్యుడికి వీలుగా ఉంటుందో, అలాంటి పరిస్థితులు సంకల్పమాత్రం చేత చెయగలిగే శక్తి ఉండాలి.

అటువంటి గురువుకి నేను నమస్కారం చేస్తున్నాను అని అర్థం.

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః

ద్రోణాచార్యుడు అర్జునుడికి భౌతికంగానే ఉన్నాడు.

**ఏకలవ్యుడికి భౌతికంగా లేకపోయినా,**

సర్వవ్యాపి అయినటువంటి గురువును పట్టుకోగలిగాడు.
సర్వజ్ఞుడు అయినటువంటి గురువును పట్టుకోగలిగాడు.
సర్వసమర్థుడు అయినటువంటి గురువును పట్టుకోగలిగాడు.

ఎక్కడ? అతను ఏర్పరచుకొన్నటువంటి మూర్తిలోనే.

✪ శిష్యుడు ఎక్కడుంటే అక్కడే ఉంటాడు ఆ గురువు.

-- భారతదేశ సాంప్రదాయంలో గురుసత్తా, గురుతత్వము యొక్క గొప్పదనము అది.

శ్రీ మీరు గురువు కోసం ఎక్కడకీ వెళ్ళక్కరలేదు.

-- భారతీయ సాంప్రదాయంలో గురువును వెతుక్కోవద్దు అని స్పష్టంగా చెప్తుంది శిష్యులకు.

✪ మీరే గురువును వెతుక్కోగలిగితే, మీరు గురువుకి గురువు అయినట్లే. మీరు గురువుకి పరీక్ష పెట్టి, ఈయన నాకు తగిన గురువు అని ఎంచుకోగలిగితే, ఇంక మీకు గురువెందుకు?

ఆ భావన జాగ్రత్తగా అర్థం చేసుకోండి. అక్కడ మనం దెబ్బతిన్నాం.

**భారతీయ సాంప్రదాయం మొత్తం ఎక్కడ దెబ్బతిన్నదంటే,**

మనం గురువును వెతుక్కోవడం మొదలుపెట్టాం.



గురువును వెతుక్కుంటే మీకు లభించడు.

సర్వవ్యాపకుడు ఎక్కడున్నాడు? అని హిరణ్యకశిపుడి ప్రశ్న.

ఎక్కడుంటాడు సర్వవ్యాపకుడు?

అసలు ఆ ప్రశ్నకు అర్థం ఉందా ఏదైనా? చాలా సీరియస్‌గా సర్వవ్యాపకుడని చదువుతాం మనం. కాని ఆ ప్రశ్న వేస్తాం.

సర్వవ్యాపకుడు అని మీరు ఒప్పుకుంటే ఇంక ప్రశ్న ఎందుకు?

సర్వవ్యాపకుడు ఇక్కడా ఉంటాడు, అక్కడా ఉంటాడు. ఇందుకలడు, అందులేడు అను సందేహమెందుకు అక్కడ? ఇక్కడ ఉన్నాడు, అక్కడ ఉన్నాడు.

అది గురువు యొక్క మూడవ వంతు.
విష్ణు స్వరూపమది, సర్వవ్యాపకత్వం.

✪ మరి ఆ గురువు కోసం శిరిడీ వెళ్ళాలా, పుట్టపర్తి వెళ్ళాలా, హరిద్వార్ వెళ్ళాలా, హిమాలయాలకు వెళ్ళాలా అనే ప్రశ్న వచ్చిందనుకోండి, మీకు అర్థం కాలేదు అంతే.

-- ఇంక అసలా స్తోత్రం చదవడమే అనవసరం.
ఆ శ్లోకం చదవడమే అనవసరం.

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః

ఆ భావన తెచ్చుకోవాలి. ఆ భావన అంటూ వచ్చేస్తే, గురువు అంటూ వచ్చేస్తే, ఇంక మనం చేసేదేముంది?

గురువే తీసుకెళతాడు.

కాని ఈ భావన లేదు,

ఈ వాక్కు మాత్రమే ఉంది మీకు.

అంచేత జాగ్రత్తగా ఆ భావనతో చేయండి.

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః

సర్వజ్ఞుడైనటువంటి గురువు,
సర్వవ్యాపకుడైనటువంటి గురువు,
సర్వసమర్థుడైనటువంటి గురువు.

**మరి ఈ మూడు ఎక్కడ ఉంటాయి?**

ఒక వ్యక్తిలో ఉండవు. అసంభవం అది.

✪ సర్వవ్యాపకత్వం అనేది ఒక శరీరానికి ఆపాదించలేం.

ఎంత విశాలమైనటువంటి శరీరం ఉన్నా, ఆఖరికి హిమాలయాలంత విశాలమైనటువంటి కొండలను కూడా ఒక శరీరంగా భావించుకున్నా ఎక్కడ ఉంటాయి? అదిగో ఉత్తర దిశలో ఇంత వరకూ ఉన్నాయని చెప్తాం. లిమిటేషను వచ్చేసింది.

అంచేత గురువు శరీరధారి కాదు.

చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

హిరణ్యకశిపుడు చేసిన తప్పు అదే. "మూడు లోకాలు వెదికేశాను, నాకు గురువు కన్పించలేదు" అంటాడు. "కన్పించకపోవడమేమిటి నాన్న, నాకు కన్పిస్తున్నాడు" అంటాడు ప్రహ్లాదుడు.



"ఏడి?" అంటాడు. ఏడి?

✪ ఆ చూసే విధానం అర్థం చేసుకోండి.

-- ఆ చూసే విధానం అలవాటు చేసుకొంటే, ఆ గురువు యొక్క సర్వవ్యాపకత్వాన్ని కనుక మీరు అర్థం చేసుకొంటే, మొదటి స్టెప్పు వేసినట్టు మన సాధనలో.

"ఈ స్థంభంలో ఉన్నాడా?" అంటాడు హిరణ్యకశిపుడు.
"ఉన్నాడు" అంటాడు.

✪ ఆయన స్థంభాన్ని చూపించాడు కనుక స్థంభంలో ఉన్నాడన్నాడు. ఆయన ఇంకోటేదో చూపించి, ఒక బొద్దింకను చూపించి హిరణ్యకశిపుడు, ఈ బొద్దింకలో ఉన్నాడా గురువు అంటే, ఉండే ఉంటాడు అక్కడ కూడా.

-- లేకపోతే సర్వవ్యాపకుడు అనే పదానికి అర్థం లేదు.

మీరు మీ ఆలోచలను కొంచెం సాగదీసుకోండి. మీరు అది సాగదీసుకొని, ఈ విశాలత్వాన్ని అర్థం చేసుకోండి.

ఇక్కడ తమాషా ఏమిటంటే, అప్పుడు మీరు కూడా గురువులో ఉన్నట్లే లెక్క. మళ్ళీ మీకు, గురువుకు వేరు చేసేసుకోకండి.

గురువులో ఉంటూ,
గురువు మీదే జీవిస్తూ,
గురువు యొక్క అనుగ్రహాన్ని పొందేటటువంటి
ఒక విచిత్రమైనటువంటి పారడాక్స్ ఈ సాధనా విధానము.

✶✪✶

# సర్వవ్యాపి అయిన గురువుని దర్శించే విధానము

గురువు యొక్క సర్వజ్ఞత్వాన్ని, సర్వవ్యాపకత్వాన్ని, సర్వ సమర్థతని అర్థం చేసుకోవటానికి దత్తాత్రేయ స్వరూపాన్ని మన ఋషులు ఏర్పాటు చేశారు.

**కాని మనం చేసే తప్పు మళ్ళా ఏమిటంటే,**

దత్తాత్రేయుడు అంటే ఎవరంటాం? అత్రి అనే ఒక మహర్షి ఉన్నాట్ట. అనసూయ అనే భార్య ఉందిట ఆయనకి. వాళ్ళకి పుట్టాడు.

పుట్టి ఉండొచ్చు, దానికేముంది, ఆశ్చర్యం ఏం లేదు.

కాని అక్కడ సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వ సమర్థుడు అయినటువంటి గురువు ఒకచోట పుట్టటం, ఒకచోట పుట్టకపోవటం అంటూ ఉండదు.

**ఏంటక్కడ మనకి నేర్పబడుతోంది?**

* అత్రి - ఈ త్రిగుణాత్మకమైనటువంటి, త్రీ డైమెన్షనల్ ప్రపంచాన్ని మీరు దాటగలగాలి.
-- ఈ లోకంలో వెతుక్కోకండి మీరు.

అమెరికాలో ఉంటాడా, ఇంగ్లాండులో ఉంటాడా, భీమవరంలో ఉంటాడా? ఉహూ, అత్రి - ఇక్కడెక్కడా ఉండడు వాడు.



అందుకే ముల్లోకాలలోను హిరణ్యకశిపుడికి కూడా కనిపించలేదు ఆ విష్ణువు, సర్వవ్యాపి.

**మరి ఆ గురువు ఎవడికి కనిపిస్తాడు?**

* అనసూయవే! రాజవిద్యా రాజగుహ్యంలో కూడా చెప్తాడు, "అసూయ మీకు ఉండకూడదు!"
* మన కోరికల్ని కనక మనం చాలా జాగ్రత్తగా ఆలోచిస్తే, మన కోరికలలో 99.9% ప్రక్కవాడికి ఉన్నాయి కనుక నాకు కూడా కావాలి అంటాం. ప్రక్కవాడికి లేకపోతే మాకు అనవసరం.

టీవీ ఇప్పుడు ఎందుక్కావలసి వస్తోందంటే, ప్రక్కింట్లో ఉంది. 84 వరకూ ఎవరూ టీవీలు కొనాలనుకోలేదు. టీవీల గురించి యావ, ఈ గందరగోళం లేదు. ఎంచేత? ప్రక్కింట్లో లేదు.

* అనసూయవే, అసూయారహితమైన స్థితిని కనుక మీరు తెచ్చుకుంటే, అప్పుడు ఆ గురుతత్వం మీలో ప్రవేశిస్తుంది.

**ఆ గురుమూర్తి ఎలా వస్తాడు?**

తనను తాను మీకు దత్తత చేసుకుంటాడు.

* తన జ్ఞానాన్ని మీకు ఇస్తాడు కనుక దత్తావతారం అన్నాం తప్ప, దత్తుడు అనేది పేరు కాదది. తన నాలెడ్జిని మీకు హేండోవర్ చేస్తాడు. దత్తత చేస్తాడు కనుక "దత్తుడు" అన్నాం.

ప్రతి గురువూ చేసేదదే.

కెమిస్ట్రీ లెక్చరర్ కెమిస్ట్రీని దత్తత చేస్తాడు. ఇంజనీరింగ్ కాలేజీ లెక్చరర్ ఉంటే ఇంజనీరింగ్ విద్యను దత్తత చేస్తాడు. మీకు ఇస్తాడు.

ఈ దత్తత చేసేటటువంటి గుణము!

***ఏ గుణాన్ని మీకు ఇవ్వాలి గురువు?***

కెమిస్ట్రీ లెక్చరర్ దగ్గరకెళ్ళి ఎకానమిక్స్ అడగం మనం.
ఎకానమిక్స్ లెక్చరర్ దగ్గరకు వెళ్ళి పొలిటిక్స్ అడగం.

***అంచేత ఈ గురువు దగ్గరకు వెళ్ళి ఏం అడగాలి మనం?***

ఆ శ్లోకంలోనే చెప్పుకున్నాం మనం,

గురుర్బ్రహ్మ - గురువు బ్రహ్మ కనుక మనం కూడా సర్వజ్ఞులం అవ్వాలి.

గురుర్విష్ణుః - గురువు సర్వవ్యాపి కనుక మనం కూడా సర్వవ్యాపకత్వం పొందాలి.

గురుర్దేవో మహేశ్వరః - గురువు సర్వసమర్థుడు కనుక మనం కూడా సర్వసమర్థత పొందాలి.

ఇదీ మన లక్ష్యం, అది మర్చిపోయాం మనం.

గురువు దగ్గరకి అడుక్కోవడానికి వెళుతున్నాం కాని, ఫలానా కోర్కెలు తీర్చండి, ఫలానా ఇది తీర్చండి అని అడుగుతున్నాం కాని, మీరు కూడా ఆ స్థాయికి వెళ్ళవచ్చు.

మీరు కూడా సర్వజ్ఞులు అవ్వవచ్చు.
మీరు కూడా సర్వవ్యాపకులు అవ్వవచ్చు.
మీరు కూడా సర్వసమర్థులు అవ్వవచ్చు.

* మీరు కూడా అనే మాటలో ప్రతి మానవుడు అని అర్థం.

-- మానవజన్మ ఎత్తిన ప్రతి ఒక్కరూ జాతి, మత, కుల, లింగ, వయోభేదాలు లేకుండా, 6 నెలల పిల్లవాడు దగ్గర్నుంచి 60



యేళ్ళు కలిగినటువంటి వ్యక్తి వరకూ కూడా ఏలాంటి ఆరోగ్య స్థితిలో ఉన్నా కూడా ఈ స్థితికి మీరు చేరుకోవచ్చు.

అదీ ఆ శ్లోకం యొక్క అర్థం.

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః

ఈ గురుతత్వాన్ని అర్థం చేసుకోవడానికి మన సాధనలో రెండు మంత్రాల్ని ఉపయోగిస్తాం మనం. ఈ రెండు మంత్రాలు కూడా మంత్ర విజ్ఞానంలో పరాకాష్ఠ చెందినటువంటి మంత్రాలు.

* ఒకదాన్ని 'గాయత్రీ మంత్రం' అంటాం.
* ఇంకొక దాన్ని 'సూక్ష్మగాయత్రి' అనే పేరుతో పిలుస్తూవుంటాం. 'షోడశీ విద్య' అనే పేరుతో కూడా పిలుస్తూ ఉంటారు దాన్ని.

ఈ రెండు మంత్రాల్ని ఉపయోగించుకుంటాం మనం.

ఈ రెండు మంత్రాల్ని ఉపయోగించుకునే ముందు ఇంకొక మాట మన మనస్సులో చాలా స్పష్టంగా ఉండాలి.

యోగము అంటే, యోగవిద్య అంటే ఏమిటి? అనేది.

***గురువు అంటే ఇప్పుడు మీకు స్పష్టంగా ఉందికదా,***

గురువు గురించి మీరు వెతుక్కోవద్దు.

ఏకలవ్యుడు మట్టి ముద్ద ఒకటి పెట్టి దాన్ని ద్రోణాచార్యుడు అనుకొన్నాడు. దానితో అన్నీ నేర్చుకొన్నాడు. అలాగే మీరు మీకు కావలసిన మట్టి ముద్దను గురువు అనుకోండి. అభ్యంతరం ఏం లేదు.

శిరిడీ సాయిని గురువనుకోండి, శ్రీరామశర్మ ఆచార్యాను గురువనుకోండి, గణపతి సచ్చిదానందస్వామిని గురువనుకోండి, ఎవరైనా మీరు గురువనుకోండి, ఏమీ అభ్యంతరం లేదు.

ఎంచేతంటే, మీలోనూ ఉన్నాడు, అందరిలోనూ ఉన్నాడు.

* అన్ని చోట్లా ఉన్నటువంటి గురువు ఫలానా వ్యక్తిలోనే ఉన్నాడు అనేటటువంటి ఆగ్రహము, గొడవ వద్దు. మీరు హాయిగా నిశ్చింతగా అనుకోండి. ఏమీ అభ్యంతరంలేదు.

కాని అభ్యంతరం ఎక్కడ వస్తోంది అంటే, నేను నమ్మిన భౌతిక శరీరంలోనే గురువు ఉన్నాడు అనే అపోహలో ఉంటున్నారు.

శ్రీ నేను నమ్మిన భౌతికశరీరంలోనే గురువు ఉన్నాడు అని మీరు
ఏ క్షణంలో అయితే అనుకున్నారో,
ఆ క్షణంలో గురుద్రోహం చేసిన వాళ్ళే మీరు.

**ఎంచేత గురుద్రోహం చేసిన వాళ్ళు?**

* ఒక ప్రక్క మీరు గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః అంటూ, ఆ గురువు ఈ స్వరూపంలోనే ఉన్నడు అనే భ్రాంతి ఉంటే, ఇంక ఆ గురువు దగ్గర్నుంచి ఏం నేర్చుకోగలరు?

అసలు కాన్సెప్టే తప్పయిపోయినప్పుడు, అసలు అవగాహనే తప్పయిపోయినప్పుడు మీరేమీ నేర్చుకోలేరు కనుక, దయచేసి రిపీటెడ్‌గా నేను చెప్పిన ఈ గురువు సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వసమర్థుడు అనే భావనని మీ మనసులో నిరంతరం గుర్తుంచుకోండి.



# గురువు యొక్క సర్వసమర్థత

| | | |
|---|---|---|
| గురుర్బ్రహ్మ | - | గురువు సర్వజ్ఞుడు |
| గురుర్విష్ణుః | - | గురువు సర్వవ్యాపి |
| గురుర్దేవో మహేశ్వరః | - | గురువు సర్వసమర్థుడు. |

ఈ సర్వసమర్థత్వం చాలా ముఖ్యం మనకి.

**ఎందుకు సర్వసమర్థత్వం మనకి చాలా ముఖ్యం అంటే,**

మన భారతీయ సాంప్రదాయంలో కర్మసిద్ధాంతం అని ఒక సిద్ధాంతం ఉంది.

ఈనాడు మనం పడుతున్నటువంటి కష్టాలు,
ఈనాడు మనం ఉన్నటువంటి పరిస్థితులు,
మనకు ఉన్నటువంటి అవరోధాలు,
మనకు ఉన్నటువంటి గుణగణాలు
ఇవన్నీ కూడా ఎందువల్ల ఉన్నాయి?

సంస్కారాల వల్ల.
ఇది వరకు చేసిన కర్మల వల్ల.

ఇది వరకు చేసిన కర్మల వల్ల మాత్రమే మీ భవిష్యత్తు నిర్ధారించబడితే, ఇంక మీకు స్వాతంత్ర్యం ఏం లేదు. అప్పుడు భవిష్యత్తును ఇంక మనం ఏం మార్చుకోగలం?

కానీ మార్చవచ్చు

శ్రీ భవిష్యత్తును మీరు మార్చలేరు. గురువు మార్చగలడు.

సర్వసమర్థుడు అనటంలో అర్థం అది.

మనం మార్చుకోగలిగితే మనమూ గురువులమే.
ఆ స్థితికి ఎదగాలనే మనం కోరుకుంటున్నాం.

ఇది ఎంత సంభవమో తెలియటానికి కొన్ని ఉదాహరణలు చెప్తాన్నేను. ఎప్పుడో, ఏ కాలంలోనో జరిగినటువంటి ఉదాహరణలు మనకి అక్కరలేదు.

1850 - 1870 ఆ ప్రాంతాలలో నర్మదానది ఒడ్డున ధునీవాలా బాబా అని ఒక వ్యక్తి ఉండేవాడు. ఒక గోచీ గుడ్డ మాత్రమే పెట్టుకొని ఉండేవాడు. ఆయన అసలు పేరు ఎవరికీ తెలియదు.

ధునీవాలా బాబా అని ఆయనకు ఆ పేరు ఎందుకొచ్చింది అంటే, ఆయన ఎక్కడుంటే అక్కడ ఒక నెగడు, అంటే కాస్త చితుకులు రాజేసి నిరంతరం మండిస్తూ ఉండేవాడు. హిందీ భాషలో ఆ విధంగా నాలుగైదు ముక్కలు, చెక్కముక్కల్ని పెట్టి మంటలాగ రాజేస్తే, దాన్ని ధుని అని పిలుస్తూవుంటాం. అంచేత ధుని ఉన్నటువంటి బాబా.

ఎక్కడ నుండి వచ్చాడో ఎవరికి ఏం తెలియలేదు కాని, ఆయన చాలా విచిత్రమైనటువంటి వ్యక్తి. ఆయన ఉదాహరణనే నేను ఎందుకు తీసుకొన్నానంటే, మధ్యప్రదేశ్‌లో కలక్టరుగా ఉన్నతను, ఒక ఫారినర్ తన గెజిట్‌లో ఇది రికార్డ్ చేశాడు.

శ్రీ ఫారినర్స్ చెప్తేగాని ఇండియన్స్ గొప్పదనం ఇండియన్స్‌కి అర్థం కాదు. అదీ పరిస్థితి! అందుకని చెప్పుకోవాల్సి వస్తోంది.



"బాబా! మా కూతురికి పెళ్ళిచేయాలి" అంటే, ఇసుక తీసే వాడు, బంగారు కణికలు రాలేవి. పెళ్ళి అయిపోయేది.

అంత మాత్రమేనా, ఆయనకి ఒక విచిత్రమైనటువంటి అలవాటు ఉండేది.

❋ మనకి మూడ్ వస్తే ఎలా నిద్రపోతామో,
ఆయనకు మూడ్ వస్తే శరీరం వదిలేసేవాడు.

చచ్చిపోయేవాడు అంటే బావుండదు అలాంటి వాళ్ళను కనుక శరీరం వదిలేశాడు అంటున్నాం కాని, యాక్చువల్‌గా చచ్చిపోయేవాడు. మూడ్ వచ్చేది, చచ్చిపోయేవాడు. అక్కడున్న వాళ్ళందరూ ఇంత గొప్ప వాడు, అంత గొప్పవాడు అనుకొని, బాధపడి ఓ సమాధి కట్టించేసేవారు.

❋ రెండు, మూడు రోజుల్లో దగ్గరలోని ఇంకొక ఊర్లో ప్రత్యక్షమ య్యేవాడు. ఎవరు ఏం అడిగినా ఇచ్చేస్తూ వుండేవాడు.

అలాంటప్పుడు ఏం అయిందట, ఒక జమీందార్ చాలా ఖరీదయినటువంటి, బంగారపు తీగలు వాటితో కుట్టిన ఒక అందమైన షాల్ తీసుకొచ్చి ఆయనకు ప్రజంట్ చేశాడు. ఏం మూడ్‌లో ఉన్నాడో ఏమో నిప్పులో పడేశాడు, కాలిపోయిందది. రాజుకి చాలా బాధేసింది.

ఆ బాధ చూడలేకపోయాడు, నిప్పులో చెయ్యిపెట్టాడు. ఆ బూడిద అయిపోయిన షాల్ నుంచే మళ్ళీ తీసి, ఆ జమీందారుకి ఇచ్చేశాడు, పో! అన్నాడు.

ఇదంతా ఎందుకు చెప్తున్నానో మీరు అర్థం చేసుకోండి.

❋ గురువు యొక్క సర్వసమర్థతను మీరు అంచనా వేయలేరు.

శ్రీ ఏదైనా చేయగలడతను.

ఘటనాఘటన సమర్థుడు అనేది అందుకు.

ఈ మధ్యకాలంలోనే జరిగిన సంఘటన ఇదంతా కూడ.

ఇంకొకసారి నర్మదానది ఒడ్డునే ఆయనకి మూడ్ వచ్చి అక్కడ కూడ ఒక సమాధి కట్టించేసుకున్నాడు. మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు.

**ఇంకొకచోట నర్మదానది ఒడ్డున జరిగిన సంఘటన ఏమిటంటే,**

ఆ నర్మదానది ఒడ్డున ఒక ఆశ్రమం ఉండేది. ఒక శివరాత్రి నాడు ఒక పెద్ద ఫంక్షను జరుగుతూ ఉంటే, ఆ ఆశ్రమంలోకి అనుకోకుండా అయిదారు బస్సుల ప్రజలు దిగారు. అర్ధరాత్రి, భోజనం పెట్టాలి వాళ్ళకి, సుమారు 715 మందో ఎంతమందో వచ్చార్ట.

ఎక్కడ భోజనం పెడతాం రాత్రికి రాత్రి?

అప్పుడు ఆశ్రమంలో ఉన్న ఇన్‌చార్జి పీఠాధిపతి తన శిష్యుణ్ణి ఒకడ్ని లేపి, "బాబా ఎక్కడున్నాడో వెతకరా!" అన్నాడు. వాడు బాబా దగ్గరకు వెతుక్కుంటూ వెళ్ళాడు.

ఆయన ఒక కాలు నర్మదా నదిలో ఉందిట, ఇంకొక కాలు బయట ఇసుక దగ్గర ఉందిట. పడుకుని ఉన్నాడు హాయిగా. బాబా ఇదీ పరిస్థితి అన్నాడు. ఆయన ఇసుక ఒడ్డున ఉన్నటువంటి తన కాలు కాస్త ప్రక్కకు తీసి, "తవ్వుకో!" అన్నాడు. వాళ్ళు తవ్వుకొని అక్కడ ఉన్నటువంటి ఆహార పదార్థాలన్నీ ఆశ్రమానికి జేరవేశారు.

వచ్చిన 715 మందికి భోజనం అయిపోయిన తర్వాత కాని గుంట ఖాళీ అవ్వలేదట. అందరికీ భోజనం పెట్టారు.



కాని ఈయన అవేం పట్టించుకోలేదు. అడిగిన వాళ్ళకిచ్చాడు.

**కాని ఒక్క ఘునీవాలా బాబాకి మాత్రమే ఈ శక్తి ఉందా?**

❋ అక్కల్‌కోట్ మహరాజ్ ఉన్నాడు, శిరిడీసాయి ఉన్నారు, అందరు గురువులు, ఇ.కె. గారు ఉన్నారు, శ్రీరామశర్మ ఆచార్య ఉన్నారు. అందరు గురువుల్లోనూ ఈ సర్వసమర్థత కన్పిస్తుంది.

❋ మనకి ఉన్న సంస్కారాల ద్వారా ఆ అత్యున్నతమైనటువంటి స్థితికి వెళ్ళాలి అంటే వెళ్ళలేం మనం.
మన కర్మ మనకు అడ్డు తగులుతుంది.

**కాని గురువేం చేయగలడు?**

❋ మీకు కనుక నిజమైనటువంటి ఆవేదన ఉంటే,
ఆ సర్వసమర్థత ద్వారా మీకు సాధనకు అనుకూలమైనటువంటి వాతావరణం కలుగజేస్తాడు. అది అర్థం చేసుకోండి.

**మీకు కావలసినవన్నీ ఇస్తూ కూర్చోవటానికి ఆయనకేం పని?**

"నువ్వే గురువయితే ఈ పని చెయ్యి!" అంటాం.
ఆయనకి మన సర్టిఫికెట్టు అక్కర్లేదు.

❋ కాని ఆయనకి మనం కావాలి. ఎప్పుడు కావాలి?

ఆ సంథాలో కనుక మీరు వెళుతూవుంటే కావాలి.

ఒక 30 యేళ్ళ యువకుడు చనిపోయాడు. అతని భార్యకి శ్రీపాదవల్లభుడి గురించి చెప్పారు, ఆయన దగ్గరకి వెళితే ఏదైనా అవుతుందని. ఇక చనిపోయాక ఏం చేస్తాం? కాని తీసుకెళ్ళి చూద్దాం

ఏమవుతుందో అని ఆయన దగ్గరకి తీసుకెళ్ళారు.

అక్కడికెళితే ఆయన కూడా నేనేం చేస్తానమ్మా, నేనేం చేస్తానమ్మా, అదీ ఇదీ అని రకరకాలుగా తప్పించుకోవడానికి ట్రై చేశాడు. విన్లేదావిడ. "సర్లే, అక్కడికి వెళ్ళి, నదిలోకెళ్ళి స్నానం చేసిరా!" అన్నాడు.

స్నానం చేసి వచ్చేలోపుగా బ్రతికిస్తాడు. బ్రతికించినప్పుడు. "ఎందుకు బ్రతికించావు?" అని అక్కడున్న వాళ్ళు అడిగారు.

"నేనేం బ్రతికించలేదు, కర్మను ఎడ్జస్ట్ చేశాను" అంటాడు.

❋ "ఈ తరవాత జన్మలో అతను 70 యేళ్ళు బ్రతకాలి, ఈ జన్మలో 30 యేళ్ళు బ్రతకాలి. నా దగ్గరకొచ్చి అడిగింది కనుక ఆ జన్మలో ఉన్న వయస్సు ఈ ఖాతాలో వ్రాశాను" అన్నాడు.

అంటే అక్కడ కూడా ఖాతాల్లో ఎడ్జస్ట్‌మెంట్లు ఉంటాయన్న మాట!

గురువులకే ఆ ఎడ్జస్ట్‌మెంట్లు చేతౌతాయి.

అంచేత ఏం చేశాడు? ఆ కర్మని, టాక్సని ఆ జన్మలో ఉన్న 70 యేళ్ళ వయసు. ఈ జన్మ శరీరానికి ఇచ్చి, ఆ జన్మలో 30 యేళ్ళుగా మార్చాడు. అంతే చేస్తాడు గురువు.

గురువు అన్నీ చేయగలడని మాత్రం అనుకోకండి.

❋ సర్వ సమర్థుడు అయినా ఒక్క కండిషన్‌లో మాత్రమే అన్నీ చేయగలడు. ఏ మార్పు అయినా చేయగలడు.

-- పూర్ణ సమర్పణ అయితే, అన్యథా శరణం నాస్తి. త్వమేవ శరణంమమ అంటే చేయగలడు.



కోరికలు తీర్చుకోవటానికి మాత్రమే ఈ మాట నోట్లోంచి అంటే, సర్వజ్ఞుడ్ని, ఆయన్నేం మోసం చేస్తాం?

శ్రీ మనకి మన అడ్డంకులుకాని, అవరోధాలుకాని తొలగిపోకుండా ఉండటానికి కారణం అదొక్కటే, ఆ సమర్పణ లేకపోవడమే.

శ్రీ ఇంక వద్దు, మీ ఆలోచనల్ని ప్రక్కన పెట్టండి.
ఆ గురువుకు సమర్పణ చేయండి.

-- ఆ గురుసత్తా, ఆ గురువు ఎవరైనా కావచ్చు.
ఏ రూపంలో ఉన్నవారైనా కావచ్చు. ఏమీ ప్రమాదం లేదు.

*ఏంచేతంటే,*

శ్రీ సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వ సమర్థుడు అయినటువంటి వాడు, ఈ రూపంలోనే మీకు సహాయం చేయాలనేం లేదు. మీరు ఏ రూపంలో భావిస్తే, ఆ రూపంలోనే రాగలడు.

మోసం చేయకండి గురువును.

శ్రీ నువ్వు తప్ప నాకింకెవ్వరూ అక్కరలేదు అని నిజంగా హృదయంలో మీరు కనుక మార్పు చేసుకోగలిగితే, ఆ ఒక్క కండిషన్ మీరు చేసుకోండి చాలు.

-- అది ముందు నేర్చుకోవాలి ఆధ్యాత్మిక సాధనలో.
నువ్వు తప్ప నాకింకెవ్వరు అక్కరలేదు అనగలగాలి.

❋ ఒక మీరాబాయి మీరాబాయి ఎందుకయింది? నువ్వు తప్ప నాకింకెవ్వరు అక్కరలేదన్నది. ఒక త్యాగరాజు త్యాగరాజు ఎందుకయ్యాడు? నువ్వు తప్ప నాకింకెవ్వరు అక్కరలేదన్నాడు.

ఒక సక్కుబాయి సక్కుబాయి ఎందుకయింది? నువ్వు తప్ప నాకింకెవరూ అక్కరలేదన్నది.

పోనీ వీళ్ళందరూ చాలా సంస్కారవంతులు అనుకుంటే, కృష్ణా నది ఒడ్డున ఒక బట్టలు ఉతికేవాడు ఉండేవాడు. శ్రీపాదవల్లభుడు అక్కడికి వెళ్ళి స్నానం చేస్తుండేవాడు. ఈయన కాషాయ బట్టలు అవీ కట్టుకుని వెళ్ళి స్నానం చేస్తుంటే, అసలీయన ఎవడో కూడా ఆ చాకలి వాడికి తెలియదు, దణ్ణం పెడుతూవుండేవాడు.

మనస్ఫూర్తిగా దణ్ణం పెట్టి, నీకు దణ్ణం పెట్టడం ఎలాగో కూడా నాకు తెలియదు, నేను దణ్ణం పెడుతున్నాను మీకు అనుకునే వాడు అంతే. ఈయన అతని వైపు చూసేవాడు, వెళ్ళిపోయే వాడు. అతను దణ్ణం పెడుతుండేవాడు. అంతకంటే పరిచయం లేదు వారికి.

❋ ఆ చాకలి వాడికి శ్లోకాలు రావు, తంత్రాలు రావు, వాళ్ళ మ్యాగ్ జైన్ చదవలేదు, భగవద్గీత చదవలేదు.
దణ్ణం పెట్టుకుంటుండేవాడు అంతే.

ఒక రోజు ఏమయిందట, అతను బట్టలు ఉతుకుతూవుంటే కృష్ణానది మీద ఓ నవాబు జల్సాలు చేసుకుంటూ వెళ్ళాడు. ఈ చాకలి వాడికి మనస్సులో కోరిక వచ్చింది. నేను కూడా రాజునయితే అని అలా ఫ్లీటింగ్. నేను రాజునవుతానని కూడా అతనికి నమ్మకం లేదు. ఏం నమ్మకం ఉంటుంది? కాని అనిపిస్తూ వుంటుంది కదా! అలా మనస్సులో అనిపించిందట.

ఆ రోజు ఆయన స్నానానికి వస్తున్నప్పుడు దణ్ణం పెడితే దగ్గరకు పిలిచేడట. "ఏం రాజు కావాలని ఉందా?"



"అవును స్వామీ! అనుకున్నాను."

"ఎప్పుడవుతావు? ఇప్పుడే అయిపోతావా, ఇంకొక జన్మలో అవుతావా?"

గురువు యొక్క సర్వసమర్థత!

శ్రీ మీరు ఏ విధంగాను గాభరా పడకండి.
ఆయన కావాలనుకుంటే ఆ క్షణంలోనే చేయగలడు.
అలా చేసినటువంటివి అనేక ఉదాహరణలు ఉన్నాయి.

"60 యేళ్ళు వచ్చాయి స్వామి, ఇప్పుడు రాజయి ఏం చేస్తాను, నెక్స్ట్ బర్త్‌లో అవుతాను."

"సరే అయితే నెక్స్ట్ బర్త్‌లోనే రాజువుకా!"

శ్రీ కాని ఇక్కడ మీరు చాలా జాగ్రత్తగా ఈ సంఘటనలను అర్థం చేసుకోండి.

మనకీ వస్తుంటాయి రకరకాల కోరికలు. మరి మన కోరికల న్నింటికీ ఓ శ్రీపాద శ్రీవల్లభుడు వచ్చి "ఏం నాయనా, నీకీ కోరిక ఉందా? తీర్చేయమంటావా" అని అడగలేదుగా. అడగటం లేదుగా!

అడగకపోవడానికి కారణం ఉంది. ఆ చాకలివాడు "ఈ జన్మ లో నేను ఏం రాజునవుతాను, 60 యేళ్ళు దాటాయి, ఏం సుఖపడ తాను, నెక్స్ట్ బర్త్‌లో రాజును చేయండి" అంటే "తథాస్తు!" అన్నాడు.

అన్నాక, ఆ చాకలివాడు వెళ్ళిపోలేదు.

❋ "కాని ఒక షరతు స్వామి! నీ రాజ్యం, నువ్వు ఇచ్చినటువంటి రాజ్యం, వరము నేను ఒక కండిషను మీదే తీసుకుంటాను."

ఏమిటా కండిషను, "నెక్స్ట్ బర్త్‌లో కూడా మీరు నాకు గైడెన్స్ ఇవ్వాలి, మార్గదర్శకునిగా ఉండాలి."

సర్వజ్ఞుడు అయినటువంటి గురువుకి మన మనస్సులోని బాధలు తెలుస్తాయి.

ශ්‍රී కోరికలు తీర్చుకోవడానికి నువ్వు ఆయన్ని శరణు అంటున్నావా? లేక నిజంగా మీకు ఆయన మీద ప్రేమ ఉందా?

అది తెలుసును కనుకే అతని దగ్గరకు వచ్చాడు. ఆ టెస్టుకి అతను నిలబడ్డాడు. లేకపోతే రాజ్యం, రాచరికం వద్దు అన్నాడు.

☼ "కోరిక ఉంది నిజమే నాకు.
కాని నీ కంటే ఆ కోరిక ఎక్కువ కాదు" అన్నాడు.

సరే నెక్స్ట్ బర్త్‌లో ఒక యవనరాజుగా, ఓ ముస్లింరాజుగా జన్మిస్తాడు. 40 యేళ్ళు అన్ని భోగాలు అనుభవించాక తొడ మీద కురుపులేస్తుంది.

☼ ఇది కూడా చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.
మన భారతీయ సంప్రదాయంలో మీ దగ్గరకు గురువు ఎట్లాగ వస్తాడో చెప్తుంది ఈ కథ.

ఆ యవనరాజుకి, ఆ ముస్లింరాజుకి తొడ మీద కురుపు లేస్తుంది. ఎన్ని మందులు వాడినా తగ్గదు ఆ కురుపు. అప్పుడు ఎవరో చెపుతారు, అక్కడ ఉన్నారు ఆ గురువుగారు, ఆయన దగ్గరకు వెళ్ళి తగ్గించుకో అని. అక్కడకి వెళతాడు. వెళితే,

"ఏమయ్యా చాకలి, ఇన్నాళ్ళకు గుర్తుకొచ్చానా నేను?" అంటాడు.



ఈ కురుపుపోతుంది, మళ్ళీ గురువు లభిస్తాడు. ఆ సంస్కారాలు మళ్ళీ నిద్రలేస్తాయి. మళ్ళీ సాధన మొదలవుతుంది.

ශ්‍රී మనకు వచ్చే బాధలు కూడా ఇలాంటివే అని మీరు గుర్తుంచుకోండి. లేకపోతే ఎంత చెప్పినా మనం గురువు దగ్గరకు వెళ్ళం.

బాధలు ఉన్న వారందరూ గురువు దగ్గరకు వెళ్ళిపోతే, ఇన్ని హాస్పిటల్స్ ఎందుకున్నాయి? అసలు హాస్పిటల్స్ అవసరంలేదు కదా!

☼ లేదు, ఆ బాధ ద్వారా మీరు గురువు దగ్గరకు వెళతారు.

ශ්‍රී వెళ్ళాక బాధలు మరచిపోతారు.
బాధ తగ్గుతుందా, తగ్గదా అది వేరే విషయం.

ශ්‍රී సర్వసమర్థుడు దగ్గరకు వెళ్ళాక, తగ్గకపోవడం అన్నదే లేదు. అది అర్థం చేసుకోండి.

-- ఆ గురు సాంప్రదాయం అర్థంకాక ఇలా కొట్టుమిట్టాడుతున్నాం.

-- ఒక శక్తిమంతుడి దగ్గరకి వెళ్ళాక తగ్గకపోవడమంటూ ఉండదు.

ఒక కథ చదివేవాణ్ణి చిన్నప్పుడు. చీకటి దేవుడి సుప్రీంకోర్టులో కేసు వేసిందట. "సూర్యుడు చాలా అన్యాయం చేస్తున్నాడు. నేను ఎక్కడ ఉంటే అక్కడ వెంటపడి తరుముతున్నాడు. అసలు నన్ను ఎక్కడా నించోనివ్వడం లేదు, చాలా అన్యాయం ఇది. మీరు ఏదో స్టెప్స్ తీసుకోవాలి, ఇలాంటి అన్యాయాన్ని అరికట్టడానికి" అని కేసు వేసిందిట. సరే రైట్ అన్నాడు, కేసు యాక్సెప్ట్ చేశాడు.

సూర్యుడు ఎక్కడ ఉన్నా సరే కోర్టులో హాజరు పరచండి అని వారంటు ఇచ్చాట్ట. చీకటి కోర్టులో ఉంది, సూర్యుడుని హాజరు

పరచమన్నాడు. సూర్యుడు వస్తే చీకటి ఉండదు అక్కడ. చీకటి ఉంటే సూర్యుడు ఉండడు. ఇంక ఎలా హాజరు పరుస్తాడు?

ఇంత వరకూ జరుగలేదట అది. కొన్ని వేల సంవత్సరాలు అయిపోయింది, ఈ సమస్య తేలదు.

❋ అలాగే గురువు దగ్గరకు మీరు వస్తే, మీకు సమస్యలు ఉండవు. సమస్యలు ఉన్నాయంటే గురువు దగ్గరకు రాలేదు.

ఈ భావన అర్థం చేసుకోండి. మీకు సమస్యలు ఉండి ఇక్కడికి రావచ్చు, సమస్యల వల్లే వస్తాం మనం గురువుల దగ్గరకి. నో ప్రాబ్లమ్! లేకపోతే అసలు రాం మనం ఆయన దగ్గరకి.

❋ వచ్చాక సమస్యలు ఉన్నాయంటే మీరు గురువు దగ్గరకు రాలేదు, సమస్యలను పట్టుకొని వ్రేళ్ళాడుతున్నాం మనం.

-- సమస్యల్ని వదిలితే కదా!

శ్రీ మీరు "సమస్యల్ని మేం వదలటానికి రెడీగా ఉన్నాం" అని మీరు గురువును పట్టుకొంటే ఆటోమాటిక్‌గా సమస్యలు పోతాయి. గ్యారంటీగా పోతాయి.

ఇన్ని కోట్ల కోట్ల కోట్ల యుగాల నుంచీ
ఆ గురువుల చరిత్ర మీరు చూస్తూ ఉండండి,
ప్రతీ చోట ఆ సమస్య నివారణ అవుతూనే ఉంది.

"కానీ మా సమస్య పోవటం లేదే?"

శ్రీ మీ తప్పు తెలుసుకోండి. మీరు సమర్పణ చేయలేదు.

సమర్పణ చేయకుండా జరుగదు.



శ్రీ క్రింద మెట్టును వదలను నేను, పై మెట్టుకు ఎక్కాలని మీరు ఎంత చెపితే, ఎవడేం చేయగలడు?

-- మీరు వదిలేయండి క్రింద మెట్టుని. ఆ మెట్టు నుండి కాలు తీసి, పై మెట్టు మీద పెడితే కదా మీరు పైకెక్కేది?

ఆహా! నేను ఇక్కడే ఉండాలి.
ఈ శరీరంలోనే ఉండాలి.
ఈ ఊర్లోనే ఉండాలి.
ఈ మైక్ దగ్గరే కూర్చోవాలి.
ఈ బట్టలే కట్టుకోవాలి.

ఎలా సంభవం? How can you grow?

అదీ మనం చేస్తున్నటువంటి తప్పు. అంచేత ఈ -

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః

❋ ఆ శ్లోకం ఎంత భావగర్భితమైనటువంటి శ్లోకము! మనం దాన్ని ఎంత కాజువల్‌గా ఉచ్చారణ చేస్తామో చూసుకోండి.

-- అసలు మీరు అర్థం చేసుకోగలిగితే, అసలు అయిపోయిందసలు. ఇంకే క్లాసు అక్కర్లేదసలు. You have realised.

మీకు ఏం చేయాలో అర్థమయింది కాబట్టి ఇంక చేయాలి. ఇది చెయ్యడం అలవాటు చేసుకోవడానికి టైమ్ పడుతుంది, అది వేరే విషయం. కాని, ఏం చేయాలో మీకు అర్థమైందికదా!

☼ ❋ ☼

# అనుగ్రహ మాలామంత్రము

సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వసమర్థుడు అయిన గురువుకు
మనం సమర్పణ ఎలా చేయాలి?
మన సంస్కారాలను ఎలా వదలగొట్టుకోవాలి?

☼ దీనికి మీకు 16 మంత్రాలు ఇస్తున్నాను.

అది ఇప్పుడు చేయిస్తాను నేను. చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి ఆ మంత్రాలను.

ఈ మంత్రాలు ఎందుకు మీకు నేర్పిస్తున్నానో చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

మిమ్మల్ని వదిలేసుకుని,
మీ బాధల్ని వదిలేసుకొని,
సర్వజ్ఞత్వాన్ని పొందటానికి,
సర్వవ్యాపకత్వాన్ని పొందటానికి,
సర్వసమర్థత్వాన్ని పొందటానికి
ఈ 16 చాలు.

కాని ఈ 16 మంత్రాలతో పాటు ప్రకృతిలో ఉన్న 24 శక్తులను మీరు కలుపుకోవాలి. వీటినే రెండు మంత్రాలు అని మీకు చెప్పాను.

① గాయత్రీ మంత్రము

② షోడశీ మంత్రము



☼ వీటి ద్వారా మీరు గురువు అనుగ్రహానికి పాత్రులవుతారు కనుక, ఈ గాయత్రీ, షోడశీ మంత్రాలను ఉపయోగించుకొంటూ, నేను ఇప్పుడు ఇవ్వబోతున్న మంత్రానికి అనుగ్రహ మాలామంత్రము అని పేరు పెడుతున్నాం మనం.

పేరు ఏదైనా పెట్టుకోవచ్చు మీరు. పేరులో ఏం లేదక్కడ. కాని గురువు అనుగ్రహానికి మీరు పాత్రులవడానికి ఇది తెలియాలి.

***ఏది తెలియాలి?***

ఇందాక చెప్పుకొన్నాం కదా, మన అల్పజ్ఞత్వం వదులుకోవాలి.

***మన అల్పజ్ఞత్వానికి కారణం ఏమిటి?***

ఈ శరీరము.

***ఈ శరీరం ఎలా ఏర్పడింది?***

5 జ్ఞానేంద్రియాలు ఉన్నాయి.
5 కర్మేంద్రియాలు ఉన్నాయి.
5 తన్మాత్రలు ఉన్నాయి.
వీటన్నిటిని యాక్టివేట్ చేయటానికి 5 ప్రాణాలు ఉన్నాయి.
వీటిని మోటివేట్ చేసే 4 అంతఃకరణాలు ఉన్నాయి.

| | |
|---|---|
| కర్మేంద్రియాలు | - వాక్కు చేతులు కాళ్ళు జననేంద్రియం గుదము |
| జ్ఞానేంద్రియాలు | - చెవి చర్మము కన్ను నాలుక ముక్కు |
| తన్మాత్రలు | - శబ్దము స్పర్శ రూపము రసము గంధము |
| ప్రాణవాయువులు | - వ్యాన ఉదాన సమాన అపాన ప్రాణములు |
| అంతఃకరణాలు | - మనస్సు బుద్ధి చిత్తము అహంకారము |

| | |
|---|---|
| కర్మేంద్రియాలు | 5 |
| జ్ఞానేంద్రియాలు | 5 |
| తన్మాత్రలు | 5 |
| ప్రాణవాయువులు | 5 |
| అంతఃకరణాలు | 4 |
| మొత్తము | 24 |

ఇవి మనల్ని కట్టిపడేస్తున్నాయి.

☼ ఈ 24 ఈ శరీరంలోనే ఉన్నాయి.

-- మనో, బుద్ధి, చిత్త, అహంకారాలు, 5 ప్రాణాలు, 5 కర్మేంద్రియాలు, 5 తన్మాత్రలు ఈ శరీరంలోనే ఉన్నాయి.

ఈ 24 ని మీరు స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

☼ ఆ ఇరవై నాలుగే గాయత్రీ మంత్రంలో ఉన్న 24 అక్షరాలు.

మీ అంతట మీరు ఏ విధంగా గురువు అనుగ్రహానికి పాత్రులు కాలేకపోతున్నారో మీకు అర్థం అవ్వాలి

గాయత్రీ మంత్రము అందుకు ముఖ్యం.

**గాయత్రీ మంత్రాన్ని ఇంకొక జన్మ ఇచ్చేటటువంటి మంత్రము అని ఎందుకు అంటామంటే,**

☼ మీరుగా భావింపబడుతున్నటువంటి ఇరవై నాలుగింటిని కూడా గురువుకి సమర్పించుకొనేటటువంటి టెక్నిక్ నేర్పుతుంది.



**మననేం చేస్తాం,**

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః

అనే శ్లోకాన్ని అర్థరహితంగా ఎలాగ ఇన్ని సంవత్సరాల బట్టీ చదువుకొంటూ వచ్చామో, గాయత్రీ మంత్రాన్ని కూడా అలాగే చదువుకుంటూ వస్తున్నాం.

**గాయత్రీ మంత్రము అంటే ఏమిటి?**

ఓం భూర్భువః స్వః
తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి
ధియోయోనః ప్రచోదయాత్.

☼ మీ శరీరంలో ఉన్నటువంటి 24 శక్తులకి, గాయత్రీ మంత్రానికి ఉన్న లింకు తెలియకపోతే లాభం లేదు. దాన్ని నేర్చుకుందాం.

కాని అది మాత్రమే తెలుసుకొంటే లాభం లేదు.

☼ ఈ శరీరంలో చేతనత్వం ఒకటుంది, చిత్కళ ఒకటి ఉంది. దానికి 16 కళలు ఉంటాయి.

-- ఆ పదహారు కళలు, గురువు యొక్క కళలుగా మార్చుకోవాలి.

అందుకే ఈ 16 కళలను దత్తుని యొక్క, గురువు యొక్క, దత్తావతారం యొక్క అవతారాలు అంటాం మనం.

మళ్ళీ దత్తావతారము అంటే దయచేసి 3 తలకాయలు, 6 చేతులు ఉన్నటువంటి వ్యక్తిగా భావించకండి.

ఎవడా దత్తుడు? సర్వజ్ఞుడు.

ఎవరు ఆయన? సర్వవ్యాపకుడు.

ఎవరు ఆయన? సర్వసమర్థుడైనటువంటి గురువు.

ఆ గురువుకి మనం ఇచ్చుకున్నటువంటి పేరు "దత్తుడు".

☼ అంచేత ఆ గురువు యొక్క చిత్కళలతో, ఆ గురువు యొక్క 16 కళలతో, నా యొక్క 16 కళలను కూడా కలుపుతాను అనేదే షోడశీవిద్య.

అందుకే శ్రీకృష్ణుణ్ణి, షోడశకళా ప్రపూర్ణుడైనటువంటి అవతారాన్ని జగద్గురువు అని కూడా అంటాం. మిగతా అవతారాలకు ఆ పేరు లేదు. జగద్గురువు అనే పేరు ఒక్క శ్రీకృష్ణుడికే ఉంది.

ఆ శ్రీకృష్ణుడు సర్వవ్యాపి.
ఆ శ్రీకృష్ణుడు సర్వసమర్థుడు.
ఆ శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడు.

ఏ శ్రీకృష్ణుడు? ద్వాపరయుగంలో చనిపోయినటువంటి ఆ శరీరము కాదు. ఆ శరీరములో ఉన్నటువంటి కళలు, 16 కళలు. అవి ఈనాడు ఉన్నాయి, ఆనాడు ఉన్నాయి.

ఈ 16 కళలని శ్రీయంత్రము ద్వారా కూడా మనం పూజిస్తూ ఉంటాం, నేర్చుకుంటూ ఉంటాం.

కాని ఈనాడు మనం ఏం చేస్తున్నాం? శ్రీయంత్రం మీద కుంకుమ వేసేస్తాం, పని అయిపోయింది అనుకొంటాం.

ఏమవుతుంది? ఏమీ అవదు.



ప్రతీ వాళ్ళ ఇంట్లోను శ్రీయంత్రాలు ఉన్నాయి.

ఏం పలుకుతోంది యంత్రం?

మోటారు కారు కొనేసి తీసుకొచ్చి పెట్టేశాం. దానికి ఇంత పూజ చేస్తూవుండండి. అక్షింతలు వేస్తూవుండండి. ఏం లాభం మీకు? యంత్రం ఉంది మీ దగ్గర.

అక్షింతలు వేస్తే కదులుతుందా యంత్రం?
ఉపయోగించుకొంటే కదులుతుంది.

ఉపయోగించుకోవటానికి ఆ విధానం తెలియాలి మనకి. ఆ విధానం ఎవరు నేర్పుతారు? తెలుసున్నవాడు నేర్పుతాడు.

☼ మనలో ఉన్నటువంటి 24 జడాత్మకమైన ఈ ప్రాకృతిక శక్తులు,
మనస్సులో ఉన్నటువంటి 16 శక్తులు,
ఈ రెండింటిని అనుసంధానం చేయాలి.

అనుసంధానం ఎలా చేస్తాం మనం?
కలుపుకోవడానికి మన దగ్గర ఉన్నటువంటి విధానం ఏమిటి?

చెప్పడమైతే చెప్పేశాం. జడపదార్థం ఉంది, ఈ శరీరం ఉంది.
ఈ శరీరంలో చేతనత్వం ఉంది. అది వేరుగా ఉంటుంది.

*ఈ రెండింటిని మనం ఏం చేయాలి ఇప్పుడు?*

యోగం చేయాలి. కలపాలి.

*ఎలా కలుపుతాం?*

ఒకే ఒక అక్షరం చెప్పారు మన ఋషులు.
అసలు ఇంకొక విధానం లేదు మన దగ్గర.

☼ ఎవడు, ఎప్పుడు ఈ జడప్రకృతిని, మనలో ఉన్న దైవీ చేతనత్వాన్ని కలిపినా ఆ ఒక్క అక్షరాన్ని ఉపయోగించుకొనే కలుపుతాడు.

తస్యవాచకః ప్రణవః

☼ ఓం అనే అక్షరంతోనే కలపడం జరుగుతుందది.
ఇంకొక అక్షరం లేదు. ఆ అక్షరాన్ని మార్చే విధానం కూడ లేదు.

-- మన ఇష్టమొచ్చినట్లు అక్షరాన్ని మార్చుకోవడానికి,
ప్రకృతిని మనం ఎలా మారుస్తాం?

ఉప్పుకి పేరు మార్చేయొచ్చుగాని, దాని లక్షణాలు మారవు. ఇవాళ నుంచి మనమందరం ఒక బిల్ పాస్ చేసేసి, రోడ్ల పేర్లు ఎలా అయితే మార్చేస్తుంటామో, అదీ మనం చేస్తుండే ఘన కార్యాలు. ఊర్ల పేర్లు మార్చేస్తూవుంటాం. మార్చుకోండి, ఏమవుతుంది? ఉప్పును ఇవాళ నుంచి మీరందరూ కూడ ఏమని పిలుస్తారు, పంచదార అని పిలవండి. పిలవండి దానికేముంది.

పంచదార అని పిలుస్తున్నాం గనుక, ఉప్పును కాఫీలో వేసుకుంటే ఇవాళ నుంచి నా పేరు పంచదార గనక తియ్యగా అయిపోతాను అని అనదు. ఒకవేళ అయిపోతే దాన్ని ఉప్పు అని అనం మనం. దాన్ని పంచదారే అంటాం. తేడా అర్థమవుతోంది కదా!

అంచేత ఓం. కాని ఈ ఓం అనేటటువంటి మాటను మనం ఉపయోగించుకొన్నా అనుసంధానం మనం చేయలేకపోతే ఏం లాభం?

☼ భారతీయ జాతిని చూస్తూవుంటే అక్కడ బాధ వేస్తూవుంటుంది.
ఎంత అద్భుతమైనటువంటి విధానాలు ఉన్నాయో!



కాని ఉపయోగించుకోం మనం.

ఈ ఓం ని ఎలా ఉపయోగించుకోవాలి?
గాయత్రీ మంత్రం అంటే ఏమిటో చెప్పాను కదా!

**ఏమిటి గాయత్రీ మంత్రం?**

మనమే. మనమే అంటే ఎవరు?

☼ 5 కర్మేంద్రియాలు,

-- 5 జ్ఞానేంద్రియాలు,

-- ఈ 5 కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలకి మధ్యన లింకు పెట్టే 5 తన్మాత్రలు,

-- ఈ మూడు 5 లు, 15 ను ఉపయోగించుకొనే పంచప్రాణాలు,
అక్కడికి మొత్తం 20. ఈ పంచప్రాణాలు ఎలా వస్తున్నాయి?

-- మనో, బుద్ధి, చిత్త, అహంకారాలు.

ఈ 24 తేనిది ఎవరు?

☼ ప్రతి స్త్రీకి ఉన్నాయి, ప్రతి పురుషుడికి ఉన్నాయి.
చిన్న పిల్లలకి ఉన్నాయి, పెద్దవాళ్ళకి ఉన్నాయి.

-- డిగ్రీ డిఫరెన్స్ ఉండొచ్చు. కొందరికి చెవులు బాగా పనిచేస్తూవుండొచ్చు, కొందరికి విన్పించకపోవచ్చు. అది వేరే విషయం.

-- అంచేత ఈ 24 ఉన్న ప్రతి ఒక్కడూ గాయత్రీ మంత్ర స్వరూపుడే.

కానీ గాయత్రీ మంత్రానికి ముందు కూడా మనం ఒక మాట వాడుతూవుంటాం, ఓం.

శ్రీ ఏ మంత్రం చేసినా 'ఓం' పెట్టకుండా చేసే మంత్రము భారతీయ సాంప్రదాయములో, వేద ధర్మంలో నిషిద్ధము.

-- ఓంకారము ఉచ్చారణ చేయకుండా మీరు ఏదైనా మంత్రాన్ని ఉపయోగిస్తే, అది తాంత్రిక సాంప్రదాయానికి, తంత్రానికి వెళ్తుంది తప్ప, వేద ధర్మానికి విరుద్ధమంటారు పెద్దలు.

ఎంచేత? ఓంకారము కూడ మీరే కనుక.

***ఓంకారము కూడా మీరే అంటే ఏమిటి?***

మనము ఇక్కడ మెలకువగా ఉన్నాం.
మనం ఉన్నాం, కలలు కంటూ ఉంటాం.
మనం ఉన్నాం, గాఢనిద్రలో ఉంటాం.

ప్రతీ ఒక్కడికి ఈ మూడు స్థితులు ఉన్నాయి.

జాగ్రదావస్థ ఉంది మనకి,
స్వప్నావస్థ ఉంది మనకి,
సుషుప్తావస్థ ఉంది మనకి.

ఈ 3 అవస్థలు ఉపయోగించుకోండి. అదీ యోగమంటే.
అది మనం మర్చిపోయి ఓం అంటూ ఉంటాం.

అసలు ఓం అన్నామా?
ఎన్నిసార్లు అన్నామో కూడా గుర్తుండదు.

శ్రీ జాగ్రదావస్థలోనే మనకి స్మృతి లేకపోతే ఇంక స్వప్నావస్థ యొక్క స్మృతి, సుషుప్తావస్థ యొక్క స్మృతి ఎలా వస్తుంది?
కానీ మీ సిలబస్ అదే.



యోగవిద్యను మీరు ఒక్క మాటలో చెప్పాలంటే ఏమిటంటే,
" ఓం ".

ఇంజనీరింగ్ డిగ్రీ, దాని తర్వాత పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీ ఇన్ ఇంజనీరింగ్, ఎమ్.ఇ., ఎమ్.టెక్. రెండు అక్షరాలే చెప్తాం మనం. కాని ఆ రెండక్షరాలలో ఎన్ని సంవత్సరాల సిలబస్ ఉంది? ఒక 7 సంవత్సరాలు, 8 సంవత్సరాల సిలబస్ ఆ రెండక్షరాలలో ఉంది.

☼ అలాగే ఓం అనేటటువంటి 3 అక్షరాలు,
అ ఉ మ అనేటటువంటి ఈ 3 అక్షరాలలో మానవజాతి యొక్క సమస్త ఆధ్యాత్మిక సిలబస్ ఉందక్కడ.

This is what we have to learn. ఇదీ మన లక్ష్యము.

ఓం అని మీరు ఎప్పుడు అన్నా, ఇది మీరు చేస్తున్నారా?

మీ జాగ్రదావస్థను మీరు మార్చుకోగలుగుతున్నారా?
మీ స్వప్నావస్థను మీరు మార్చుకోగలుగుతున్నారా?
మీ సుషుప్తావస్థను మీరు మార్చుకోగలుగుతున్నారా?

ఇది మనం గుర్తుంచుకొని, ... ... ... ఓం ... ... ...

కానీ నా యొక్క స్థూల శరీరంలో ఉండేటటువంటి జాగ్రదావస్థ ఉంది, అది మీకు ఉంది, మీకు ఉంది, మీకు ఉంది. అలా 800 కోట్ల మానవజాతి ఉంది.

మానవజాతి మాత్రమే లేదు, గ్రహాలు ఉన్నాయి, జంతువులు ఉన్నాయి. ఇవన్నీ కూడ విరాట్ స్థూలజగత్తు. ఈ విరాట్ స్థూలజగత్తుతో మనకి సంబంధం కావాలి. ఉత్తినే అంటే సరిపోదు.

నేను మెలకువగా ఉన్నాను అంటే సరిపోదు.

**మీ యొక్క మెలకువ ఏ యొక్క మెలకువతో కలసి ఉండాలి?**

మీ యొక్క మెలకువతో కలసి ఉండాలి, అందరి యొక్క మెలకువతో కలసి ఉండాలి. దానితో కూడ సరిపోదు. గ్రహాలతో కలవాలి. విరాట్ ప్రపంచంతో కలవాలి. దాన్నే హిరణ్యగర్భుడు, విరాట్ స్థూలం అంటాం మనం. దిక్ వ్యాపకత్వం చెందాలి.

అంచేత మీ యొక్క జాగ్రదావస్థ, విరాట్ జాగ్రదావస్థ అవ్వాలి.

**విరాట్ జాగ్రదావస్థ అంటే అర్థమయింది కదా మీకు?**

ఇప్పుడు ఇక్కడ మీరు కూర్చుని ఉంటారు.
సూర్యుడిలో ఏం జరుగుతోందో తెలియాలి.
అంగారక గ్రహంలో ఏం జరుగుతోందో తెలియాలి.
ఆ విశాల అంతరిక్షంలో సుదూర నక్షత్రాలలో ఏం జరుగుతోందో తెలియాలి. అదీ మన సిలబసు.

**ఆధ్యాత్మికవిద్య ఎందుకంత గొప్పది అంటే,**

ఇక్కడ పిండాండ - బ్రహ్మాండ సమన్వయమని చెప్పాను కదా! లక్ష్యం అది. మీరు ఒక్కళ్ళే కాదు, మీ ద్వారా విరాట్‌తో సంబంధం ఉండాలి.

"అదెలా సంభవం మాష్టారు?"

చిన్న టీవీ! జి.టీవీ వస్తుంది అందులోనే.
ఈటీవీ వస్తుంది. జెమినీ టీవీ వస్తుంది.
అందులో రావటం లేదా?



ఏం కావాలి? స్విచ్చులు నొక్కుకోవటం నేర్చుకోవాలంతే.

నొక్కకపోతే? "జెమిని టీవీ, జెమిని టీవీ, జెమిని టీవీ, అని లక్షాయాభై సార్లు అనుష్ఠానం చేశాను మాష్టారు!" అంటే, ఏమీ పలకదక్కడ. కాని టీవీ దగ్గర మీరు స్విచ్ నొక్కితే, మీరు అనుష్ఠానాలేం చేసుకోవక్కరలేదు, లింక్ ఏర్పడుతుంది.

**దేనికి లింకు ఏర్పడింది?**

☼ చిన్న టీవీసెట్ అనే పిండాండానికి, విశాల అంతరిక్షంలో ఉన్న ప్రసారాలనే బ్రహ్మాండంతో సమన్వయం ఎలాగైతే జరిగిందో,

-- ఈ శరీరంలోనే, ఈ జాగ్రదావస్థలోనే మనం ఈ విశాల జాగ్రద అంతరిక్షంతో సంబంధం పెట్టుకోవచ్చును అని భారతీయ ఋషి సాంప్రదాయం చెప్తోంది.

ఈ సంబంధం పెట్టుకునేటటువంటి టెక్నిక్ మనం మర్చిపోకుండా ఉండటానికి ఓం తర్వాత భూర్ అంటాం. అంటే,

భూర్ - జాగ్రదావస్థలో విశాలత్వము.

భువః - సూక్ష్మజగత్తు యొక్క మాస్టర్ కంట్రోల్. ఏ సూక్ష్మలోకాలు? అన్ని రకాలయిన సూక్ష్మలోకాల యొక్క ఆధిపత్యము.

స్వః - వీటన్నిటికీ వెనకాతల వున్న కారణశరీరం, విరాట్ కారణ శరీరం యొక్క ఏడు స్థాయిల్ని పట్టుకోవడానికి స్వః

భూర్ - జాగ్రదావస్థలో విశాలత్వము.
భువః - స్వప్నావస్థలో విశాలత్వము.
స్వః - సుషుప్తావస్థలో విశాలత్వము.

ఓం భూర్ భువః స్వః

- మనం ఎంత చిన్న కోరికతో ఇక్కడ కూర్చున్నామో చూడండి.
- మీరు చేస్తున్నటువంటి ఈ స్థూల, సూక్ష్మ, కారణ సాధనలు మిమ్మల్ని ప్రకృతి యొక్క విరాట్ స్థూల సూక్ష్మ కారణాలతో లింక్ అప్ చేస్తుంది.

ఇక ఈసారి గాయత్రీ మంత్రాన్ని కాజువల్‌గా ఉచ్చారణ చేయకండి. దాని అర్థం ఇది. ఇక్కడ సిలబస్‌ని రిపీట్ చేసుకుంటున్నారు. అది రిపీట్ చేసుకొంటేనే కదా ముందుకు వెళ్ళేది.

ఓం భూర్ భువః స్వః

కాని అంత పెద్ద విరాట్ స్వరూపంతో సంబంధం పెట్టుకోవాలంటే మనకి ఏం కావాలి? ఒక పనిముట్టు కావాలి. ఒక ఆపరేటస్ కావాలి. ఒక ప్రయోగశాల కావాలి.

ఆ ప్రయోగశాలలే మన మానవశరీరాలు.

- ఈ శరీరం ఉంటేనే భూర్ భువః స్వః ఓంకారమూ లింక్ అప్ అవుతాయి. లేకపోతే లింక్ కాదు.
- దేవతలకి కూడా కుదరదది.
  భౌతిక శరీరం ఉన్నవాళ్ళకే కుదురుతుందది.

అందుకే శరీరమాద్యం ఖలు ధర్మసాధనం అన్నారు పెద్దలు.

- దేవతలు కూడా భౌతిక శరీరం పొందాలనుకుంటారు అని పుస్తకాలలో చెప్పడానికి గల కారణం ఇదే.



లేబరేటరీ లేకుండా ఎంత పెద్ద సైంటిస్ట్ అయితే మాత్రం ఏం చేయగలడు?

- ఆ లేబరేటరీలో మీకు ఉన్న పనిముట్లేమిటో గుర్తు చేసుకోండి.
- ఈ పనిముట్లను మీరు ఉపయోగించుకోకుండా ఉత్తినే మీరు గాయత్రీ మంత్ర ఉచ్చారణ చేస్తే ఏం లాభం? ఏం ఉండదు.

పూర్వకాలపు ఋషులు ఆ గాయత్రీ మంత్రాన్ని ఉపయోగించుకొనే ద్విజత్వాన్ని పొందారు. భారతదేశంలో ఆ గాయత్రీ మంత్రాన్ని కొన్ని వేల సంవత్సరాల బట్టీ కొన్ని కోట్ల మంది చేస్తున్నారు. కాని ఆ స్థాయికి చెందినటువంటి వాళ్ళు ఒక దయానంద సరస్వతి, ఒక శ్రీరామశర్మ ఆచార్య మాత్రమే ఋషులుగా మనకి కనిపిస్తున్నారు.

**కారణమేమిటంటే,**

లేబరేటరీ ఉన్నా ఉపయోగించుకోవడం రావాలి. ఉపయోగించుకోవడం రావడానికి మీ దగ్గరున్న పనిముట్లను అర్థం చేసుకోండి.

తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి
ధియోయోనః ప్రచోదయాత్

అని 24 పనిముట్లు, కేంద్రాలు ఉన్నాయి.

అవే మనం చెప్పుకొన్న 5 కర్మేంద్రియాలు, 5 జ్ఞానేంద్రియాలు, 5 తన్మాత్రలు, 5 ప్రాణాలు, 4 అంతఃకరణాలు.

టీవీలో ప్రపంచంలో ఉన్నటువంటి అన్ని చానల్స్‌ని ట్యూన్ చేయటానికి రిమోట్ కంట్రోలర్‌లో కొన్ని నంబర్లు ఉంటాయి.

☼ అలాగే మనకి 24 నంబర్లు ఉన్నాయి. ఈ 24 నంబర్స్‌లో మీరు ఏ నంబరు నొక్కుకుంటే, ఆ ఛానల్‌తో మీకు అంతరిక్షంలో లింక్ అవుతుంది. అది అర్థం చేసుకోండి మీరు.

ఓం భూర్భువః స్వః
తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి
ధియోయోనః ప్రచోదయాత్.

ఇప్పుడు గాయత్రీ మంత్రాన్ని అంత గొప్ప మంత్రం ఎందుకంటామో, మీకు అర్థమై ఉంటుంది. ఇంతకంటే ఏం నేర్చుకోగలరు మీరీ ప్రపంచంలో? ఏం వదిలాం మనం ఈ మంత్రంలో?

☼ అంచేత గాయత్రీని మించిన ఇంకొక మంత్రం లేదు.

"గాయత్రి బదులు ఇంకొకటి చేస్తాం మాస్టారు!"
సిలబస్ మారిపోతుంది. అంతకంటే మనం చేసేదేముంది?

ఎమ్మెస్సీ చదవకుండా ఎమ్.ఏ. చదువుతాను మాస్టారు, మీరు కెమిస్ట్రీ చెప్పండంటే ఎలాగ? ఎమ్.ఏ. అంటే సిలబస్ మారిపోతుంది.

☼ అంచేత మీరు ఇది ఉపయోగించుకోవాల్సిందే.

☼ మీకు ఈ విశాలత్వం రావాలంటే, ద్విజత్వము రావాలి అంటే, మన శరీరం ద్వారా బ్రహ్మాండముతో సంబంధం పెట్టుకోవాలి అంటే, ఇది తప్ప వేరే మార్గము లేదు.

ఓం భూర్ భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



**మన శరీరంలో ఉన్న ఆ 24 శక్తులను ఏం కోరుకొంటున్నాం మనం?**

నా యొక్క స్థూలము, విశాల స్థూలము.

నా యొక్క సూక్ష్మము, విశాల సూక్ష్మము.

నా యొక్క నిద్ర, విశాలమైనటువంటి నిద్రల మధ్య సమన్వయము కోరుకొంటున్నాం.

కాని ఈ సమన్వయము చేయటానికి టీవీ ఆన్ అవటానికి ప్లగ్ పాయింట్ కావాలి. పిన్ చేసుకోవాలి మీరు.

☼ త్రీ వే ప్లగ్ ఉంటుంది కదా! మూడు పిన్నులు పెట్టుకొంటే, ఆ కరెంటు అందులోకి ప్రవహించడం మొదలెడితే పిండాండ బ్రహ్మాండ సమన్వయం కుదురుతుంది కనుక,
ఇక్కడ త్రీ పిన్ పాయింట్ పెడతాం.

హ్రీం శ్రీం క్లీం

ఇది పెట్టకుండా కరెంటు రావాలి!

"మేం ప్లగ్ పెట్టం మాస్టారు, టీవీ కొన్నాం తెలుసా, మీ టీవీ బ్లాక్ అండ్ వైట్. మాది వీడియోకాన్ బజాకా! క్రొత్తది, కంప్యూటరైజ్డ్!"

ఏం అయిజ్యో! మీరు ఆ హ్రీం శ్రీం క్లీం ప్లగ్ పెట్టకపోతే పలకదది.

అంచేత దాన్ని కూడ కలుపుకుని, మన మంత్రం ఎలా తయారయింది అంటే,

ఓం భూర్భువః స్వః
హ్రీం శ్రీం క్లీం
తత్సవితుర్వరేణ్యం

భర్గోదేవస్య ధీమహి

ధియోయోనః ప్రచోదయాత్.

☼ ప్లగ్ పెట్టాం. కరెంటు ఫ్లో అవుతోంది, బాగానే ఉంది. సర్క్యూట్ కంప్లీట్ కాలేదు. సర్క్యూట్ కంప్లీట్ అవటానికి ఈ మూడు వైర్లూ మళ్ళీ బయటకి వెళ్ళాలి. సర్క్యూట్ కంప్లీట్ అవ్వాలికదా!

-- అంచేత ప్రచోదయాత్ అన్నాక ఏం చెప్తాం మళ్ళా,

హ్రీం శ్రీం క్లీం ఓం

అంచేత ఇదీ మంత్రం.

ఓం భూర్ భువః స్వః
హ్రీం శ్రీం క్లీం
తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి
ధియోయోనః ప్రచోదయాత్
హ్రీం శ్రీం క్లీం ఓం.

కాని దీని వల్ల ఎంత వరకు వచ్చింది, టీవీ ఆన్ అయింది. కానీ ఇక్కడ ట్రాన్స్‌మిషను లేకపోతే ఏం లాభం?

***ఆ ట్రాన్స్‌మిషను ఎక్కడ నుంచి వస్తుంది?***

గురువు దగ్గర నుంచి వస్తుంది.

☼ గురువు దగ్గర నుంచి వచ్చే ట్రాన్స్‌మిషన్‌ని, 16 కళలను పట్టుకొనే బీజమంత్రం శ్రీం అనేటటువంటి బీజమంత్రం.

భారతదేశంలోనే ప్రతీ వ్యక్తికి ముందు శ్రీ అని చేర్చుకోవడం



ఒక సాంప్రదాయం. ఆడవాళ్ళు అయితే శ్రీమతి. అంటే శ్రీ ఉన్నవాళ్ళు అని అర్థం.

***ఏమిటి శ్రీ అంటే,***

గురువు అనుగ్రహం ఉన్నవాళ్ళు అని.

ఈ షోడశ కళల గురించి తెలిసున్నవాళ్ళు అని.

కాని మనం అసలు శ్రీం అంటే ఏమిటో మర్చిపోయాం.

శ్రీవిద్య అంటాం. అంటే ఏ విద్య? శ్రీ గురించి చెప్పే విద్య.

***శ్రీసూక్తము అంటే దేని గురించి చెప్పేటటువంటి సూక్తము అది,***

శ్రీ గురించి చెప్పేటటువంటి సూక్తము.

☼ శ్రీసూక్తము అంటే, చేతనత్వము యొక్క 16 కళలు గురించి చెప్పేటటువంటి సూక్తము.

☼ ఎలాగైతే ఓం అంటే నా యొక్క జాగ్రదావస్థ, నా యొక్క స్వప్నావస్థ, నా యొక్క సుషుప్తావస్థ అని ఎలా చెప్తున్నామో,

-- శ్రీం అనేమాట ఎప్పుడైతే మనం వాడతామో, నేను ఈ శరీరాన్ని కాదు, స్థూల సూక్ష్మ కారణ శరీరాలు కాదు, చేతనత్వాన్ని నేను.

***ఎటువంటి చేతనత్వాన్ని?***

"16 కళలు కలిగినటువంటి చేతనత్వాన్ని నేను" అని గుర్తు చేసుకుంటున్నాం.

☼ 15 కళలు, పూర్ణిమనాడు ఉండే శ్రీ కళను ఉపయోగించుకోవడమే "శ్రీవిద్య" అంటే.

- ఆ 15 కళలకి, 15 అక్షరాలు మనం ఉపయోగిస్తాం.

క ఏ ఈ ల హ్రీం,

హ స క హ ల హ్రీం,

స క ల హ్రీం

తరవాత శ్రీం.

- ఇది మొత్తం సిలబస్ మనది. నేను మీకు అందజేయదలుచుకున్నది, మీకు వివరించదలుచుకున్నది ఇది.

ఫస్ట్ క్లాసులో సిలబస్ మొత్తం చెప్పేస్తాం కదా!
తరవాత మెల్లిగా స్టెప్ వైజ్ అర్థం చేసుకుంటాం.

- కాని సిలబస్ మీకు అర్థం అవ్వాలి కనుక, ప్రతీ రోజు నిద్రలేచి, పళ్ళు కూడా తోముకోకుండా, కళ్ళు కూడా తెరవకుండా మంచం మీదే కూర్చొని, ఒకసారి ఈ మంత్రాన్ని ఉచ్చారణ చేయండి.
- ఉచ్చారణ చేయటానికి ముందు ఈ మంత్రం మీలో నాటుకోవాలి. నేను మూడు సార్లు ఉచ్చారణ చేస్తాను.
ఈ మంత్రాన్ని మీరు స్వీకరించండి.

ఈ మంత్రము నేను చెప్పేదేం కాదది. ఋషులు చెప్పినటువంటి మంత్రము. టేప్‌రికార్డర్ లోంచి సౌండ్ వస్తే, టేప్‌రికార్డర్‌కేం తెలుసు ఏం సౌండు వస్తోందో?

ఈ గాయత్రీ మంత్రము నేను కనిపెట్టింది కాదు.
భూర్భువః స్వః అనే వ్యాహృతులు నేను కనిపెట్టినవి కాదు.
హ్రీం శ్రీం క్లీం అనేది నేను కనిపెట్టింది కాదు.



ఈ షోడశీవిద్య నేను కనిపెట్టింది కాదు.

ప్రపంచంలో ఎన్నో యుగాలబట్టీ వుంది.
దాన్ని మళ్ళా మనం తిరిగి ఉపయోగించుకుంటున్నాం అంతే.

ఒక టేప్ రికార్డర్‌లోంచి ఇంకొక టేప్ రికార్డర్‌లోకి రికార్డ్ అవుతోంది. ఇప్పుడు మీరూ టేప్ రికార్డరే, నేనూ టేప్ రికార్డరే. ఈ టేప్ రికార్డర్‌లోకి ముందు రికార్డయింది, మీకు తర్వాత రికార్డ్ అవుతోంది అంతే తేడా. కానీ రికార్డు అయిన దాన్ని ఉపయోగించుకోగలగాలి.

**ఎలా ఉపయోగించుకుంటారు?**

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః

అతను, ఎవడు అతను? సర్వజ్ఞుడు.
ఎవడు అతను? సర్వవ్యాపి.
ఎవడు అతను? సర్వసమర్థుడు.

ఆ గురువు యొక్క అనుగ్రహము, ఈ శబ్ద తరంగాల ద్వారా మీలోకి ప్రవేశిస్తోంది అనే భావన చేసుకోండి.

కళ్ళు మూసుకుని, రెండు కర్మేంద్రియాల నుంచి అలా లోపలికి హృదయంలోకి దిగుతోన్న భావన చేసుకోండి.

- మీరు నాతో పాటు ఉచ్చారణ చేయకండి. దింపుకోండి. రికార్డు చేసుకోండి మీరు.

ఆన్ చేసి ప్లే నొక్కితే సౌండు బయటకు వస్తుంది. రికార్డవదు కదా! రికార్డు చేయటానికి ఏం చేస్తాం? రెండూ నొక్కేస్తాం. రెండు చెవులు మీరు ఓపెన్‌గా ఉంచుకోండి. నోరు మూసేసుకోండి. శబ్దోచ్చా

రణ అసలు చేయకండి. మీకు తెలుసున్న మంత్రమే, కాని దింపుకోండి, అదే నా కోరిక. మూడుసార్లు నేను ఉచ్చారణ చేస్తాను.

☝ ఇప్పటి నుంచి మీరు అందరూ కూడ ఈ ఆధ్యాత్మిక విద్య స్టూడెంట్సే. ఎంచేతంటే, మీకు సిలబస్ అర్థమయింది కనుక.

కళ్ళు మూసుకోండి. నడుం నిటారుగా చేసుకొని, ఒక నిముషం సేపు నిశ్చింతగా కూర్చోండి. కళ్ళు మాత్రము మూసేసుకోండి.

☝ కళ్ళు మాత్రం ఎట్టి పరిస్థితులలోను తెరచి ఉంచకండి ఎవ్వరూ కూడ. మంత్రము స్వీకరించకపోయినా పర్వాలేదు.
కూర్చున్న వాళ్ళు మాత్రం కళ్ళు తెరచి ఉంచకండి.

మూడు సార్లు నేను మంత్రోచ్చారణ చేస్తున్నప్పుడు, మీరు ఉచ్చారణ చేయకండి. మీ రెండు చెవుల కర్మేంద్రియాల ద్వారా మీ హృదయంలోకి ఈ శబ్ద తరంగాలు దిగుతోన్న భావన, నాటుకుంటున్న భావన చేసుకోండి.

ఓం భూర్ భువః స్వః
హ్రీం శ్రీం క్లీం
తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి
ధియోయోనః ప్రచోదయాత్
హ్రీం శ్రీం క్లీం ఓం
క ఏ ఈ ల హ్రీం
హ స క హ ల హ్రీం
స క ల హ్రీం శ్రీం (3 సార్లు ఉచ్చారణ)



ఇప్పటి వరకూ చెప్పింది ఒకసారి రివ్యూ చేస్తాను.

- గురువు సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వసమర్థుడు.
- గురువు కోసము మీరు ఎక్కడకీ వెతకాల్సిన పనిలేదు.
- ఇక్కడే, ఈ క్షణంలోనే మీ ఆర్తిని అతడు అర్థం చేసుకోగలడు.

**ఆ గురువు ద్వారా మనము నేర్చుకుంటున్నది ఏమిటీ అంటే,**

స్థూల సూక్ష్మ కారణ శరీరాల యొక్క విరాట్ సంబంధము, పిండాండ - బ్రహ్మాండ సమన్వయము గాయత్రీ మంత్రము ద్వారా, షోడశీ విద్య ద్వారా నేర్చుకుంటున్నాం మనం.

ఈ నేర్చుకునేది మనం నిరంతరం మననం చేసుకోవటానికి ఇప్పుడు మీ హృదయాలలో నాటుకున్నటువంటి 52 అక్షరాలు ఉన్న టువంటి మంత్రము ఆధారము.

**నా అనుభవంలో అర్థమయింది ఏమిటంటే,**

- గురువుల యొక్క అనుగ్రహాన్ని ఆకర్షించగలిగేటటువంటి ఒక విచిత్రమైనటువంటి శక్తి ఈ అక్షర సముదాయానికి ఉంది.

అదీ మనం నేర్చుకున్నాం ఇప్పుడు.

ఇవన్నీ మీకు తెలుసున్నవే.
కొంచెం దాన్ని ఉపయోగించుకోవటం నేర్చుకోవాలి.

ప్రతీ వాళ్ళ ఇంట్లోనూ టీవీలు ఉండొచ్చు. కాని ఎవరు వాళ్ళ వాళ్ళ టీవీలు ఆన్ చేసుకుంటారో వాళ్ళకి ప్రోగ్రామ్స్ వస్తాయి. ఆన్ చేసుకోకపోతే రావు.

**ఏ స్విచ్‌ని, ఏ టీవీని ఆన్ చేసుకోవాలి?**

పిండాండము, ఈ శరీరాన్ని ఆన్ చేసుకోవాలి. శరీరమాద్యం ఖలు ధర్మసాధనం. ఈ శరీరము లేకుండా అసలు ధర్మ సాధనే లేదు. అందుకని ఈ శరీరానికి ఇంత ప్రాముఖ్యత.

**ఈ శరీరాన్ని ఇంత జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఎందుకు అంటే,**

టీవీలో ఏదో ఒక స్క్రూ పోయిందనుకోండి, ఒక ఛానెల్ రావటం లేదనుకోండి, ఆ ఛానెల్ వరకు మనకు ఆ టీవీ ఉపయోగ పడదు. అలాగే ఈ శరీరం కూడా.

ఈ శరీరాన్ని ఎలా పోషించుకోవాలి మనం? దీన్ని ఎంత జాగ్రత్తగా మనం పోషించుకోవాలి అనే దానికి చెప్పేదే ఇందాక నేను చెప్పినటువంటి మంత్రము.

24 స్థూల శరీరంలో ఉన్నటువంటి పాయింట్స్,

16 చేతనత్వములో ఉన్నటువంటి పాయింట్స్‌ని మనం ఈ సిలబస్‌లో అర్థం చేసుకోవాలి.





# 24 గంటలూ మీరు సాధకులే

**మొత్తం ఆధ్యాత్మిక విద్య యొక్క సిలబస్ ఏమిటంటే,**

❊ జాగ్రత, స్వప్న, సుషుప్తావస్థల్లో ఈ శరీరంలో ఉన్నటువంటి 24 పాయింట్స్‌ని, 16 చేతనత్వపు పాయింట్స్‌తో కలుపుట.

**దీనికి మనం మొదటి అడుగులు ఎలా వేస్తాం?**

❊ నిద్రలేచిన దగ్గర్నుంచి, నిద్రపోయేంత వరకూ కూడ మీరు సాధకులుగా మారితేనే ఫలితాలొస్తాయి.
ఏ క్షణంలో అయినా లింకు పోతే, రిజల్ట్సురావు.

నేను గుంటూరులో కెమిస్ట్రీ లెక్చరర్‌ని. మీరు ఎప్పుడు నన్ను కెమిస్ట్రీ అడిగినా స్విచ్ ఆనే. మీకు ఆ డౌటు అక్కర్లేదు. నేను ఏదైనా చెప్తూఉండొచ్చు. గబుక్కున మీరేదైనా కెమిస్ట్రీ గురించి అడిగారనుకోండి, చెప్పగలుగుతాను.

*అనన్యాశ్చింతయన్తో మాం యే జనాః పర్యుపాసతే*
*తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం*

(భ.గీ. 9-22)

ఎవరు ఇతర భావములు లేనివారై నన్ను గూర్చి చింతించుచు ఎడతెగక ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడు నా యందే నిష్ఠగల్గియుండు అట్టివారి యొక్క యోగక్షేమములను నేను వహించుచున్నాను.

ఇది జగద్గురువు అన్నటువంటి మాటలు.
గురువు మీకు రెండు పనులు చేసిపెడతానన్నాడు.

మీ యొక్క యోగానికి బాధ్యత నాది అన్నాడు.

**యోగము అంటే ఏమిటి?**

లేనిది ఇవ్వటం. ఆ యోగం లేదు కనుక రాలేదు అనుకుంటాంకదా! యోగం ఉంది కనుక వచ్చింది అనుకొంటాం.

అంచేత యోగం అంటే అర్థం ఏమిటి? లేనిది ఇచ్చుట.
క్షేమము - ఉన్నది కాపాడుట.

ఈ రెండూ చేస్తాడు జగద్గురువు. ఎప్పుడు? అనన్యాశ్చింతయన్తో మాం, అనన్యంగా మీరు సాధకులుగా మారితే.

**అనన్యంగా సాధకులుగా మారటానికి మీ బాధ్యతలను వదిలేసుకోవాలా?**

తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మరయుధ్యచ. నువు యుద్ధమే, యుద్ధం చేసేయ్యొచ్చు నువ్వు. ఏ విధంగా? సాధకుడిగా పిండాండ - బ్రహ్మాండ సమన్వయము చేసుకుంటూ.

నేను అనేకమంది గురువుల వద్ద సాధన నేర్చుకొని చేసినప్పటికి నా సాధన పరిణతి చెందినది మాత్రం హరిద్వార్‌లో పండిత శ్రీరామ శర్మ ఆచార్య గురుదేవుల వద్ద. కానీ ఆయన ఒక్కరే నాకు గురువా అంటే కాదు. 36 మందో, 37 మందో గురువులు ఉన్నారు.

అదేమిటి మాస్టారు, మీకు కరెక్టుగా తెలియదా? అంటే నాకు గుర్తున్న గురువులు వీరు. ఎందరి దగ్గరో నేను సాధన చేశాను. అందరి పేర్లూ గుర్తులేదు. ఎలిమెంటరీ స్కూలు నుండి, యూనివర్సిటీ వరకూ ఎంతో మంచి గురువులు ఉంటారు కదా! వాళ్ళందరి పేర్లూ ఎవరికి గుర్తుంటాయి? ముగ్గురో, నలుగురో గుర్తుంటారు అంతేకదా!



**ఇదంతా నేను ఎందుకు చెబుతున్నానంటే,**

గురువుల మీద మీకు సవ్యమైన అవగాహన రావటానికి చెబుతున్నాను తప్ప, గురువులను కించబరచాలని మాత్రం కాదు. గురువుల మీద పడకండి.

అనేక సాధనల పరిపక్వస్థితిలో ఆయన (పూజ్య గురుదేవులు) నాతో చెప్పిన పెద్ద విశేషమైన విషయం ఏమిటంటే,

❄ రామకృష్ణా! నువ్వు ఏమైనా చేయి ఫరవాలేదు. కానీ, సాధన మాత్రం రోజుకి కేవలం 24 గంటలు మాత్రమే చేయి. అంత కంటే ఎక్కువ నీవు చేయనక్కరలేదులే అనేవారు.

-- అదీ ఆయన దగ్గర నేను నేర్చుకున్నది.
అంతకంటే తక్కువ చేస్తే నువ్వు సాధకుడివే కాదు అన్నారు.
అదే నాకు ఆయన దగ్గర బాగా నచ్చింది.

సాధకుడంటే నిరంతరం - 24 గంటలూ సాధకుడే.
లెక్చరర్ అంటే ఇంటా బయటా 24 గంటలూ లెక్చరరే.
మీరు పోలీస్ ఆఫీసర్ అంటే 24 గంటలూ పోలీస్ ఆఫీసరే.

లేకపోతే ఇంట్లో నేను భర్తగా ఉద్యోగం చేస్తున్నాను, లేకపోతే అన్నగా ఉద్యోగం చేస్తున్నాను. బయట మాత్రం ఆఫీసరుగా ఉద్యోగం చేస్తున్నాను అనరుగా!

అలాగే సాధన 24 గంటలూ ఉండాలి. ఒక నిముషం తక్కువ చేసినా అది సాధన కాదని గుర్తుంచుకోండి.

✧❄✧

# సాధనలో ఉండవలసిన తీవ్రత

రవిశంకర్ మొట్టమొదటి సారి తన గురువు అల్లావుద్దీన్‌ఖాన్ దగ్గరికి వెళ్ళినపుడు ఆయన కుటుంబ సమేతంగా పెళ్ళికి వెళ్ళే హడావుడిలో వున్నాడు. ఆ టైమ్‌లో రవిశంకర్ వెళ్ళి సితార్ నేర్చుకోవ డానికి వచ్చానన్నాడు.

సాధారణంగా ఇప్పుడైతే మనం ముహూర్తం అవీ చూస్తాం గానీ,

***సాధారణంగా బెస్ట్ ముహూర్తం ఏమిటంటే,***

మీకు ఆ ఐడియా వచ్చినప్పుడే.

అంచేత శిష్యుడు వచ్చాడు. నేర్చుకుంటానన్నాడు.

✧ సాధారణంగా గురువు ఎప్పుడూ పోస్ట్‌ఫోన్ చేయడు. శిష్యుడే పోస్ట్‌ఫోన్‌మెంట్ చేసుకుంటాడు సాధనంతా.

గురువు వాయిదా వెయ్యలేదు. అందుచేత సితార్ తీసుకో, నేను పెళ్ళికి వెళ్ళాలి, ఈ రోజుకు సరిగమలు నేర్పుతాను అన్నాడు.

"సరే, నేను పెళ్ళికి వెళుతున్నాను. నేను తలుపు వేసి గొళ్ళెం పెట్టి వెళుతున్నాను. ఇక్కడ తాళం వదిలి వెళుతున్నాను. కాసేపు సాధన చేసుకొని నువ్వు వెళ్ళేటప్పుడుతాళం వేసి వెళ్ళు!" అని పెళ్ళికి వెళ్ళి పోయాడు. పెళ్ళికి వెళ్ళినవాళ్ళు ఆ రోజే రారుగా! మూడు రోజుల తరవాత వచ్చారు అల్లావుద్దీన్‌ఖాన్.

✧ ఈ 3 రోజులూ లేవకుండా రవిశంకర్ వాయిస్తూనే ఉన్నాడు.



-- అందుకే రవిశంకర్ అయ్యాడు. మనలో చాలామంది సరిగమ పదనిసలు నేర్చుకున్నారు. అవి అక్కడే ఉన్నాయి.

ఏదైనా గురువు యొక్క అనుగ్రహం లభిస్తే అయిపోతుంది అంటారు. నిజమే గురువుయొక్క అనుగ్రహం లభించాలి కానీ, గురువు యొక్క అనుగ్రహంతో మీరు ఎంతసేపు లాక్కొస్తారు బండిని.

***గురువు అనుగ్రహం మీదే పాకులాడటం అంటే ఎలా ఉంటుందంటే,***

ఎంబీబీఎస్‌లో ఒక స్టూడెంటు జాయినయ్యాడు. చదివాడు, హౌస్ సర్జన్ కూడా అయిపోయింది. ప్రాక్టీసు పెట్టాడు. పేషంటు వచ్చాడు. అప్పుడు వీడు ప్రొఫెసరు దగ్గరకు వెళ్ళినట్లుంటుంది.

***కానీ గురువు పని ఎంత వరకు?***

✧ తాత్కాలిక మైనటువంటి అవరోధాలు ఏమైనా వస్తే అవి పోగొ ట్టేంత వరకే గురువు యొక్క అనుగ్రహం.

-- సాధనలు మీరే చెయ్యాలి.

లాహిరీ మహాశయ ఎలాంటి సాధన చేశారో ఆయన జీవిత చరిత్ర చదివితే తెలుస్తుంది.

✧ నవరాత్రులలో ఆయన సాధన మొదలు పెట్టేవాడు, పదో రోజున ఆపేవాడు.

-- ఈ పది రోజులు నిద్రలేదు, ఆహారం లేదు, నిత్యకర్మలు లేవు.

-- అలా చేస్తే నాలుగు సంవత్సరాలు పట్టింది.

పురాణాల్లోని ఇద్దరి భక్తుల కథ మీకు తెలుసుకదా!

ఒక వనంలో ఇద్దరు భక్తులు తపస్సు చేస్తున్నారు. వైకుంఠానికి వెళుతున్న నారదునితో మొరపెట్టుకున్నారు. వాళ్ళ సాధన ఎంతవరకు వచ్చిందో, వాళ్ళకు మోక్షం ఎప్పుడు వస్తుందో కనుక్కుని రమ్మన్నారు.

సరే నారదుడు తిరిగి వచ్చేటపుడు ఒక భక్తుడు దగ్గరకు వెళ్ళి "నీకింకా 4 జన్మలు ఎత్తితేగాని మోక్షం రాదుట" అన్నాడు.

రెండో భక్తుడు "నా విషయం ఏమిటి?" అన్నాడు.

"వాడు 4 జన్మలు పడుతుంది అనగానే, ఇంకా 4 జన్మలా అని సాధన మానేశాడు నీ సంగతి చెబితే నువ్వూ సాధన మానేస్తావు. అసలు నీ సంగతి ఏమవుతుందో నాకు భయమేస్తోంది, చెప్పను" అన్నాడు. "ఫరవాలేదు చెప్పేయి" అన్నాడు రెండోవాడు.

"అయితే నువ్వు ఏ చెట్టు క్రింద కూర్చుని సాధన చేస్తున్నావో, ఆ చెట్టుకి ఎన్ని ఆకులున్నాయో అన్ని జన్మలు పడుతుందట, అప్పటికి నీ సాధన పరిపక్వమవుతుంది" అని అంటూ ఉండగానే అతను ఆనందంతో డ్యాన్స్ చేశాడట.

✧ "అష్టరాల్, ఒక చెట్టు ఆకులే కదా! వనంలో అన్ని చెట్లు వుంటే ఒక చెట్టు ఆకులే కదా!" అని డ్యాన్స్ చేయడం మొదలెట్టాడు. డ్యాన్స్ చేస్తూ, చేస్తూ ఉండగానే వచ్చేసిందట పరిపక్వత.

అలాగే ఏమో! మీకు ఈ క్షణంలోనే ఆ పిండాండ బ్రహ్మాండ సమన్వయం రావచ్చునేమో! రావచ్చు కూడా!

మీ పరిపక్వతను నేను అంచనా వేయలేను.



# ఓంకార సాధన

ఓం భూర్ భువః స్వః
హ్రీం శ్రీం క్లీం
తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి
ధియోయోనః ప్రచోదయాత్
హ్రీం శ్రీం క్లీం ఓం
క ఏ ఈ ల హ్రీం
హ స క హ ల హ్రీం
స క ల హ్రీం శ్రీం

నిద్రలేవగానే మొట్టమొదట ఉచ్చారణ చేయాల్సిన మంత్రం ఇది. ఎంచేతంటే, దీనిని నేను ఇవాళ రోజల్లా గుర్తుంచుకుంటాను అని ఆ విధంగా చేసుకొంటాం.

నిద్రలేవగానే భగవంతుని మొహం చూడమని చెబుతూ ఉంటాం లేకపోతే గురువు మొహం చూడమని చెబుతూ ఉంటాం. ఏమీ లేకపోతే ఆయుర్వేదంలో అద్దంలో మీ మొహం మీరు చూసు కోండి అని చెప్తారు.

ఈ పిండాండంతో నేను బ్రహ్మాండాన్ని సమన్వయం చేస్తాను అని గుర్తు చేసుకోవటానికి అద్దం చూసుకోమంటే మనం అద్దం చూసు కుంటాంగాని, మన మొహం కూడా మనం సరిగ్గా చూసుకోం.

భావన ముఖ్యం సాధనలో ఎప్పుడైనా.

ఈ భావనకి ముందు ఓంకార ఉచ్చారణ మనం నేర్చుకోవాలి.

పురుషసూక్తంలో మూడు ఏడులు ఇరవై ఒక్క సమిధలను ఉపయోగించుకొని ఈ విరాట్ బ్రహ్మాండము నిర్మించబడినది అని చెపుతూ ఉంటాడు. త్రిసప్తః సమిధకృతః

- ఓంకార ఉచ్చారణ ఈ 3 ఏడులు, 21 రకాలుగా చేయాలి మీరు.

ఆ ఓంకారంలోనే 3 ఏడులు, 21 సమిధల్ని ఉపయోగించుకోవడం నేర్చుకోవాలి.

ఆ 21 సమిధలను ఎలా ఉపయోగించుకుంటామో చూడండి.

అ అ అ అ అ అ అ
ఉ ఉ ఉ ఉ ఉ ఉ ఉ
మ్ మ్ మ్ మ్ మ్ మ్ మ్

ఒక్కొక్క దాంట్లో 7 భాగాలు రావాలి. ఏడు మాత్రలు రావాలి అని వేదభాషలో చెప్పుకుంటాం. మన మామూలు భాషలో చెప్పుకోవాలి అంటే 7 గ్యాప్స్ రావాలి.

అ అ అ అ అ అ అ 7 సార్లు అన్నాను.

అంటే ఏడు సార్లు నేను లెక్క పెట్టే టైంకి అ ఉచ్చారణ చేశాను.

అ అ అ అ అ అ అ - అంటే ఏడుసార్లు వేళ్ళు ఓపెన్ చేసే టైంకి అ ఉచ్చారణ చేశాను.



ఉ ఉ ఉ ఉ ఉ ఉ ఉ,
మ్ మ్ మ్ మ్ మ్ మ్ మ్.

అ - 7 ఉ - 7 మ - 7.

ఇలాగ 3 సార్లు ఓంకార ఉచ్చారణ చేయాలి.

ఓంకార ఉచ్చారణ చేసే విధానము అది.

**ఎందుకంటే నేను మీకు చెప్పానుకదా,**

మనకి జాగ్రద, స్వప్న, సుషుప్తావస్థల మధ్య సమన్వయం కావాలి. సమన్వయం చేయటానికి ఈ ఉచ్చారణ మీకు క్రమక్రమంగా ఎలా హెల్ప్ చేస్తుందో మిగతా క్లాసుల్లో చెప్పుకుంటూ వస్తాను. ముందు ఇది అలవాటు చేసుకోండి.

మీరు ఎప్పుడూ నిద్రలేవగానే ఓంకార ఉచ్చారణ ఇలా చేయండి. ముందు గాలి పీల్చుకోండి.

నిద్రలేచారు, మంచం మీద కూర్చున్నాం, పళ్ళు తోముకోవక్కరలేదు. పుసులు కడుక్కోవక్కర లేదు. ఏమీ చేసుకోక్కరలేదు.

అ అ అ అ అ అ అ
ఉ ఉ ఉ ఉ ఉ ఉ ఉ
మ్ మ్ మ్ మ్ మ్ మ్ మ్

ఇక్కడ మీరు ఇంకొకటి కలుపుకోండి,

మ్ మ్ మ్ మ్ అని మీరు అంటున్నప్పుడు పళ్ళు బిగించండి.

మ్ మ్ మ్ మ్ మ్ మ్ మ్.

✤ పై పళ్ళు, క్రింది పళ్ళు ఎప్పుడైతే నొక్కబడతాయో, ద్విజపంక్తి ద్వయోజ్వలా అని లలితా సహస్రనామంలో ఒక మంత్రం ఉంది. ఆ మంత్రం శరీరంలో యాక్టివేట్ అవుతుంది.

ఎలా యాక్టివేట్ అవుతుందనేది మనం తర్వాత చూద్దాం. ముందు స్విచ్ నొక్కుకొంటే చాలు.

అంచేత అ, ఉ మామూలుగానే అంటాం. మ్ మ్ మ్ అంటున్నప్పుడు పెదిమెలతో పాటు పళ్ళను కూడ వీలయినంత గట్టిగా నొక్కటానికి ట్రై చేయండి. గాలి పీల్చుకోండి.

అ అ అ అ అ అ అ
ఉ ఉ ఉ ఉ ఉ ఉ ఉ
మ్ మ్ మ్ మ్ మ్ మ్ మ్

ఈ విధంగా మూడు సార్లు ఓంకార ఉచ్చారణ చేసిన తరవాత అనుగ్రహ మాలామంత్రం ఒకసారి ఉచ్చారణ చేయండి.

ఓం భూర్ భువః స్వః హ్రీం శ్రీం క్లీం
తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి
ధియోయోనః ప్రచోదయాత్
హ్రీం శ్రీం క్లీం ఓం
క ఏ ఈ ల హ్రీం
హ స క హ ల హ్రీం
స క ల హ్రీం శ్రీం

✡ ✤ ✡



# స్థల ప్రదక్షిణ

✡ యోగవిద్య అంటేనే పిండాండ - బ్రహ్మాండ సమన్వయం.

ఈ యోగవిద్యను మర్చిపోయాం.

ఈనాడు మనం అనేక యోగాల పేర్లు వింటున్నాం. యోగాసనాలను కూడా యోగం అంటాం. మంత్రాలను కూడా యోగం అంటాం. కాని మన ఋషులు చెప్పిన యోగము ఇదేది కాదు.

దీనికి అథారిటీ ఏమిటి?

✡ జగద్గురువు శ్రీకృష్ణుడు కూడా ఏదైనా చెప్పవలసి వస్తే, ఇది నేను చెప్తున్నాననే వాడు కాదు. ఋషులు ఇలా చెప్పారు, కవులు ఇలా చెప్పారు అని చెప్పేవాడు.
మనం కూడా మంత్రద్రష్ట ఋషి ఇలా చెప్పారు అంటాం.
మన ఇష్టమొచ్చినట్లు చెప్పటానికి హక్కు లేదు.

సైన్సులో గ్రావిటేషన్ థీరీ చెప్పాలంటే న్యూటన్ ఏం చెప్పాడో చెప్పాలి. థీరీ ఆఫ్ రెలిటివిటి చెప్పాలి అంటే ఐన్‌స్టీన్ ఏం చెప్పాడో చెప్పాలి. ఆటమిక్ స్ట్రక్చర్ గురించి చెప్పాలి అంటే భోర్ ఏం చెప్పాడో, డాల్టన్ ఏం చెప్పాడో చెప్పాలి.

✡ ఆ మహాత్ముల పేర్లతో వాళ్ళు ఏం చెప్పారో అది చెప్పాలి తప్ప, మనం సొంతంగా నేనో థీరీ చెప్తున్నాను అనటానికి శాస్త్రంలో వీలు లేదు.

యోగము కూడా పూర్వకాలంలో ఒకటే యోగము ఉంది.

*ఏవం పరమ్పరాప్రాప్తమిమం రాజర్షయో విదుః*
*స కాలేనేహ మహతా యోగో నష్టః పరన్తప.* (భ.గీ. 4-2)

ఓ అర్జునా! ఈ ప్రకారముగ పరంపరగా వచ్చిన ఈ నిష్కామకర్మ యోగమును రాజర్షులు తెలిసికొనిరి. చాలకాలము గడచినందున ఆ యోగ మిపుడీ లోకమున అదృశ్యమైనది (ప్రచారములో లేకున్నది).

కాలచక్రంలో ఆ యోగము మర్చిపోయి, రకరకాలుగా దానికి సైడ్ ట్రాక్ అయిపోయి, మిగతా యోగాల జోలికి వెళ్ళాం.

✡ మిగతా యోగాల జోలికి ఎప్పుడైతే వెళ్ళామో, ఆ అనంతమైనటువంటి ఫలితాలు మనకి రావటం లేదు.

ఋషులు చెప్పింది 100 శాతం కరెక్టయి ఉండాలి. ఎంచేతంటే, ఋషులు సత్యవాక్కులు. వాళ్ళ నేచరది.

అసలు అతిశయోక్తి చెప్పడం వాళ్ళకి అలవాటు లేదు.

✡ ఒకవేళ వాళ్ళు ఏదైనా నోటితో అంటే, అది జరిగి తీరాలి. అది ఋషి వాక్కు యొక్క అమోఘత్వము.

*వాళ్ళు లలితాసహస్రనామం గురించి ఏం చెప్పారు,*

✡ దాహంగా ఉన్న ఒక వ్యక్తికి నీళ్ళిస్తే సరిపోవడం కాదు వాళ్ళు చెప్పేది, ఎడారిలో కోటి మంది దాహార్తులై ఉంటే, ప్రతి ఒక్కడికి మీరు ఒక్కొక్కడికి ఒక్కొక్క బావి చొప్పున కోటి బావులు తవ్వితే ఎంత పుణ్యం వస్తుందో అంత పుణ్యం వస్తుందని చెప్పి, చివరకి వాళ్ళకి చేతకాక అది ఎంత గొప్పదో మేం చెప్పలేం అంటారు.



అంత గొప్పదైన ఆ యోగవిద్యను మనం రకరకాలుగా భ్రష్టు పట్టించాం. ఎందుకు పట్టించాం అంటే, శాస్త్రాల జోలికి మనం వెళ్ళం.

యోగవిద్య గురించి కూడ స్పష్టమైనటువంటి అవగాహన భగవద్గీతలోనే ఉన్నా, భగవద్గీతను మనం ఎప్పుడైనా అధ్యయనం చేస్తేగా! అధ్యయనం చేయం మనం. అందులో ఏం చెప్పాడు?

*ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్*
*వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽబ్రవీత్.* (భ.గీ. 4-1)

నాశరహితమగు ఈ నిష్కామ కర్మయోగమును (తద్వారా పొంద బడు జ్ఞాననిష్ఠను) పూర్వము నేను సూర్యునకు జెప్పితిని. సూర్యుడు వైవస్వత మనువునకు ఉపదేశించెను. మనువు ఇక్ష్వాకునకు బోధించెను.

ఈ యోగవిద్యను మొట్టమొదట నేను సూర్యుడికి చెప్పాను అంటాడు. రామాయణం మొత్తం కూడ సూర్యవంశపు రాజుల చరిత్రలే. అంటే సూర్యోపాసకుల చరిత్రలే.

✡ యోగము అంటే సూర్యోపాసనే. సూర్యుడు దగ్గర నుంచి దిగొస్తుంది. యోగవిద్య ఇంకొక చోటు నుంచి రాదు.

రామాయణంలో రాముడు రావణాసురుడి ముందు యుద్ధానికి నుంచొని రావణాసురుడి పెర్సనాలిటీ చూసి గాభరాపడతాడు.

రాముడే కాదు, హనుమంతుడూ కన్ఫ్యూజ్ అవుతాడట. సీతను వెతకటానికి వెళతాడు హనుమంతుడు. సీతను వెతకటానికి వెళ్ళి, ఆ లంకా నగర వైభవాన్ని చూసి, ఈ రాముడు దగ్గర సర్వీసు చేయటం బదులు పార్టీ అలా గెంతేసి రావణాసురుడికి సర్వీసు చేస్తే

ఎంతో లాభం కదా అని ఒక సెకండు అనుకొంటాట్ట. ఆ వైభవం, ఆ లంకానగర వైభవం అలాంటిది.

ఇతన్ని గెలవటం ఎలాగ అని రాముడికీ అనిపించింది. అప్పుడు అగస్త్యుడు వస్తాడు. వచ్చి ఏం చెప్తాడక్కడ, ఆదిత్య హృదయాన్ని చెప్తాడు.

✡ సూర్యుడు! మీరు ఏదైనా సాధించదలుచుకొంటే ఈ ప్రపంచంలో, సూర్యుడే ఆధారం.

-- మనం జీవించి ఉండటానికి కారణం సూర్యుడే.

సూర్యుడే కారణమని సైంటిస్టులే చెప్తున్నారు, ఋషుల వరకూ వెళ్ళక్కర్లేదు మనం. ఒక ఐదారు రోజులు విపరీతంగా వర్షం కురిసి మేఘాలు వస్తే, సూర్యుణ్ణి చూడక ఎంత అల్లల్లాడిపోతామో!

ఈ సూర్యుడు మహాభారతంలోనూ కనిపిస్తాడు. మహాభారతానికి మూలస్తంభం అయినటువంటి పంచ పాండవులు ఎలా పుట్టారు? దూర్వాసుడు కుంతీదేవికి సూర్యమంత్రాన్ని ఇస్తాడు.

✡ కర్ణుడు ఒక్కడే సూర్యపుత్రుడు కాదు. మిగతా వాళ్ళు సూర్యపుత్రులే. ఆ సూర్యమంత్రం ద్వారా వచ్చిన వాళ్ళే.

-- ద్రౌపదికి అక్షయపాత్ర ఇస్తాడు. ఆ అక్షయపాత్ర ఎక్కడ్నుంచి వచ్చింది? సూర్యుడు దగ్గర్నుంచే.

-- శ్యమంతకమణి ఎక్కడ్నుంచి వచ్చింది? సూర్యుడి దగ్గర్నుంచే.

-- భారతీయ ఋషి సాంప్రదాయంలో ఎక్కడ ఏది వచ్చినా ప్రతీది సూర్యుడి దగ్గర్నుంచే, ఆ సవితా శక్తి దగ్గర్నుంచే వచ్చింది.



✡ మన యొక్క 24 శక్తులు, ఇందాక మనం చెప్పుకున్న గాయత్రీ మంత్రానికి కూడా అధిష్టాన దేవత ఎవరు?

ఆ సూర్యుడే.

ఆ యోగాన్ని వదిలేసి మనం తప్పుదారిన వెళ్ళిపోతున్నాం, ఏదేదో యోగానికి వెళ్ళిపోతున్నాం.

బేసిస్, ఫండమెంటల్స్‌ని వదిలేసి మీరు ఎక్కడికో వెళ్ళిపోతే ఫలితాలు ఎలా వస్తాయి? దాన్ని సవరించుకోవాలి మనం.

✡ కాని ఆ సూర్యుడి యొక్క జ్ఞానాన్ని, ఆ సూర్యుడు నుంచి వచ్చేటటువంటి యోగాన్ని డైరెక్టుగా పట్టుకునే సామర్థ్యము మనకు ఇంకా రాలేదు.

దివి సూర్య సహస్రస్య. విశ్వరూప దర్శనాన్ని నాకొక్కసారి చూపించమని అర్జునుడు అడుగుతాడు. చూపించమని అడగడు, నాకు చూసే అర్హత ఉంది అని నువ్వు అనుకుంటే చూపించు అంటాడు.

డైరెక్ట్‌గా గురువుని మనం ఏదీ డిమాండ్ చేయలేం.

నాకు ఆ సత్తా ఉంది, ఆ సామర్థ్యం ఉంది, నీ విశ్వరూపాన్ని నేను చూడగలను అని నువ్వు అనుకొంటే చెప్పు నాకు అంటాడు.

సరే నేనిస్తాన్లే, దివ్యం దదామి తే చక్షుః నీకు ఆ దివ్యమైనటువంటి చూపు నేనిస్తున్నాను కనుక నువ్వు చూడగలుగుతావు అంటే ఏం కనిపిస్తుందట అక్కడ?

దివిసూర్య సహస్రస్య, ఒకేసారి వెయ్యి సూర్యులు ఉదయిస్తే ఎంత కాంతి ఉంటుందో, అంత కాంతి కన్పించిందట.

✡ అంచేత డైరెక్ట్‌గా మీరు సూర్యుణ్ణి చూడలేరు.
డైరెక్ట్‌గా మీరు సూర్యయోగంలోకి వెళ్ళలేరు.

***మరి ఎలా ప్రవేశించాలి?***

సూర్యుడి నుంచి శక్తిని గ్రహించే నవగ్రహాలు ద్వారా ప్రవేశించాలి.

✡ మన శరీరంలో తొమ్మిది రంధ్రాలు ఉన్నాయి, 9 గ్రహాలు.

-- సూర్యుడి నుంచి వచ్చేటటువంటి తొమ్మిది రకాలైనటువంటి కిరణాలను, టెక్నికల్‌గా ఏడు రంగుల కిరణాలే వస్తాయి. ఏడు కిరణాలే. ఆ సూర్యుడి రథంలో కూడా సప్తాశ్వరథమారూఢం, ఆ ఏడు కిరణాలే అక్కడా చూపించబడి ఉంటాయి.

✡ ఆ ఏడు గ్రహాలు, ఏడు వారాలు -

-- నిత్యజీవితంలో ఉన్నటువంటి ఆధ్యాత్మికతను మనం మర్చి పోయాం. ఆ ఏడు వారాలు అవే.

✡ కాని ఈ ఏడు వారాలను ఇంకొక రెండింటితో మీరు కలుపు కోవాలి, నవగ్రహాలు. అంటే కుండలినీ శక్తితో కలుపుకోవాలి.

-- ఆ కుండలినీ శక్తికి ప్రతీక రాహువు, కేతువు.

***సాధారణంగా మనకి బుర్రలోకి ఎలా చొప్పించబడింది అంటే,***

రాహువు, కేతువు చాలా ప్రమాదకరమైన గ్రహాలు అని.

✡ కుండలినీ శక్తి ప్రమాదమే, ఎలక్ట్రిసిటీ కూడా ప్రమాదమే. చెయ్యిపెడితే టక్‌మని కొడుతుంది.

కానీ ఉపయోగించుకుంటున్నామా లేదా?



✡ అలాగే సూర్యుడి నుండి వచ్చే ఏడు కిరణాలను ఏడు గ్రహాలు, ప్లస్ కుండలినీశక్తికి పనికి వచ్చే రాహువు, కేతువు గ్రహాల ద్వారా మొత్తం నవగ్రహాలు ద్వారా మనం ఉపయోగించుకోవాలి.

✡ ఈ నవగ్రహాలు మన యోగవిద్యలో దిశలను తెలియజేస్తాయి.

ఇప్పుడు మనం దిశలను, గ్రహాలను మర్చిపోయాం.

తూర్పు అంటే ఏదో అతి కష్టం మీద మనకి తెలుస్తుంది తప్ప, మిగతా దిశలు ఎక్కడున్నాయి అంటే మనకి తెలీదు. నైరుతి, వాయువ్యము అదీ అంటే మా స్టూడెంట్సులో చాలా మందికి తెలీదు. మీలో కూడా చాలామందికి తెలీదనే అనుకుంటాను.

కాని అలా అనటంలో మీ మీద నిందారోపణ చేయటం కాదు. మన ఎడ్యుకేషన్ సిస్టమ్ అంత అందంగా ఉంది.

శ్రీ దిశారహిత జీవితం దిశారహితంగానే ఉంటుంది.
దిక్కు తోచకుండానే ఉన్నాం మనం.

ఎంచేతంటే, అసలు దిక్కులే తెలియవు ఎక్కడున్నాయో, ఏ దిక్కో. అది ముందు మనం తెలుసుకోవాలి.

✡ ఈ యోగవిద్యలో మొదటిపాఠంలో ఆ దిక్కుల గురించి తెలుసుకొంటూ, నవగ్రహాలు ద్వారా ఏ యే శక్తుల్ని మన శరీరంలోకి తీసుకొంటున్నామో తెలుసుకొందాం.

-- వాటిని ప్రతీరోజు మనం తీసుకొంటున్నాం.
అది మీకు ఇప్పుడు తెలీదంతే.

సైన్సు అంటే క్రొత్తదేం కనిపెట్టం. ఉన్నది అర్థం చేసుకుంటాం.

సైన్సులో గురుత్వాకర్షణ శక్తి గురించి చెప్తాం, ఎలక్ట్రిసిటీ గురించి చెప్తాం, కాంతి గురించి చెప్తాం, హీటు గురించి చెప్తాం, ఇవంతా క్రొత్తవా? ఇవంతా మీ అందరికీ తెలుసు.

***కాని సైన్సు చదివిన వాడికి, చదవని వాడికి తేడా ఏమిటంటే,***

సైన్సు చదివిన వాడు మీకు తెలుసున్న వాటన్నిటిని కూడ క్రమపద్ధతిలో ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకుంటాడు. మనం తెలియకుండా ఉపయోగించుకుంటూ ఉంటాం.

✡ ఇప్పుడు మనకి ఆ నవగ్రహాల శక్తి ద్వారానే ఈ శరీరం ఉన్నది. ఆ దిశల ద్వారానే అంతా మనం చేస్తున్నాం.

కాని ఏ దిశ నుంచి, ఏ గ్రహం నుంచి మన శరీరంలోకి ఏ శక్తి వెళుతోందో తెలీదు కనుక వాటి గురించి ఇప్పుడు తెలుసుకొందాం.

✧ నిద్రలేవగానే మూడు సార్లు ఓంకారము.

✧ అనుగ్రహ మాలామంత్రాన్ని ఒకసారి మనం ఉచ్చారణ చేశాం.

అంత వరకూ అయింది కదా!

✧ ఇప్పుడు నవగ్రహ దిక్పాలకుల ప్రార్థన చేయబోతున్నాం.

ఈ నవగ్రహ ప్రార్థన చేయటం, దిక్కుల గురించి తెలుసుకోవడంలో మన ఉద్దేశ్యం ఏమిటి?

✡ యోగవిద్య ద్వారా సూర్యుడ్ని ఆహ్వానించుకోవటం. సూర్యుడితో సంబంధం స్థాపించుకోవటం.

✡ జ్యోతిశ్శాస్త్రములో సూర్యుడు ఆత్మకు ప్రతీక.



✡ సూర్యగ్రహము వల్ల మానవ శరీరంలో అనాహత చక్రం ఏర్పడుతుంది.

✧ చేతులు పైకెత్తి సూర్యుణ్ణి ఆవాహన చేసుకొని మన హృదయంలోకి దింపుకుందాం.

✡ సూర్యుడు ఎప్పుడైతే మన హృదయంలోకి దిగుతాడో, జీవితంలో దిక్కులు ఏర్పడతాయి.

ఓం సూర్యాయ నమః

హృదయంలోకి సూర్యుడ్ని ఆవాహన చేసుకున్నాక గదిలో మనం ఈశాన్యం వైపుకి వెళతాం.

✧ ఈ ప్రదక్షిణ ఈశాన్యం నుంచి మొదలెడతాం. మీ ఇంట్లో మీ పడగ్గదిలో కూడ మీరు ఇదే కార్యక్రమం చేసుకోండి.

## ఈశాన్యము

✡ ఈశాన్యానికి బుధగ్రహం అధిపతిగా ఉంటాడు.

-- ఈ బుధగ్రహము సూర్యకిరణాలలోని 4 వ కిరణం అయిన విశ్వకర్మా కిరణాలతో ఏర్పడుతుంది.

-- బుధగ్రహం నుంచి బహిర్గతమయ్యే కిరణాలు ఆకుపచ్చ రంగులో ఉంటాయి.

-- బుధగ్రహం వల్ల మణిపూరక చక్రం ఏర్పడుతుంది.

-- ఈ బుధగ్రహము యొక్క కిరణాలు మన శరీరంలో ఉన్న ఏడు గణాలకు అధిపతి. అందుకే గణాధిపతి అంటాం.

అయుర్వేదం ప్రకారం మన శరీరంలో ఏడు గణాలు ఉన్నాయి. దాని డీటైల్సులోకి మనం వెళితే అలా సిలబస్ పెరిగి పోతుంది. మీరు కన్‌ఫ్యూజ్ అవకుండా దాని వెనకాతల ఉన్నటువంటి సైన్సు అర్థమవటానికి ఇది చెప్తున్నాను.

✡ మన శరీరంలో ఉన్నటువంటి ఏడు గణాలకు అధిపతి కనుక, ఈ ఏడు గణాలు సవ్యంగా ఉంటే ఏ విఘ్నము రాదు మీకు.

-- అందువల్ల గణాధిపతిని విఘ్ననాయకుడు అంటాం.

అంచేత ఈశాన్యం వైపు తిరిగి మనము,

ఓం బుధాయ నమః
ఓం గణాధిపతయే నమః

✧ ప్రదక్షిణ గదిలో అక్కడ్నుంచి మెల్లిగా తూర్పువైపుకు నడవండి.

ఇక్కడ మీ జీవితంలో ఏం జరుగుతోందో అర్థం చేసుకోండి. మీ జీవితానికి ఉపయోగపడే సాధన నేర్చుకుంటున్నాం మనం.

ఈశాన్యదిశలో బుద్ధి.

**గాయత్రీ మంత్రం ఏమిటి?**

ధియోయోనః ప్రచోదయాత్, బుద్ధిని ప్రచోదన చేసే మంత్రము.

బుద్ధి, ధీశక్తి కోసం బుధుణ్ణి ప్రార్థన చేశాం. బుద్ధి ఎంత ఉంటే బావుంటుంది? ఎంత బుద్ధి ఉంటే అంత బావుంటుంది.

✡ అంచేత వాస్తులో ఈశాన్యం ఎంత పెరిగితే అంత మంచిది అంటాం. ఎంత బుద్ధి ఉంటే అంత మంచిదికదా!



✡ అంచేత మీరు ఈ సాధనలు చేస్తూ ఉంటే ఋషులు ఏర్పాటు చేసిన నియమాలలోని శాస్త్రీయత కూడా మీకు అర్థమవుతుంది.

## తూర్పు

✡ తూర్పుదిశకు శుక్రగ్రహం అధిపతిగా ఉంటాడు.

-- ఈ శుక్రగ్రహం సూర్యకిరణాలలోని విశ్వవ్యచ కిరణాలతో ఏర్పడుతుంది.

-- శుక్రగ్రహం నుంచి బహిర్గతమయ్యే కిరణాలు నీలి రంగులో ఉంటాయి.

-- శుక్రగ్రహం వల్ల విశుద్ధి చక్రం ఏర్పడుతుంది.

ఓం శుక్రాయనమః

✡ శుక్రుడు అంటే బీజము. ఈ బీజము ఎంత ఎక్కువ స్థలం ఉంటే అంత బాగా అభివృద్ధి చెందుతుంది.

-- తల్లి గర్భంలో ఉన్న బీజానికి కూడా ఎంత విశాలంగా బాగా ఉంటే అంత బాగా పెరుగుతుంది.

✡ కనుక మన వాస్తులో తూర్పు ఎంత ఖాళీగా ఉంటే అంత మంచిది అని చెప్తాం

✡ గ్రోయింగ్, గ్రోత్ ఈ తూర్పు దిశ ద్వారా, శుక్రగ్రహం ద్వారా కంట్రోలు అవుతుంది.

ఈ గ్రోత్ మన చేతిలో లేదు. విత్తనం నాటాం, నీళ్ళు పోస్తాం, సూర్యకిరణాలు తగులుతూ ఉంటాయి.

***కాని ఆ అభివృద్ధి చెందే విధానం ఏమిటి?***

విత్తనం బట్టే అభివృద్ధి చెందుతుంది తప్ప మన ఇష్టాను సారము అభివృద్ధి చెందదు.

✡ దేవతలు ఎలాంటి బీజాన్ని వృద్ధి చెందిస్తారో అలాంటి బీజము వృద్ధి చెందుతుంది కనుక, ఓం దేవాధిపతయే నమః

ఇప్పుడు రెండూ కలిపి చెబుదాం.

ఓం శుక్రాయ నమః
ఓం దేవాధిపతయే నమః

✧ అక్కడ్నుంచి బయలుదేరి ఆగ్నేయానికి రండి.

## ఆగ్నేయము

✡ ఆగ్నేయదిశకు చంద్రగ్రహం అధిపతిగా ఉంటాడు.

-- ఈ చంద్రగ్రహం సూర్యకిరణాలలోని సుషుమ్నా, సురాదన కిరణాలతో ఏర్పడుతుంది.

-- కాషాయ రంగు కిరణాలు.

-- చంద్రగ్రహం వల్ల స్వాధిష్ఠాన చక్రం ఏర్పడుతుంది.

ఈ దిక్కు చాలా ముఖ్యమైనటువంటి దిక్కు. శిరిడీ సాయి యొక్క ధుని కానివ్వండి, గురుదేవులు ప్రజ్వలింపజేసినటువంటి అగ్ని కానివ్వండి, ఆగ్నేయ దిశ, అగ్ని యొక్క దిశ.

కాని అగ్ని యొక్క అసలైన రహస్యం మర్చిపోయాం మనం. వేదాలు అధ్యయనం చేయాలంటే, ఇందాక మనం అనుకొన్నాం కదా, అంతా వేదాల్లో ఉంది! అని. కాని వేదాల్లో ఉన్నది మనకు ఎందుకు అర్థం కావటం లేదు అంటే, వేదాది సూక్తాన్ని మనం మర్చిపోయాం.



✡ వేదములో, ఋగ్వేదంలో మొట్టమొదట ఉండేటటువంటి సూక్తము, వేదము యొక్క ఆదిసూక్తము, అగ్నిసూక్తము.

ఆ అగ్ని ఈ దిశలో ఉంటుంది.

✡ ఈ దిశకి అధిపతి చంద్రుడు, అంటే మన మనస్సు.

***ఈనాడు మన మనస్సు ఎలా ఉంది?***

డబ్బుకి బానిసయిపోయింది,
కోరికలకు బానిసయిపోయింది.

***కాని అగ్ని అంటే వేదాంలో ఉన్నటువంటి అర్థమేమిటంటే,***

అగ్రేనయతి ఇతి అగ్నిః
ముందు నుంచొని మనల్ని నడిపించేది.

మనల్ని ప్రస్తుతం నడిపించేవి ఏమిటి? కోరికలు.

***కాని వేదాలు ఏం కోరుకుంటున్నాయి అంటే,***

శ్రీ కోరికలకు మీరు బానిసలు కాకండి.
ఆదర్శానికి బానిసలు కండి.

-- ఆదర్శము మీ ముందు ఉండి, ఆ ఆదర్శం ఏ పథంలో అయితే మిమ్మల్ని నడిపిస్తోందో, ఆ పథంలో మీరు నడవండి.

మనం ఇప్పుడు ఆదర్శాల్ని మర్చిపోయాం. ఆదర్శాలను ఎప్పుడైతే మర్చిపోయామో, అగ్ని కూడా అప్పుడు పనిచేయడం మానేస్తుంది.

✡ నిజమైనటువంటి అగ్ని ఆదర్శము.

ఆ ఆదర్శాన్ని ఎలా ఉపయోగించుకోవాలి, ఇదంతా కూడా అగ్నిసూక్తాన్ని మనం తరవాత క్లాసులో చదివినప్పుడు చదువుకుందాం.

**కాని ఈ మూడు దిశలకు నేను ఎందుకు ఇంపార్టెన్స్ ఇస్తున్నాను అంటే,**

ఈ వాస్తుకాని, ఋషులు చెప్పినటువంటి ప్రతీది కూడ అద్భుతమైనటువంటి విజ్ఞానం మీద ఆధారపడి ఉంది.

ఆ విజ్ఞానాన్ని కనుక మళ్ళీ మనం తిరిగి మన జీవితాల్లో తెచ్చుకుంటే అద్భుతమైనటువంటి ఫలితాలు వస్తాయి కనుక ఆగ్నేయ దిశలో తేజస్సును ఇచ్చేటటువంటి చంద్రుడికి నమస్కారం చేస్తూ,

ఓం చంద్రాయ నమః
ఓం తేజోధిపతయే నమః

✧ దక్షిణానికి రండి.

## దక్షిణము

✡ దక్షిణ దిశకు కుజగ్రహం అధిపతిగా ఉంటాడు.

-- ఈ కుజగ్రహం సూర్యుని యొక్క 3 వ కిరణం అయిన ఉదన్వసు కిరణంతో ఏర్పడుతుంది.

-- ఎరుపు రంగు కిరణాలు.

-- కుజగ్రహం వల్ల సహస్రార చక్రం ఏర్పడుతుంది.

ఇక్కడ మన జీవితాన్ని ఒక ప్రదక్షిణ ద్వారా కలుపుకుంటున్నాం. నిద్రలేచాం, ఏం చేస్తున్నాం? ఇలాగ చుట్టూ తిరుగుతున్నాం.



అంటే మనం ఒక కంచె వేసుకుంటున్నాం.

**ఏమని వేసుకున్నాం?**

బుద్ధిని ఉపయోగిస్తాను,
బుద్ధి ద్వారా సక్రమమైనటువంటి బీజాన్ని నాటుకుంటాను.

**సక్రమమైనటువంటి బీజాలు ఎలా ఉండాలి?**

ఆదర్శోచితమైనటువంటివిగా ఉండాలి.

నిజమే! బుద్ధి ఉంది,
సక్రమమైనటువంటి బీజము అంటే ఒక ఆలోచన వేశాను.
ఆదర్శం ఉంది.
కానీ పనిముట్లు లేకపోతే?

జన్మభూమి కార్యక్రమం అంటూ మొదలెట్టాం. కాని దానికి కావలసినటువంటి గునపాలు, పారలు లేవు. ఏం చేస్తారు మీరు?

అంచేత పనిముట్లు కావాలి.

✡ కుజుడు, దక్షిణ దిశలో ఉన్నటువంటి గ్రహము కుజుడు, అంగారకుడు, పనిముట్లకి అధిపతి, ప్రేతాధిపతి.

-- ప్రేతాధిపతి అంటే పనిముట్లకి అధిపతి.

అంచేత,

ఓం కుజాయ నమః
ఓం ప్రేతాధిపతయే నమః

✧ అటు నుంచి నైరుతికి రండి.

✡ నిజమైనటువంటి అగ్ని ఆదర్శము.

ఆ ఆదర్శాన్ని ఎలా ఉపయోగించుకోవాలి, ఇదంతా కూడా అగ్నిసూక్తాన్ని మనం తరవాత క్లాసులో చదివినప్పుడు చదువుకుందాం.

**కాని ఈ మూడు దిశలకు నేను ఎందుకు ఇంపార్టెన్స్ ఇస్తున్నాను అంటే,**

ఈ వాస్తుకాని, ఋషులు చెప్పినటువంటి ప్రతీది కూడ అద్భుతమైనటువంటి విజ్ఞానం మీద ఆధారపడి ఉంది.

ఆ విజ్ఞానాన్ని కనుక మళ్ళీ మనం తిరిగి మన జీవితాల్లో తెచ్చుకుంటే అద్భుతమైనటువంటి ఫలితాలు వస్తాయి కనుక ఆగ్నేయ దిశలో తేజస్సును ఇచ్చేటటువంటి చంద్రుడికి నమస్కారం చేస్తూ,

ఓం చంద్రాయ నమః
ఓం తేజోధిపతయే నమః

✧ దక్షిణానికి రండి.

## దక్షిణము

✡ దక్షిణ దిశకు కుజగ్రహం అధిపతిగా ఉంటాడు.

-- ఈ కుజగ్రహం సూర్యుని యొక్క 3 వ కిరణం అయిన ఉదన్వసు కిరణంతో ఏర్పడుతుంది.

-- ఎరుపు రంగు కిరణాలు.

-- కుజగ్రహం వల్ల సహస్రార చక్రం ఏర్పడుతుంది.

ఇక్కడ మన జీవితాన్ని ఒక ప్రదక్షిణ ద్వారా కలుపుకుంటు న్నాం. నిద్రలేచాం, ఏం చేస్తున్నాం? ఇలాగ చుట్టూ తిరుగుతున్నాం.



అంటే మనం ఒక కంచె వేసుకుంటున్నాం.

**ఏమని వేసుకున్నాం?**

బుద్ధిని ఉపయోగిస్తాను,

బుద్ధి ద్వారా సక్రమమైనటువంటి బీజాన్ని నాటుకుంటాను.

**సక్రమమైనటువంటి బీజాలు ఎలా ఉండాలి?**

ఆదర్శోచితమైనటువంటివిగా ఉండాలి.

నిజమే! బుద్ధి ఉంది,
సక్రమమైనటువంటి బీజము అంటే ఒక ఆలోచన వేశాను.
ఆదర్శం ఉంది.
కానీ పనిముట్లు లేకపోతే?

జన్మభూమి కార్యక్రమం అంటూ మొదలెట్టాం. కాని దానికి కావలసినటువంటి గునపాలు, పారలు లేవు. ఏం చేస్తారు మీరు?

అంచేత పనిముట్లు కావాలి.

✡ కుజుడు, దక్షిణ దిశలో ఉన్నటువంటి గ్రహము కుజుడు, అంగారకుడు, పనిముట్లకి అధిపతి, ప్రేతాధిపతి.

-- ప్రేతాధిపతి అంటే పనిముట్లకి అధిపతి.

అంచేత,

ఓం కుజాయ నమః
ఓం ప్రేతాధిపతయే నమః

✧ అటు నుంచి నైరుతికి రండి.

## నైరుతి

✡ నైరుతి దిశకు రాహువు అధిపతిగా ఉంటాడు.

-- ఈ రాహుగ్రహం సూర్యుని యొక్క హరికేశ కిరణాల వల్ల ఏర్పడుతుంది.

-- ముదురు ఇండిగో (వంకాయ రంగు) రంగు కిరణాలు.

✡ ఇక్కడ మొట్ట మొదటిసారి మనం కుండలినీ శక్తిని ఉపయోగించుకుంటాం.

శ్రీ కుండలినీ శక్తిని ఎప్పుడు, ఎక్కడ ఉపయోగించుకోవాలో చూడండి.

"కుండలినీ జాగరణ అయిపోవాలి మాస్టారు!" అని చాలా మంది అడుగుతారు.

శ్రీ కుండలినీ జాగరణ అవ్వాలి అంటే ఇంత అవ్వాలి.

-- బుద్ధి ద్వారా

-- సక్రమమైన ఆలోచనల ద్వారా

-- ఆదర్శం వైపు

-- పనిముట్లతో మీరు రెడీగా ఉంటే అప్పుడు కుండలినీ జాగరణ యొక్క మొదటి మెట్టుకి వస్తాం.

ఓం రాహవే నమః

ఓం రక్షోధిపతయే నమః

✧ అక్కడ నుంచి పశ్చిమానికి వస్తాం.



## పశ్చిమం

✡ పశ్చిమదిశకు శనిగ్రహం అధిపతిగా ఉంటాడు.

-- ఈ శనిగ్రహం సూర్యుని యొక్క విశ్వవ్యచ కిరణాలతో ఏర్పడుతుంది.

-- లేత ఇండిగో రంగు కిరణాలు.

-- శనిగ్రహం వల్ల మానవ శరీరంలో మూలాధార చక్రం ఏర్పడుతుంది.

ఇది చాలా ప్రముఖమైనటువంటి దిశ.

✡ ఈనాడు ప్రకృతిలో జరుగుతున్నటువంటి దిశ కూడా ఇదే.

-- ప్రాక్ పశ్చిమాల కలయిక. ఈస్ట్ అండ్ వెస్ట్ రెండింటి యొక్క కలయికకి మనం ప్రయత్నం చేస్తున్నాం.

ఎలాగో ఏమిటో తరవాత చూద్దాం.

మీరు ఈ సాధనా విధానాన్ని మాత్రం దయచేసి మర్చిపోకండి. ఉత్తినే నోటితో అనేస్తే లాభం లేదు.

✡ బుద్ధి ద్వారా సక్రమమైనటువంటి ఆలోచనలను ఆదర్శంతో కలిపి దానికి తగిన పనిముట్లను ఏర్పాటు చేసుకుని శక్తిని పెంచుకున్నాం, కుండలినీని ఆన్ చేశాం.

ఆన్ చేసినంత మాత్రాన తొందర పడితే లాభం లేదు.

✡ శనైశ్చరాయ నమః - మీరు అనుకున్నటువంటి ప్రోగ్రామ్‌లు ఒక రోజులోనో, రెండు రోజుల్లోనో జరిగేది కాదు.

✡ ఆత్మజ్ఞానం పొందడమనేది ఒక్కొక్కసారి కొన్ని జన్మలు పడుతుంది.

✡ శనైశ్చరాయ నమః - మెల్లి మెల్లిగా నడుస్తాను, నేను ఏమీ తొందరపడను అనేటటువంటి నిర్ణయము.

ఓం శనైశ్చరాయ నమః
ఓం జలాధిపతయే నమః

## వాయువ్యం

✡ వాయువ్య దిశకు కేతుగ్రహం అధిపతిగా ఉంటాడు.

-- ఈ గ్రహం సూర్యుని హరికేశ కిరణాలతో ఏర్పడుతుంది.

-- ఇన్‌ఫ్రా రెడ్ కిరణాలు

✡ కుండలినీ జాగరణలో శ్వాస, ప్రాణశక్తి చాలా ప్రముఖ పాత్ర వహిస్తుంది. అది కేతుగ్రహం చేస్తుంది.

✡ కేతువు అన్నా, కేతనము అన్నా ఇల్లు అని, శరీరము అని అర్థం.

ఈ శరీరాన్ని ఉపయోగించుకునే ఏదైనా చేయగలం. ఈ శరీరం లేకపోతే ఏం చేయలేమని గుర్తుంచుకొంటూ, ఓం కేతవే నమః

కాని శరీరం ఉండి అందులో ప్రాణం లేకపోతే ఏం లాభం?
అంచేత ఆ దిశకు అధిపతి, ఓం ప్రాణాధిపతయే నమః

మళ్ళీ,

ఓం కేతవే నమః
ఓం ప్రాణాధిపతయే నమః



## ఉత్తరం

✡ ఉత్తర దిశకు గురుగ్రహం అధిపతిగా ఉంటాడు.

-- ఈ గురుగ్రహం సూర్యుని యొక్క ఉదావసు కిరణాలతో ఏర్పడుతుంది.

-- ఆకాశ నీలి రంగు కిరణాలు.

-- గురుగ్రహం వల్ల ఆజ్ఞా చక్రం ఏర్పడుతుంది.

✡ ఇంతవరకూ వచ్చాక కాని ఈ డ్రామాలోకి గురువు ప్రవేశించడు. మనం ఇమ్మీడియేట్‌గా గురువు కావాలంటాం.

✡ రాహువు, కేతువు ద్వారా కుండలినీ జాగరణ చేసుకుంటే తప్ప, ఉత్తరదిశలో గురువు వచ్చినా మీకు ఉపయోగపడడు.

లేకపోతే ఏం లాభం?
ముందు మనకి బ్యాక్ గ్రౌండ్ రావాలి కదా!

అంచేత ఈ దిశలో,

ఓం గురవే నమః
ఓం ధనాధిపతయే నమః

✡ గురువు ఉండగా ధనం వస్తే లాభం తప్ప, లేకపోతే ఇప్పుడున్న ధనమే!

-- అన్ని రకాల సౌకర్యాలు మనకు ఇప్పుడు ఉన్నాయి. ఎవడూ సుఖంగా లేడు.

ఎండాకాలంలో ఏసీలు ఉన్నాయి, వర్షాకాలంలో గొడుగులు

ఉన్నాయి, కాంక్రీట్‌రూఫ్స్ ఉన్నాయి, చలికాలంలో హీటర్స్ ఉన్నాయి.

అన్ని రకాల సంపదలు మీకు ఉన్నాయి. కాని ఎవడైనా నిజంగా ఆనందంగా ఉన్నాడా అంటే ఎవడూ ఆనందంగా లేడు. ఎలా ఉంటాడు? ఆనందంగా ఉండాలంటే గురువు అనుగ్రహం కావాలి.

ఇది ఈ నవగ్రహాల యొక్క అర్థం.

✡ ఎక్కడో ఏవో గ్రహాలు అనుకోకండి. మీ శరీరంలోకి ఈ ఎనిమిది దిక్కుల నుంచి గ్రహాల యొక్క అనుగ్రహం వర్షిస్తోంది.

పై నుంచి సూర్యుడు, చుట్టూరా ఇవి 8, క్రిందన ఉన్న భూమి.

ఈ భూమ్మీద కదా నుంచొని మనమంతా చేస్తున్నాం.
అంచేత గురువుకి నమస్కారం చేసుకున్నాక,

✧ భూమికి నమస్కారం చేస్తాం.

ఓం పృథ్వీత్వయా ధృతాలోకా దేవీత్వం విష్ణునాధృతా
త్వంచ ధారయమాం దేవీ పవిత్రం కురుచాసనమ్.

ఇదీ ప్రదక్షిణ. వివరించి చెప్పటానికి నాకింత టైం పట్టిందికాని, మీరు ఇది రోజూ చేసుకోవటానికి రెండు నిముషాలు చాలు.

✡ నిద్ర లేచిన దగ్గర్నుంచి ఈ కార్యక్రమం ద్వారా మనల్ని మనం అనుగ్రహంతో చుట్టుకుంటున్నాం.

శ్రీ మన జీవితంలో మన జాతక చక్రంలో గ్రహాలు ఎలా వున్నా, ఆ రోజు మాత్రం కచ్చితంగా మీకు ఈ గ్రహాలు యొక్క అనుకూలత ఉంటుంది.



-- ఎంచేతంటే, ఆ స్విచ్ మీరు నొక్కుకున్నారు కనుక.

**అంచేత మనం ఇక్కడ ఏం చేస్తున్నాం,**

✧ నిద్రలేవగానే మూడు సార్లు అ ఉ మ ఓంకారం చేస్తాం.

✧ అనుగ్రహ మాలామంత్రాన్ని ఒకసారి ఉచ్చారణ చేస్తాం.

✧ ఓం సూర్యాయ నమః అంటూ సూర్యుణ్ణి మన హృదయంలోకి దింపుకొని తరవాత మంచం దిగి ఈశాన్యం వైపు వెళతాం.

| | | |
|---|---|---|
| ఈశాన్యం | ఓం బుధాయ నమః | ఓం గణాధిపతయే నమః |
| తూర్పు | ఓం శుక్రాయ నమః | ఓం దేవాధిపతయే నమః |
| ఆగ్నేయం | ఓం చంద్రాయ నమః | ఓం తేజోధిపతయే నమః |
| దక్షిణం | ఓం కుజాయనమః | ఓం ప్రేతాధిపతయే నమః |
| నైరుతి | ఓం రాహవే నమః | ఓం రక్షోధిపతయేనమః |
| పశ్చిమం | ఓం శనైశ్చరాయ నమః | ఓం జలాధిపతయే నమః |
| వాయువ్యం | ఓం కేతవే నమః | ఓం ప్రాణాధిపతయే నమః |
| ఉత్తరం | ఓం గురువే నమః | ఓం ధనాధిపతయే నమః |

✧ భూమాతకు నమస్కారం చేస్తాం.

ఓం పృథ్వీత్వయా ధృతాలోకా దేవీత్వం విష్ణునాధృతా
త్వంచ ధారయమాం దేవీ పవిత్రం కురుచాసనమ్

రెండు నిముషాలు పట్టింది.
కాని రెండు నిముషాల్లో మీ జీవితం మారిపోయింది.

✧ నిద్రలేచారు,


-- స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలను విరాట్ స్థూల సూక్ష్మ కారణ

శరీరాలలో కలుపుకుంటూ, ఈ శరీరంలో ఉన్న 24 జడశక్తులను, గురువు యొక్క 16 చేతనత్వములలో కలుపుకుంటూ,

-- సూర్యుడు యొక్క శక్తిని నాలో దింపుకుంటూ,

-- రక్షణ పొందుతూ,

-- ఈ పృధ్వి మీద సంచరిస్తున్నాను అనే నిర్ణయం తీసుకుని మన కార్యక్రమాలు మొదలుపెడతాం.






## సాహిత్యం వివరాలు

| | | |
|---|---|---|
| 1. | పతంజలి యోగసూత్రాలు | 150.00 |
| 2. | సీక్రెట్ డాక్ట్రిన్ ఉపన్యాసాలు | 375.00 |
| 3. | సావిత్రి ఉపన్యాసాలు | 210.00 |
| 4. | ఐశ్వర్యము యొక్క మానసికస్థితి | 160.00 |
| 5. | భగవద్గీత ఉపన్యాసాలు 5 భాగాలు | 670.00 |
| 6. | ఆణిముత్యాలు (పై 5 భాగాల ముఖ్యాంశాలు) | 130.00 |
| 7. | మాస్టర్ ఆర్.కె. లెటర్స్ | 150.00 |
| 8. | నవయుగాన్ని నిర్మించే సావిత్రీ సాధన | 150.00 |
| 9. | యూనివర్సల్ మైండ్ | 130.00 |
| 10. | అమృతత్వ విద్య | 120.00 |
| 11. | ఆహార విజ్ఞానము | 60.00 |
| 12. | ఆత్మకథ | 60.00 |
| 13. | అకల్ట్ అనాటమీ, వాస్తు, ఆస్ట్రాలజీ, హోమియోపతి | 40.00 |
| 14. | విశిష్ట యోగసాధనలు | 40.00 |
| 15. | భూమిపై సశరీరముగా ఉన్న కల్కి అవతారము | 40.00 |
| 16. | ప్రాక్టికల్ థియాసఫీ | 30.00 |
| 17. | శ్వాస ధ్యానము | 20.00 |
| 18. | శ్రీసూక్తము | 20.00 |
| 19. | ప్రకృతి ఎల్లప్పుడూ కరెక్టే | 15.00 |
| 20. | స్వర్ణయుగము మాసపత్రిక సంవత్సర చందా | 240.00 |

**ప్రతులకు :**

పి. సీతారాముడు, కోమటిగుంట, కాళ్ళ మండలము, ప.గో. జిల్లా. 534 237. ఫోన్ నెం. : 90106 47325, 08816 - 241359.